PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 48 | విజయవాడ, బుధవారం 18 సెప్టెంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 18 September 2024 | Rs



ఆసియా చాంప్ భారత్

ఫైనల్లో చైనాపై 1-0తో గెలుపు

ఐదోసారి ట్రోఫీ చేజిక్కించుకొన్న హర్మన్‌ప్రీత్ సేన

8

మునిగిన ప్రతి ఇంటికి రూ.25వేలు



- రూరల్‌లో రూ.10వేలు
- 2,72,727 కుటుంబాలకు పరిహారం
- పత్తి, వేరుశెనగ, చెరకు, వరి హెక్టారుకు రూ.25వేలు
- బుడమేరు ఆక్రమణల తొలగింపు తథ్యం
- సిఎం చంద్రబాబునాయుడు



మీడియాతో మాట్లాడుతున్నచంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల సంభవించిన వర్షాలు ,వరదలకు నష్టపోయిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. వరదలతో నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం వారిని ఏవిధంగా ఆదుకుంటుందనే అంశంపై సిఎం చంద్రబాబునాయుడు మంగళవారం సచివాలయంలో మీడియాకు వివరించారు. విజయవాడ నగరంలోని బుడమేరు వరదల్లో మునిగిన ప్రతి ఇంటికి రూ.25వేలు, మొదటి అంతస్తులోని బాధితులకు రూ.10వేలు, ఇళ్లలోకి నీరొచ్చిన బాధితులకు రూ.10వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు సిఎం వెల్లడించారు. అర్బన్, రూరల్‌ని కలుపుకుని 2,72,727 కుటుంబాలు వరదలతో నష్టపోయాయన్నారు. బాధితుల్లో చివరి వ్యక్తిని కూడా ఆదుకునే వరకు తామంతా కష్టపడుతామన్నారు. బుడమేరు మొత్తం ఆక్రమణలు, కబ్జాలకు గురైందని, క్యాబినెట్‌లో ఎలా ఆక్రమణలు తొలగించాలనే అంశంపై చర్చించి ఆపరేషన్ బుడమేరును ప్రారంభిస్తామన్నారు. అక్రమ కట్టడాలను క్లియర్ చేస్తే 95శాతం సమస్యలు పరిష్కారం అవుతుతాయన్నారు. అదే విధంగా కొల్లేరు అంశంపై కూడా ఓ నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. నష్టపరిహారాన్ని ఆయా ఇళ్లలో అద్దెకుండే వారికి మాత్రమే ఇవ్వడం జరుగుతుందని, అదే విధంగా కౌలు రైతులు భూములు సాగు చేస్తున్నట్టయితే నష్టపరిహారం భూ యజమానికి కాకుండా కౌలు రైతుకే అందించడం జరుగుతుందని సిఎం స్పష్టం చేశారు. చిరు వ్యాపారుల్లో ఎంఎస్‌ఎంఇ కింద రిజిస్టర్ చేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి రూ.40లక్షల లోపు టర్నోవర్ ఉంటే వారికి రూ.50 వేలు ఎస్టాబ్లిష్‌మెంట్, రూ.40లక్షల నుంచి రూ.1.50కోట్ల టర్నోవర్ ఉన్న వారికి లక్ష రూపాయిలు ఎస్టాబ్లిష్‌మెంట్, రూ.1.5కోట్ల కంటే మించి టర్నోవర్ ఉన్న వారికి రూ.1.50లక్షల వరకు ఎస్టాబ్లిష్‌మెంట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ద్విచక్ర వాహనాలకు రూ.3వేలు , ఆటోలకు రూ.10వేలు, చేనేత మగ్గం, దారం తడిచి పోయి ఉంటే అటువంటి వారికి కూడా రూ.25వేలు బోట్ల విషయానికి వస్తే ఫిషింగ్ బోట్లు, (మోటారు, నాన్ మోటారు బోట్లు) వారీగా రూ.9వేలు, రూ.25వేలు , ఆక్వా చెరువుల రిపేర్లకు హెక్టార్‌కు రూ.25వేలు ఆవులు, గేదెలకు రూ.50వేలు, ఎద్దులకు రూ.40వేలు, గొర్రెలు, మేకలు ఒక్కో దానికి రూ.7,500లు , కోళ్లకు రూ.100లు, గేదెల షెడ్ల రిపేర్లకు రూ.5వేలు, ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని సిఎం చంద్రబాబు తెలిపారు.

179 సచివాలయాల పరిధిలో బ్యాంక్ రుణాలపై మారటోరియం

నీటిలో మునిగిన 179 సచివాలయాల పరిధిలోని గృహాల వారు బ్యాంకులో రుణాలు తీసుకుని ఉంటే అటువంటి వారికి ఆయా రుణాలు 36 నెలల్లో చెల్లించాల్సి ఉంటుంది. మూడు నెలలు మారిటోరియం పీరియడ్ ఇవ్వడంతో పాటు వారికి రూ.50 వేలు దాకా తాజాగా రుణాలు ఇవ్వాలని బ్యాంకులను ఆదేశించినట్లు సిఎం తెలిపారు. ఫస్ట్ ఫ్లోర్‌లో ఉండే వారికి 36 నెలలు చెల్లింపులు చేసే విధంగా అవకాశం ఇవ్వడంతో పాటు మూడు నె లల మారటోరియం, రూ.25వేలు రుణం, వీటితో పాటు కమర్షియల్ వ్యాపారాలు నిర్వహించే మిగతా 2లో

కరకట్ట విస్తరణ

అమరావతిని వరద ముంపు నుండి రక్షించే ఏర్పాటు

ప్రణాళిక సిద్ధం చేస్తున్న అధికారులు 2

రూ.650 కోట్లకు పైగా ఖర్చు

జమ్ముకాశ్మీర్‌లో నేడు తొలి దశ ఎన్నికలు

శ్రీనగర్, జమ్ము : పదేళ్ల తరువాత జమ్ముకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలి దశ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఏడు జిల్లాల్లోని 24 స్థానాల్లో బుధవారం పోలింగ్ జరగనుంది. నేటి పోలింగ్‌లో 23 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 90 మంది స్వతంత్ర అభ్యర్థులుసహా 219 మంది పోటీ పడుతున్నారు. బుధవారం ఎన్నికల జరిగే జిల్లాల్లో మూడు జిల్లాలు (8 అసెంబ్లీ స్థానాలు) జమ్ము ప్రాంతంలోనూ, నాలుగు జిల్లాలు (16 అసెంబ్లీ స్థానాలు) కాశ్మీర్ లోయలోనూ ఉన్నాయి. 2019 ఆగస్టులో ఆర్టికల్ 370 రద్దు చేసిన తరువాత జమ్ముకాశ్మీర్ అసెంబ్లీకి జరుగుతున్న తొలి ఎన్నికలు కావడంతో ఈ ఎన్నికలపై దేశం దృష్టి ఉంది. మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు మూడు దశల్లో జమ్ముకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. రెండో దశ ఈ నెల 25న జరగనుంది. ఎన్నికల సంఘం సమాచారం ప్రకారం తొలి దశలో 23,27,580 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 1.23 లక్షల మంది తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తొలి దశ కోసం 3,276 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. 14 వేల మంది పోలింగ్ స్టాఫ్‌ను నియమించారు. తొలి దశ ఎన్నికల కోసం విస్తృత స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కాశ్మీర్ జోన్ ఐజిపి వికె బిర్ది తెలిపారు. సెంట్రల్ ఆర్మ్‌డ్ పారామిలిటరీ ఫోర్స్ (సిఎపిఎఫ్), జమ్ముకాశ్మీర్ ఆర్మ్‌డ్ పోలీస్, జమ్ముకాశ్మీర్ పోలీస్ సిబ్బందితో బహుళ అంచెల భద్రతను ఏర్పాటు చేశామని చెప్పారు.సిపిఎం నాయకులు మహమ్మూద్ యూసఫ్ తరిగామి పోటీ చేస్తున్న కుల్గాం నియోజకవర్గానికి తొలిదశలోనే ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ నుంచి వరసగా నాలుగుసార్లు ఆయన విజయం సాధించారు. ఆయనకు స్థానికుల నుంచి మంచి మద్దతు లభిస్తోంది. కుల్గాంతో పాటు పాంపోర్, త్రాల్, పుల్వామా, రాజ్‌పోరా, జైనాపోరా, షోపియాన్, డిహెచ్ పోరా, దేవ్‌సర్, దూరు, కోకెర్‌నాగ్ (ఎస్‌టి), అనంతనాగ్ వెస్ట్, అనంతనాగ్, శ్రీగుఫ్వారా-బిజ్‌బెహరా, షాంగస్-అనంతనాగ్ ఈస్ట్, పహల్గాం, ఇందర్వాల్, కిష్త్వార్ భదర్వా, దోడా, దోడా వెస్ట్, రాంబన్, బనిహాల్ నియోజకవర్గాల్లో బుధవారం పోలింగ్ జరగనుంది.

బుల్డోజర్ న్యాయం ఇంకానా !

- ఇకపై సహించేది లేదు
- సుప్రీం స్పష్టీకరణ
- అక్టోబరు 1న తదుపరి విచారణ



న్యూఢిల్లీ : తమ స్పష్టమైన అనుమతి లేకుండా దేశంలో ఎక్కడా కూడా ఎలాంటి కూల్చివేతలు చేపట్టరాదని సుప్రీం కోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. అయితే పబ్లిక్ రోడ్‌లపై, ఫుట్‌పాత్‌లపై, రైల్వే లైన్‌లపై, నీటి వనరుల వద్ద ఆక్రమణలకు ఈ ఆదేశాలను వర్తింపచేయరాదని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన బెంచ్ స్పష్టం చేసింది. వివిధ నేరాల్లో నిందితులుగా వున్న వ్యక్తుల ఇళ్లను కూల్చివేస్తూ అధికారులు ఈ బుల్డోజర్ చర్యలు తీసుకోవడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను విచారించిన బెంచ్ పై మేరకు తాత్కాలిక ఆదేశాలు జారీ చేసింది.

"ఈ కోర్టు అనుమతి లేకుండా తదుపరి విచారణ తేదీ వరకు ఎలాంటి కూల్చివేతలు జరగరాదు. అయితే బహిరంగ స్థలాలు, ఫుట్‌పాత్‌లు, వీధులు వంటి చోట్ల అనధికార నిర్మాణాల విషయంలో ఇలాంటివి వర్తించబోవు." అని కోర్టు ఆదేశించింది. ప్రత్యేకంగా ఒక కమ్యూనిటీని లక్ష్యంగా చేసుకుంటున్నారంటూ కథనాలు రూపొందిస్తున్నారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు.

"బయట వచ్చే వార్తలు, కథనాలు మమ్మల్ని ప్రభావితం చేయవు. ఈ దశలో ఏ కమ్యూనిటీ లక్ష్యంగా అవుతోంది అనే ప్రశ్నల్లోకి వెళ్ళం. అక్రమ కూల్చివేతలు ఒక్కటి చోటు చేసుకున్నా అది రాజ్యాంగ విలువలకు విరుద్ధమే." అని జస్టిస్ విశ్వనాథన్ వ్యాఖ్యానించారు. అక్టోబరు 1వ తేదీకి విచారణను వాయిదా వేశారు. నేరాలకు పాల్పడిన నిందితులను శిక్షించేందుకు అన్నట్లుగా వారి ఇళ్ళను కూల్చివేసే పద్ధతిని నియంత్రించేందుకు దేశవ్యాప్తంగా మార్గదర్శకాలను రూపొందించాలని భావిస్తున్నట్లు ఈ నెల 2వ తేదీన బెంచ్ పేర్కొంది. అయితే అదే సమయలో అనధికార కట్టడాలు లేదా నిర్మాణాలను కాపాడరాదని నొక్కి చెప్పింది. ఇందుకు గానూ కొన్ని మార్గదర్శకాలు అవసరమవుతాయని, అప్పుడు కూల్చివేతలు కూడా చట్టానికి అనుగుణంగా జరుగుతాయని బెంచ్ పేర్కొంది.

కాగా యుపి ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ మాత్రం తన ప్రభుత్వం బుల్డోజర్లను ఉపయోగించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూనే వున్నారు. 'అందరి చేతులు బుల్డోజరుపై సరిపోవు' అంటూ లక్నోలో జరిగిన ఒక అధికారికక కార్యక్రమంలో ఆయన వ్యాఖ్యలు చేశారు. అలాగే యుపి విద్యుత్ శాఖ మంత్రి ఎ.కె.శర్మ కూడా ప్రభుత్వం బుల్డోజర్లను ఉపయోగించడాన్ని సమర్ధిస్తున్నారు. గూండాయిజం, మాఫియా రాజ్‌ను తుడిచిపెట్టడానికిక ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ ఉపయోగించే సాధనమని వ్యాఖ్యానించారు.

కాగా ఈ వ్యాఖ్యలపై బెంచ్ తీవ్రంగా స్పందించింది.

" సెప్టెంబరు 2నాటి ఆదేశాలు తర్వాత, బుల్డోజరు న్యాయం కొనసాగుతుందని స్టేట్‌మెంట్‌లు వస్తున్నాయి." అని గవాయ్ అన్నారు. బుల్డోజర్ చర్యలను సమర్ధిస్తూ ప్రకటనలు చేస్తున్నారు. మన దేశంలో ఇలా జరుగుతుందా? ఎన్నికల కమిషన్ దృష్టికి వెళ్ళిందా? దీనిపై మార్గదర్శకాలు రూపొందించాలి." అని జస్టిస్ విశ్వనాథన్ అన్నారు. ఒక వ్యక్తి నేరానికి పాల్పడ్డాడని ఆ వ్యక్తి కుటుంబానికి చెందిన ఇళ్ళను కూల్చివేసేందుకు బుల్డోజరులను గుజరాత్ ప్రభుత్వ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలు ఉపయోగించడాన్ని సెప్టెంబరు 12న త్రిసభ్య ధర్మాసనం తీవ్రంగా పరిగణించింది. నిందితుడి ఇంటిని కూల్చివేస్తామని బెదిరించడం చట్టబద్ధ పాలన గల దేశంలో ఊహించలేనిదని బెంచ్ పేర్కొంది. పిటిషనర్ జావేద్‌అలీ మెహబూమియా సయాద్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారిస్తూ కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.



ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనాను కలిసిన కేజ్రీవాల్, అతిషి

ఢిల్లీ ముఖ్యమంత్రిగా అతిషి

- ఆప్ శాసనసభా పక్షనేతగా ఎన్నిక
- సిఎంగా తప్పుకున్న కేజ్రీవాల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రిగా అతిషి మార్లేనా పేరును ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఖరారు చేసింది. మంగళవారం అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో ఆప్ లెజిస్లేటివ్ పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆప్ శాసనసభ పక్ష నేతగా అతిషి పేరును పార్టీ అధినేత కేజ్రీవాల్ ప్రతిపాదించగా, పార్టీ ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. దీంతో ఆప్ శాసనసభా పక్ష నేతగా అతిషి ఎన్నికయ్యారు. ముందే ప్రకటించినట్లుగా ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేశారు. మంగళవారం సాయంత్రం లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనాను కలిసి ఆయన తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. ఆప్ నూతన శాసనసభా పక్ష నేతగా అతిషిని ఎన్నుకున్నట్లు లెఫ్టినెంట్ గవర్నర్‌కు కేజ్రీవాల్ తెలిపారు. కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని కేజ్రీవాల్‌ను ఎల్‌జి కోరారు. వారం రోజుల్లో సిఎంగా అతిషి ప్రమాణ స్వీకారం చేస్తారని, ఈ నెల 26, 27 తేదీల్లో జరిగే అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో బలనిరూపణ చేసుకుంటారని ఆప్ వర్గాలు తెలిపాయి.

రేపటి నుంచి వైబ్‌సైట్‌లో టెట్ మాక్ టెస్ట్ నమూనా పత్రాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టెట్ పరీక్షలకు సన్నద్ధం కావడానికి వీలుగా ఈనెల 19 నుండి టెట్ మాక్ టెస్ట్ నమూనా పత్రాలను వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సుమారు నాలుగు లక్షలమందికిపైగా దీనికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అభ్యర్థులు సిఎస్‌ఇ.ఎపి.జిఓవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా పేపర్లను డౌన్‌లోడ్ చేసుకుని సాధన చేయొచ్చని తెలిపారు. దీనివల్ల ఎటువంటి ఇబ్బందులూ లేకుండా పరీక్షలు రాసేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. 22వ తేదీ నుండి అభ్యర్థులు తమ హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చన్నారు. టెట్ పరీక్షలు షెడ్యూలు ప్రకారమే అక్టోబర్ 3న జరుగుతాయన్నారు.

ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్య

- ప్రకాశంలో ఒకరు.. పల్నాడులో మరొకరు 2

విశాఖ స్టీల్ ప్రైవేటుపరం కానివ్వం

- వేల కోట్లు నష్టాలు వస్తే ఎవరూ ఆదుకోరు
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ స్టీలు ప్లాంటును ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటుపరం కాకుండా కాపాడుకుంటామని, ఉక్కుఫ్యాక్టరీ రాష్ట్రానికి సెంటిమెంటని, వాజ్‌పేయి హయాంలోనూ తాము అదనపు నిధులు ఇచ్చి ఆదుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన విశాఖ స్టీలుపై మాట్లాడారు. ఇటీవల కేంద్ర ఉక్కుశాఖ మంత్రితో దీనిపై సమావేశం జరిగిందని తెలిపారు. కొంత డబ్బు విడుదల చేసి ప్లాంటును నిర్వహించేం దుకు కేంద్ర స్టీలు మంత్రిత్వశాఖ ముందుకు పోతోందని తెలిపారు. శాశ్వతంగా దాన్ని లాభాల బాట పట్టించు కోవాల్సిన బాధ్యత రాష్ట్రంపై ఉందని, దీన్ని కూడా ఉద్యోగులు, ట్రేడ్ యూనియన్ నాయకులు ఆలోచిం చాలని సూచించారు. అదే సమయంలో దేశంలో ప్రైవేటు ప్లాంట్లు బాగున్నాయని, మంచి ప్లాంటయిన విశాఖ స్టీలు మాత్రం నష్టాల పాలవుతోందని, ఇలా ఎందుకు జరుగుతుందో యాజమాన్యం ఆలోచించు కోవాలని అన్నారు. ముఖ్యమంత్రిగా తాను కూడా



దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. అదే సమయంలో వేలకోట్లు నష్టం వస్తే ఎవరో ఒకరు ఆదుకుంటారంటే అది అవివేకమని తెలిపారు. లాభాల బాట పట్టించేందుకు కష్టపడాలని, తెలివి తేటలు ఉపయోగించాలని అన్నారు. "విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు" నినాదాన్ని నిలబెట్టాలంటే అందరిలోనూ మార్పు రావాలని తెలిపారు. ఆ ప్లాంటు రాష్ట్రంలోనే పెద్దదని, ఒక సెంటిమెంటని ముఖ్యమంత్రి అన్నారు. అలాగని ప్రతిరోజూ సెంటిమెంటు అని కూర్చుంటే సహకరించే వారు ఉండరని, ఒకటి, రెండుసార్లు అంటే ఫర్వాలేదని పేర్కొన్నారు. అనునిత్యం అదే మాట్లాడటం కరెక్టు కాదనీ సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాంటును ప్రైవేటుపరం కాకుండా కాపాడుకునేందుకు సర్వవిధాలా ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో ఒక్కసారి కూడా ప్రైవేటుపరం కాకుండా ఆపాలని కేంద్రాన్ని కోరని వైసిపి నాయకులు ఇప్పుడు రెచ్చగొట్టి శవాల ముందు చలికాచుకునే పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాంటు రక్షణ కోసం తాను ప్రతిపక్షంలో ఉండగా ఢిల్లీ వెళితూ రావాలని కోరితే ఎవరూ స్పందించలేదని తెలిపారు. ఏమి చెప్పినా ప్రజలు నమ్ముతారనే ఆలోచనతో వైసిపి నాయకులు ఉన్నారని, అటువంటి రోజులు పోయాయని తెలిపారు. మొన్నటి వరకూ అధికారంలో ఉండి ప్రజలను మభ్య పెట్టారని పేర్కొన్నారు. విశాఖపట్నం స్టీలు ప్లాంటును బాధ్యతో ఎలా కాపాడుకోవాలో అలా కాపాడుకుం టామని తెలిపారు. విశాఖ తెలుగుదేశం పార్టీకి ఎన్‌డిఎ కి గట్టి కేంద్రమనీ అన్నారు. అటువంటి చోట్ల ప్లాంటును కాపాడుకోవడం తమ బాధ్యతని వివరించారు.

బెంబేలెత్తిస్తున్న బియ్యం ధరలు

సన్న రకం క్వింటాలు రూ.5,300 పైనే • రెండు వారాల్లో రూ.200 పెరుగుదల

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

మార్కెట్లో బియ్యం ధర చూస్తే గుండె గుభిల్లుమంటోంది. సన్న బియ్యం ధర వారం రోజుల వ్యవధిలోనే అమాంతం పెరిగి క్వింటాలు ధర రూ.5,300కు చేరింది. ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం మార్కెట్లో అవసరమైన స్థాయిలో అందుబాటులో లేకపోవడం, వరదలు, భారీ వర్షాలకు వరి పంటకు నష్టం వాటిల్లిందనే సాకుతో హోల్‌సేల్ మార్కెట్లో ధరలు పెంచారని చిల్లర వర్తకులు చెబుతున్నారు. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలులేని అన్ సీజన్లోనూ గతంలో ఎన్నడూ లేనివిధంగా బియ్యం ధరలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. మేలో కిలో బిపిటి బియ్యం రూ.45, ఆర్‌ఎన్‌ఆర్ రూ.46, హెచ్‌ఎంటి రూ.54లకు విక్రయించారు. మేతో పోలిస్తే బిపిటి, ఆర్‌ఎన్‌ఆర్ బియ్యం కిలో రూ.7, హెచ్‌ఎంటి రూ.14 పెరిగింది. సెప్టెంబర్ ఒకటో తేదీన బిపిటి 5204 (కర్నూలు సోనా, సాంబ మసూరి) క్వింటాలు బియ్యం ధర మార్కెట్లో రూ.5,100 ఉంది. ఏడో తేదీకి రూ.5,200కు, 15వ తేదీకి రూ.5,300కు చేరింది. ఆర్‌ఎన్‌ఆర్ రూ.5,300 నుంచి రూ.5,500కు పెరిగింది. హెచ్‌ఎంటి బియ్యాన్ని ఆగస్టు మొదటి వారంలో రిటైల్‌గా రూ.6,200కు విక్రయించారు.



తాజాగా రూ.6,800 వరకు విక్రయిస్తున్నారు. ధరలు పెరగడం ద్వారా వ్యాపారులకు మాత్రమే ప్రయోజనం చేకూరింది. పెరిగిన ధర రైతులకు దక్కడం లేదు. గిట్టుబాటు ధర లభించక నష్టపోతున్నారు. ఆకాశాన్ని అంటుతున్న ధరల వల్ల వినియోగదారులపై మోయలేని భారం పడుతోంది. కేంద్రప్రభుత్వం 25 కిలోలలోపు బియ్యం సంచులపై జిఎస్‌టి విధించింది. ఈ నేపథ్యంలో మార్కెట్లో ఎక్కువగా 26 కిలోల బస్తాలను విక్రయిస్తున్నారు. చిన్న కుటుంబాలు గాయత్రి, లలిత తదితర కంపెనీల పది కిలోల సంచులకు కొనుగోలు చేస్తున్నాయి. అదనంగా రూ.35 జిఎస్‌టి చెల్లించాల్సి వస్తోంది.

కుటుంబాలపై భారం

కృష్ణా జిల్లాలో సగటున 3.50 లక్షల కుటుంబాలు సన్నబియ్యం వినియోగిస్తున్నాయి. రేషన్ దుకాణాల్లో ఇస్తున్న బియ్యాన్ని కొందరు దోసెలు, బియ్యపు పిండి వంటకాలకు వినియో గిస్తున్నారు. చుట్టాలొచ్చినప్పుడు లేదా పండగలు పబ్బాలు, ఫంక్షన్లకు మాత్రమే సన్నబియ్యాన్ని సామాన్యులు వాడుతుంటారు. వాటి ధరలు వీరికి అందుబాటులో లేవు. సెప్టెంబర్ మొదటి వారంతో పోలిస్తే పెరిగిన ధరలతో వినియోగదారులపై రూ.1.80 కోట్ల భారం అదనంగా పడింది.

బిపిటి ధాన్యానికి డిమాండ్

కృష్ణా జిల్లా కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ, కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన, గూడూరు తదితర మండలాల్లో బిపిటి ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో బిపిటిలను సేకరించడానికి అవకాశం కల్పించలేదు. ఈ తరహా ధాన్యానికి మద్దతు ధర కన్నా ఎక్కువగా ధర పలుకుతుంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు పంట పెట్టుబడి అవసరాలకు ఏప్రిల్, మేల్లో ఎక్కువమంది రైతులు బిపిటి ధాన్యం విక్రయించుకుంటారు. 75 కిలోల బస్తాను వ్యాపారులు సగటున రూ.1800కు కొనుగోలు చేశారు. మార్కెట్ యార్డు గొడౌన్లలో వ్యాపారులు లారీల కొద్దీ నిల్వ ఉంచారు. బిపిటి ధాన్యం నిల్వలు రైతుల దగ్గర పెద్దగా లేవు. తాజాగా బస్తా రూ.2,300కు ధర చేరుకుంది. రైతులకు ఒక్కో బస్తాపై సగటున రూ.500 వరకు నష్టపోయారు.

కొత్తగా ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అమల్లో ఉన్న జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం పేరును మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ పథకం పేరుతో ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టుగా మార్పులు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఇక నుండి పాతపేరును రికార్డుల నుండి తొలగించాలని ఆదేశించారు.

యువతకు ఏచూరి జీవితం ఆదర్శనీయం

- సంస్మరణ సభలో శాసనమండలి చైర్మన్ మోషేనురాజు 3

ఇన్ఫోసిస్‌తో ఎల్‌ఐసి ఒప్పందం

- నూతన డిజిటల్ వేదిక ఏర్పాటు లక్ష్యం 3



నిమజ్జనానికి తీసుకొస్తున్న 70 అడుగుల ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహం

హైదరాబాద్‌లో ప్రశాంతంగా నిమజ్జనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగుతోంది. గణపయ్యలను చూసేందుకు తరలివచ్చిన ప్రజలతో టాంక్‌బండ్ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. ఇసుక వేస్తే రాలనంతగా జనం వచ్చారు. గణేష్ శోభాయాత్ర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా 25 వేల మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

శోభాయాత్ర జరిగే రోడ్లను కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పోలీసులు పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయిలో సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 70 అడుగుల ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన ప్రక్రియ మధ్యాహ్నాం ఒంటిగంటకు ఎన్‌టిఆర్ మార్గ్‌లోని నాలుగో నంబర్ క్రేన్ వద్ద ముగిసింది.

గుండెపోటుతో ఉపాధి కార్మికుడి మృతి

ప్రజాశక్తి - ఓజిలి (తిరుపతి జిల్లా)
గుండెపోటుతో ఉపాధి కార్మికుడు మృతి చెందిన సంఘటన తిరుపతి జిల్లా ఓజిలి మండలం బత్తలపురం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బత్తలపురం గ్రామానికి చెందిన కుడముల గోవిందయ్య (50) ఉపాధి హామీ చట్టంలో భాగంగా గ్రామ సమీపంలోని చెరువు వద్ద పని చేస్తుండగా ఒక్కసారిగా కిందపడిపోయారు. గమనించిన సహచర కార్మికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. గుండెపోటుతో మరణించినట్లు పరీక్షించిన వైద్యులు నిర్ధారించారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వపరంగా అందాల్సిన పరిహారం నిమిత్తం ప్రతిపాదనలు పంపిస్తామని అధికారులు తెలిపారు.

మరికొంతకాలం సెలవులో రావత్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి
రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన షంషేర్ సింగ్ రావత్ మరికొంత కాలం సెలవులో కొనసాగనున్నారు. ఈ ఏడాది జూన్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఆయన వ్యక్తిగత కారణాలతో సెలవులో కొనసాగుతున్నారు. ఇప్పటికే రెండు దఫాలుగా సెలవును పొడిగించుకున్న ఆయన తాజాగా మరికొంతకాలం సెలవు కావాలని దరఖాస్తు చేసుకోగా, సాధారణ పరిపాలన శాఖ అందుకు అనుమతిచ్చింది.
తాజాగా నవంబర్ ఒకటో తేదీ వరకు ఆయనకు సెలవును మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అదే నెల రెండు, మూడో తేదీలు ప్రభుత్వ సెలవులు కావడంతో ఆయన తిరిగి నాలుగో తేదీన విధులకు హాజరు కావాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆయన దీర్ఘకాలిక కాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స చేయించుకుంటున్నట్లు తెలిసింది. ఈ కారణంగానే ఆయన జూన్ నుంచి సెలవులో కొనసాగుతున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006
ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

డిసెంబరు నెల శ్రీవారి ఆర్జితసేవా ఆన్‌లైన్ కోటా నేడు విడుదల

ప్రజాశక్తి - తిరుపతి
తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన డిసెంబరు నెల కోటాను బుధవారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో టిటిడి విడుదల చేయనుంది.
ఇ-సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం సెప్టెంబరు 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు సెప్టెంబరు 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి.
కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను సెప్టెంబరు 21వ తేదీ ఉదయం పది గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.
https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టిటిడి పేర్కొంది.

కోతలు లేని విద్యుత్ అందించేందుకు కృషి

- మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాష్ట్రంలో కోతలులేని విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నామని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో పునరుత్పాధక ఇంధన రంగాల పెట్టుబడిదారుల సదస్సు-2024లో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులతో చర్చించారు. పెట్టుబడులకు రాష్ట్రంలో ఉన్న అపార అవకాశాలను, మానవ వనరులను వివరించారు. పునరుత్పాదక విద్యుత్ అధారంగా కోతలు లేని విద్యుత్‌ను అందించాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో 3.0 సంస్కరణలు అమల్జేస్తున్నామని, సౌర, పవన్ విద్యుత్ రంగాల్లో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని మంత్రి తెలిపారు. విద్యుత్ స్టోరేజీ విషయంలో పారదర్శకత పాటిస్తామని తెలిపారు.
విద్యుత్ స్టోరేజీకి ఆంధ్రప్రదేశ్‌ను కేరాఫ్‌గా నిలిపే లక్ష్యంతో కృషి చేస్తున్నామన్నారు. పెద్దఎత్తున బ్యాటరీ స్టోరేజీ విధానం, పంప్డ్ స్టోరేజీ తదితర అధునాతన సాంకేతికను వినియోగిస్తున్నామని చెప్పారు. రూఫ్‌టాప్ సోలార్, డీ సెంట్రలైజ్డ్ మైక్రో గ్రిడ్ల ఏర్పాటుతో విద్యుత్ ఉత్పత్తిని ప్రజలకు మరింత చేరువ చేసి క్షేత్రస్థాయిలో ఇంధన భద్రత పెంచుతామని తెలిపారు.

షాపుల్లో కల్లుగీత కార్మికులకు 10శాతం రిజర్వేషన్

- మద్యం పాలసీలో ప్రజారోగ్యానికి ప్రాధాన్యం
- మంత్రుల సబ్ కమిటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


మద్యం పాలసీపై మంత్రుల సబ్‌కమిటి సమావేశం

రాష్ట్రంలో అక్టోబర్ 1 నుండి అమలులోకి వచ్చే నూతన మద్యం పాలసీలో 10శాతం షాపులను కల్లుగీత కార్మికులకు రిజర్వేషన్‌ను పెట్టినట్లు రాష్ట్ర ఎక్సయిజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మద్యంపాలసీని రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మంత్రుల సబ్‌కమిటి సమావేశం అయ్యింది. ఈ సందర్భంగా మద్యం విధానంపై క్షేత్రస్థాయిలో వివిధ సంఘాలు, అధికారుల నివేదికలపై వచ్చిన అంశాలపై చర్చించారు. అనంతరం సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో కొల్లు రవీంద్ర మంత్రులు నాదేండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, కొండపల్లి శ్రీనివాస్‌లతో కలిసి మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం మద్యపాన నిషేదం పేరుతో విచ్చలవిడిగా నాసిరకం మద్యాన్ని ప్రోత్సహించి ప్రజారోగ్యాన్ని నాశనం చేసిందన్నారు. విపరీతంగా రేట్లు పెంచి ఆ ఆదాయం రాష్ట్ర ఖజానాకు కాకుండా ప్రభుత్వ పెద్దల జేబుల్లోకి వెళ్లేలా చేసిందన్నారు. మంత్రివర్గ ఉపసంఘం అన్ని అంశాలను అధ్యయనం చేసి మెరుగైన విధానానికి ప్రణాళికను తయారు చేసి క్యాబినెట్ ముందు వుంచుతున్నామని తెలిపారు. బుధవారం జరిగే క్యాబినెట్‌లో ఈ మేరకు తీర్మానం చేయనున్నామని తెలిపారు. గత పాలకులు జె బ్రాండ్ మద్యం అమ్మకాలను పెంచుకునేందుకు మల్టీ నేషనల్ బ్రాండ్లు రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకున్నారని తెలిపారు. దౌర్జన్యంతో రాష్ట్రంలో వున్న డిస్టిలరీలన్నింటిని వైసిపి నాయకుడు కబ్జాచేశారని విమర్శించారు. తప్పుడు విధానాలతో రాష్ట్రం కూడా ఆర్థికంగా నష్టపోయిందన్నారు. భవిష్యత్తులో వచ్చే ఆదాయంపై కూడా అప్పులు తెచ్చారన్నారు. ధరలు కూడా సామాన్యులకు అందుబాటులో ఉండేలా ఓ ప్రత్యేక బ్రాండ్‌ను తీసుకొస్తున్నామని అన్నారు. టూరిజం పాలసీలో 3, 4 నక్షత్రాల హొటళ్లలో అధికంగా వసూలు చేస్తున్నారనే రోపణలు వచ్చాయన్నారు. వాటిని ఎక్సైజ్, టూరిజం డిపార్టమెంట్‌లు కలిసి కుర్చోని సరిచేయనున్నామని తెలిపారు. జనాభా ఎక్కవగా ఉన్న సిటీలలో స్మార్ట్ స్టోర్‌ల ద్వారా మద్యం అందుబాటులో ఉండేలా చేస్తామన్నారు. మద్యం షాపులను జిల్లా స్థాయి కమిటీలు సిండికేట్ కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటాయన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే గత ప్రభుత్వం విచిత్రంగా ధరలు పెంచుకుంటూ పోయారన్నారు. ఒకే రోజు రెండు జీవోలు 128, 129 లు తెచ్చి ఉదయం ఉన్న రేటును మార్చుతూ సాయంత్రం మరో జీవో ఇచ్చారన్నారు. మద్యానికిబానిసలు అయ్యేవారికి డీ అడిక్షన్ సెంట్లర్లు ఏర్పాటుచేస్తున్నామన్నారు. ప్రభుత్వమే మద్యం అమ్మితే వినియోగం తగ్గిపోతుంది అన్నారని ఆచరణలో పెరిగిందన్నారు. 2019-24 మధ్య ప్రజల ఆరోగ్యం మద్యం వల్ల ఎంతో దెబ్బతిందన్నారు. కాలేయ సంబంధిత వ్యాదులు, కిడ్నీ సంబంధిత వ్యాదులు 2019-24 మధ్య భారీగా పెరిగిపోయాయన్నారు. మద్యం లేకపోతే గంజాయి, మాదకద్రవ్యాలకు అలవాటు పడ్డారని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దష్టిలో ఉంచుకొని పాలసీలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.

100 రోజుల్లోగా రహదారుల మరమ్మతులు

ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలోని రహదారుల మరమ్మతులను వంద రోజుల్లోగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో విద్య, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, రహదారులు, భవనాలు, పౌర సరఫరాలు తదితర శాఖలకు సంబంధించి 100 కార్యాచరణ ప్రణాళిక అమలుపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. రహదారులు-భవనాల శాఖ వంద రోజుల కార్యాచరణలో ప్రధానంగా రహదారుల మరమ్మతులపై దృష్టి సారించాలని నీరబ్ ఆదేశించారు. రాష్ట్ర రహదారులన్నిటినీ గుంతలు లేనివిగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు సంబంధించిన నిధల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే డ్రోన్ల వినియోగించడం వంటి ఆధునిక సాంకేతికతను కూడా విరివిగా ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. మరమ్మతులు పూర్తి అయిన తర్వాత సంబంధిత ఎఇ, డిఇఇ, ఇఇ, ఎస్ఇల నుండి తమ ప్రాంతంలోని రహదారుల్లో ఎక్కడా గుంతలు లేవన్న ధ్రువీకరణ పత్రాలను తీసుకోవాలని ఆయన నిర్దేశించారు. రహదారులు-భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే మాట్లాడుతూ టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యా సంస్థలకు రేటింగ్
విద్య, ఉన్నత విద్యా శాఖలకు సంబంధించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కింద మధ్యాహ్న భోజన పథకం, ఎకడమిక్ క్యాలెండర్, నైపుణ్య శిక్షణ, విద్యా సంస్థలకు రేటింగ్ ప్రక్రియ, పరిశ్రమలతో విద్యా సంస్థల అనుసంధానం వంటి అంశాలపై ప్రధానంగా సమీక్షించారు. పురపాలక శాఖపై సమీక్షలో అన్న క్యాంటీన్ల ప్రారంభాలపై చర్చించారు. రాష్ట్రంలో 100 రోజుల్లో 1.25 లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు గృహ నిర్మాణ శాఖపై జరిపిన సమీక్షలో ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఐటి శాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్, పౌర సరఫరాల శాఖ కమిషనర్, సెర్ప్ సిఇఓ వీరప్యాండన్, ఎంఎయుడి జాయింట్ సెక్రటరీ రామ్ మోహన్ పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్య

- ప్రకాశంలో ఒకరు..పల్నాడులో మరొకరు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా, ఒంగోలు క్రైం


జయలక్ష్మి (ఫైల్)

ఇద్దరు విద్యార్థులు తమ హాస్టల్ గదిలో ఉరేసుకుని మృతి చెందారు. ఒకరు ఇంటర్మీడియట్ విద్యార్థిని కాగా మరొకరు తొమ్మిద తరగతి చదువుతున్న విద్యార్థి. పోలీసుల వివరాల మేరకు... పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం వడ్లమూడివారిపాలేనికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు పల్లపు పెదయలమంద, సుబ్బమ్మ దంపతుల కుమార్తె జయలక్ష్మి (14) నరసరావుపేట పట్టణం వినుకొండ రోడ్డులోని హార్డ్ మహిళా స్కూల్-కాలేజీలో తొమ్మిదవ తరగతి చదువుతున్నారు. మూడ్రోజుల పాటు పాఠశాలకు సెలవు కావడంతో హాస్టల్ నుంచి ఇంటికి వచ్చారు. సెలవులు ముగిసిన అనంతరం సోమవారం రాత్రి తిరిగి హాస్టల్‌కు వెళ్లారు. మంగళవారం తోటి విద్యార్థినులతో కలిసి తరగతులకు వెళ్లిన జయలక్ష్మి మధ్యాహ్నం తర్వాత క్లాస్‌రూంకు వెళ్లలేదు. దీంతో వార్డెన్ హాస్టల్‌కు వెళ్లి పరిశీలించగా ఫ్యాన్‌కు వేలాడుతూ విద్యార్థిని కనిపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి పోలీసులు తరలించారు. తమ బిడ్డ మృతికి హాస్టల్ నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థిని మృతికి కారణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కె.సాయికుమార్ డిమాండ్ చేశారు.
ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం పచ్చవ గ్రామానికి చెందిన వద్దిముక్కల ధనలక్ష్మి కుమార్తె భావన (17) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. గణేష్ ఉత్సవాల నేపథ్యంలో ఇటీవల విద్యార్థిని ఇంటికి వచ్చారు. సోమవారం తన చెల్లిని కళాశాల వద్ద అక్క వదిలిపెట్టారు. మంగళవారం వేకువజామున తను ఉంటున్న హాస్టల్ గదిలో భావన ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతికి కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

కరకట్ట విస్తరణ

- అమరావతిని వరద ముంపు నుండి రక్షించే ఏర్పాటు
- ప్రణాళిక సిద్ధం చేస్తున్న అధికారులు
- రూ.650 కోట్లకు పైగా ఖర్చు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాజధాని అమరావతిని కృష్ణానది వరదల నుండి కాపాడేందుకు వీలుగా ప్రస్తుతం ఉన్న కరకట్టను విస్తరించేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సిఆర్‌డిఎ) ప్రణాళిక రూపొందిస్తోంది. ప్రాథమికంగా సుమారు రూ.650 కోట్లు ఖర్చువ్వొచ్చని అంచనా వేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ నుండి వైకుంఠపురం వరకు కరకట్టను బలోపేతం చేయడంతోపాటు కొన్ని ప్రాంతాల్లో కట్టను లోపలకు మళ్లించాలనీ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు పిలవనున్నారు. ప్రస్తుతం కృష్ణానదికి 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. వాతావరణ మార్పుల్లో భాగంగా 15 లక్షల క్యూసెక్కులు వచ్చినా అమరావతి నగరానికి ఇబ్బంది లేకుండా దీన్ని రూపొందించనున్నారు. దీంతో పాటు కృష్ణా నది తీరాన పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నారు. గతంలో ఇక్కడ రైతులు భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్)కు భూములు ఇవ్వకపోవడంతో పాటు కోర్టును ఆశ్రయించడంతో పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం మంత్రి నారాయణ పెనుమాక పరిధిలో పర్యటించి గతంలో పూలింగుకు ఇవ్వని భూముల రైతులను కలుస్తున్నారు. పూలింగుకు ఇస్తే ఇంటికొచ్చి భూములు తీసుకుంటామని ప్రకటించారు. ఇప్పటికే 22 ఎకరాలకు పైగా పూలింగు పద్ధతిలో ఇచ్చిన సంగతి తెలిసిందే. సీడ్ యాక్సెస్ రోడ్డు పరిధిలోకి వచ్చే భూములకు సంబంధించి ఎటువంటి సమస్యా లేకపోవడంతో వెంకటపాలెం నుండి దీన్ని సీతానగరం వరకూ కొనసాగింపు పనులు చేపట్టనున్నారు. దీనిలో భాగంగానే వెంకటపాలెం నుండి హరిశ్చంద్రాపురం, వైకుంఠపురం వరకూ కరకట్టను బలోపేతం చేయనున్నారు. దీనిపై ఇటీవలే చర్చించినట్లు సమాచారం. విజయవాడ నుండి సెక్రటేరియట్, హైకోర్టుకు వెళ్లాలంటే కరకట్ట మార్గమే దగ్గరగా ఉంది. ప్రకాశం బ్యారేజీ నుండి వెంకటపాలెంలోని ప్రకృతి ఆశ్రమం వరకూ కరకట్టను నాలుగులైన్లుగా విస్తరించడం ద్వారా ట్రాఫిక్ సమస్యను కొంత వరకూ పరిష్కరించొచ్చని, కరకట్ట విస్తరణ ద్వారా భూసేకరణ సమస్య కూడా ఉండదని సిఆర్‌డిఏ అధికారులు అంచనా వేస్తున్నారు. బ్యారేజీ నుండి వారధి మీదుగా వెళ్లేందుకు రెండులైన్ల రోడ్డుకు ప్లాను చేస్తున్నారు. గతంలోనే మణిపాల్ ఆస్పత్రి నుండి ప్రకాశం బ్యారేజీ వరకు రైల్వేట్రాక్ మీదుగా ఫ్లైఓవర్ నిర్మించేందుకు గత టిడిపి ప్రభుత్వ హయాంలోనే భూపటిష్టత పరీక్షలూ నిర్వహించారు. ప్రస్తుతం అది కూడా ఒక కొలిక్కి వస్తోంది. అయితే ఫ్లైఓవర్ నిర్మించాలనుకున్న ప్రాంతంలోనే సుందరయ్యనగర్ పరిసర ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం జరిగింది. దీనిపై సర్వే చేయనున్నట్లు తెలిసింది.

లుక్ ఔట్ నోటీసును ఉపసంహరించాలి

- హైకోర్టులో చెవిరెడ్డి పిటీషన్

ప్రజాశక్తి, అమరావతి
గతంలో పోలీసులు జారీ చేసిన లుక్ ఔట్ నోటీసును ఇంకా కొనసాగించడం అన్యాయమంటూ వైసిపి నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.. లుక్ ఔట్ నోటీసును ఉపసంహరించేలా పోలీసులను ఆదేశించాలని అన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఎస్వీయూ క్యాంపస్ పోలీసులు నమోదు చేసిన కేసులో తనపై పోలీసులు లుక్ ఔట్ నోటీసు జారీ చేశారన్నారని, ఇదే కేసులో పోలీసులు తనకు సెక్షన్ 41ఏ కింద నోటీసులు జారీ చేశారన్నారు.
ఆకేసులో హైకోర్టు తనకు పలు షరతులతో ముందస్తు బెయిల్ ఇచ్చిందన్నారు. తన సోదరుడు విదేశాల్లో చదువుకోవాలని భావిస్తున్నారని, అందువల్ల అతనికి సహకరించేందుకు వీలుగా తను విదేశాలకు వెళ్లాల్సి ఉందని చెప్పారు. లుక్ అవుట్ నోటీసు రద్దు చేయాలని కోరారు. దీనిని హైకోర్టు బుధవారం విచారించే అవకాశం ఉంది.

మునిగిన ప్రతి ఇంటికి రూ.25వేలు

మొదటిపేజీ తరువాయి
వారికి 12 నెలలు రీ షెడ్యూల్‌తో పాటు రుణాలు 24 నెలల్లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. వ్యవసాయ రుణాల విషయానికి వస్తే స్వల్ప కాలిక వ్యవసాయ రుణాలు 5 ఏళ్ల పాటు రీ-షెడ్యూల్ చేయడంతో పాటు 12 నెలలు మారటోరియం, ఇన్‌స్టాల్‌మెంట్ రుణాలు రీ షెడ్యూల్ చేయడం జరుగుతుందన్నారు.

పంటలకు నష్టపరిహారం ఇలా:
అరటి, పసుపుకు రూ.35వేలు, కూరగాయలకు రూ.25వేలు, తమలపాకు తోటలకు రూ.75వేలు, మిర్చికి రూ.35వేలు, బొప్పాయికి రూ.25వేలు, టమోటా రూ.25వేలు, పూలు,రూ.25వేలు, మామిడి, కాఫీ, నర్సరీలకు, సపోటాకు రూ.35వేలు
ఆపిల్ తోటలకు రూ.35వేలు, జీడిపప్పు, డ్రాగన్‌ఫ్రూట్స్ తోటలకు కూడా రూ.35వేలు నష్టపరిహారం ఇవ్వనున్నారు. ఉల్లి రూ.25వేలు, పుచ్చకాయ పంటకు రూ.25వేలు , కొబ్బరి చెట్లకు రూ.1500వంతున ఇవ్వనున్నారు.

అమరావతిపై ఇష్టానుసారం మాట్లాడితే ఊరుకోం:
కృష్ణా నదికి వరదలొస్తే అమరావతి మునిగిపోతుందంటూ వైసిపి దుష్ప్రచారం చేస్తుండటం పట్ల సిఎం చంద్రబాబునాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖలో హుద్‌హుద్ రాలేదా? కర్నూలు, తిరుపతి, నెల్లూరు నగరాలు వరదల్లో మునగలేదా? భారీ వరదలు వస్తే ఏ ప్రాంతమైనా మునుగుతుంది? అలా అయితే చెన్నై, బెంగళూరు, ముంబై నగరాలను కూడా మార్చాల్సి వస్తుందన్నారు. బుద్ధి జ్ఞానం ఉన్న వాళ్లెవరూ ఇలా మాట్లాడరని, అమరావతిపై ఇష్టాను సారం మాట్లాడితే ఊరు కోమని ఆయన హెచ్చరించారు.

వైసిపి వల్లే ఈ పరిస్థితి
భవానీపురం రోడ్డు బుడమేరులో ఊహించని విధంగా వరద వచ్చిందని సిఎం చంద్రబాబునాయుడు వెల్లడించారు. గత వైసిపి ప్రభుత్వం అసంపూర్తిగా పనులు వదిలేయడమే ఈ పరిస్థితికి కారణమన్నారు. 11.43లక్షల క్యూసెక్కుల వరద వచ్చే సమయంలో 40మెట్రిక్ టన్నుల బరువున్న 3 బోట్లు బ్యారేజ్ గేట్ కౌంటర్ వెయిట్‌ను ఢీ కొట్టాయన్నారు. ఇప్పటికీ వాటిని తీసేందుకు కష్టపడుతున్నామన్నారు. బుడమేరు గండ్లు పూడ్చకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు.
వైసిపి ప్రభుత్వం కేంద్రం పోలవరానికి ఇచ్చిన నిధులను ఇతరు అవసరాలకు మళ్లించిందని, అమరావతికి నిధులు అక్కర్లేదని లేఖలు రాసిందన్నారు. విపత్తుల శాఖకు సంబందించి రూ.2వేల కోట్లకు దొంగ లెక్కలు రాశారని, ఈ విషయంపై కాగ్‌కు లేఖ రాయనున్నట్లు సిఎం వెల్లడించారు. యుద్ధ ప్రాతిపదికన రూ.518కోట్లు రిలీజ్ చేయాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు. వైసిపి హయాంలో అన్ని అకౌంట్స్‌ను మ్యానిప్లైడ్ చేశారన్నారు.

ఐక్య పోరాటాలతో 'ఉక్కు'ను రక్షించుకుంటాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం



ఐక్య పోరాటాలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖలోని కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1314వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కుట్రలతో రోజురోజుకూ స్టీల్‌ప్లాంట్ పరిస్థితి దయనీయంగా మారుతోందన్నారు. రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, వర్కింగ్ కేపిటల్ సమకూర్చాలని కోరారు. రానున్న కాలంలో ఉక్కు పరిరక్షణ పోరాటం మరింత ఉధృతం కానుందని తెలిపారు.

వరద సాయంగా ఒకరోజు వేతనం

- ఎక్సయిజ్ ఉద్యోగులు 2 రోజుల జీతం
- సర్పంచుల నుంచి జెడ్‌పిటిసిల వరకు నెల భత్యం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి
రాష్ట్రంలో వరదలు సృష్టించిన బీభత్సంలో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు ఉద్యోగులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ముందుకొచ్చారు. తమ జీతాలను, వేతనాలను, గౌరవభృతిని సాయంగా ప్రభుత్వానికి అందించేందుకు అంగీకార పత్రాన్ని కూడా సమర్పించడంతో ఆర్థికశాఖ అందుకు అనుగుణంగా మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిధులను ఆయా రంగాల వారికి అక్టోబర్‌లో చెల్లించే (సెప్టెంబర్ వేతనాలు) జీత భత్యాల నుంచి మినహాయించేందుకు నిర్ణయించింది.
విజయవాడ నగరంతోపాటు ఎన్టీఆర్, ఏలూరు, విశాఖ, కాకినాడ, గుంటూరు వంటి జిల్లాల్లో భారీగా వరద నష్టం చోటుచేసుకుంది. ఇప్పటికే అనేక స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామిక వేత్తలు భారీగా విరాళాలు ప్రకటించగా, రాష్ట్రంలోని ఉద్యోగులు కూడా తమ జీతం నుంచి కొంత భాగాన్ని విరాళంగా ప్రకటిస్తూ అంగీకార పత్రాలను ప్రభుత్వానికి సమర్పించారు. ఇందులో రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనర్ల సంయుక్త కార్యాచరణ సమితి, ఎపి సివిల్ సర్వీసెస్ సంఘం, ఎపి సివిల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూట్, రాష్ట్ర సర్పంచుల సంఘం, ఎపి పంచాయితీరాజ్ ఛాంబర్, ఎపి గెజిటెడ్ అధికారుల సంఘం, ఎక్సయిజ్ శాఖ ఉద్యోగుల సంఘం తమతమ అంగీకార పత్రాలను అందించినట్లు ఆర్థికశాఖ పేర్కొంది.
ఇందులో ఉద్యోగులు, పింఛనుదారులు, సొసైటీలు, కార్పొరేషన్లలో పనిచేసే వారంతా ఒకరోజు వేతనాన్ని సాయంగా అందించేందుకు లేఖలు అందించినట్లు ఆర్థికశాఖ ప్రకటించింది. అలాగే ఎక్సయిజ్‌శాఖలో పనిచేస్తున్న వారంతా రెండు రోజుల మూల వేతనాన్ని సాయంగా అందించేందుకు అంగీకరించారు. ఇక స్థానిక సంస్థలకు సంబంధించి సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు తమ ఒక నెల గౌరవ భృతిని సాయంగా అందించేందుకు లేఖ ఇచ్చినట్లు ఆర్థికశాఖ పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రంలోని డిడిఓలు, ఇతర అధికారులు సాయం అందించేందుకు అంగీకార పత్రాలను అందించిన వారికి అక్టోబర్‌లో చెల్లించాల్సిన వేతనాలు, జీతాలు, భృతి నుంచి కోతలు విధించి, మిగిలిన జీత భత్యాలను చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పియూష్‌కుమార్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డాక్టర్‌పై దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో/ఏలూరు అర్బన్
ఏలూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో అత్యవసర వైద్య విభాగంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్‌పై దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఐద్వా డిమాండ్ చేసింది. చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించడాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఐద్వా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసుపత్రుల్లో వైద్యులకు రక్షణ కల్పించాలని ఒక వైపు దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నా..రాష్ట్రంలో దాడులు కొనసాగడం దారుణమన్నారు. ఇప్పటికైనా పని ప్రదేశాల్లో భద్రతపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని, వైద్యులపై దాడులు పునరావృతం కాకుండా చూడాలని. వారికి తక్షణమే రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. డాక్టర్‌పై దాడి చేసిన దుండగులపై కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని కోరారు.

సూపరింటెండ్‌కు వినతిపత్రం
కాగా వైద్యురాలిపై దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని ఏలూరు సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ సుధాకర్‌కు ఐద్వా జిల్లా కమిటీ నాయకులు ఎ శ్యామలారాణి, జి శారద మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఐద్వా వినతికి సూపరింటెండెంట్ సుధాకర్ సానుకూలంగా స్పందించారు. దాడికి యత్నించిన వ్యక్తిపై ఇప్పటికే పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్

స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు హ్యాక్‌థాన్

- ఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్

ప్రజాశక్తి-సీతమ్మధార (విశాఖ)
సృజనాత్మక ఆవిష్కరణలను రూపొందించే స్టార్టప్ సంస్థలను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో నిర్వహించే 'హ్యాక్ ఎపి హ్యాకథాన్' కార్యక్రమం నవంబర్ 24న ఆంధ్రా యూనివర్సిటీ వేదికగా జరుగుతుందని ఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఎ-హబ్, ఇపిడిసిఎల్ సంస్థల ఆధ్వర్యంలో జరిగే 13వ ఎడిషన్ 'హ్యాక్ ఎపి హ్యాకథాన్' వేడుక ఆవిష్కరణల ప్రక్రియలో సవాళ్లను ఎదుర్కొని పరిష్కారాలను ప్రదర్శించే ఆవిష్కర్తలకు కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. విశాఖలోని ఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పృథ్వీతేజ్ మాట్లాడుతూ.. విద్యుత్ పంపిణీ వ్యవస్థలోని సమస్యలకు పరిష్కారాలను ఆవిష్కరించే స్టార్టప్ సంస్థలను హ్యాకథాన్‌లో పాల్గొనేందుకు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే స్టార్టప్ సంస్థలకు అద్భుతమైన అవకాశాలను అందించడంతో పాటు, వారి ఆలోచనలు, పరిష్కారాలకు రూ.6 లక్షల విలువైన బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. వివరాలకు ఇపిడిసిఎల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటి నుంచి నవంబర్ 13వ తేదీ రాత్రి 9 గంటల వరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని, ఔత్సాహికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్ డైరెక్టర్ డి.చంద్రం, సిజిఎం బి.రామచంద్రప్రసాద్, ఎ-హబ్ (ఎయు ఇంక్యుబేషన్ సెంటర్) సిఇఓ రవి ఈశ్వరప్పు, ఎపి ట్రాన్స్‌కో రిటైర్డ్ సిఇ జి.భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భద్రత కోసం హైకోర్టును ఆశ్రయించిన గంగుల

ప్రజాశక్తి, అమరావతి
తనకున్న 3౦3 భద్రతను ఉపసంహరించడాన్ని సవాల్ చేస్తూ ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తనకు ప్రాణహాని ఉన్నందున తన భద్రతను పునరుద్దరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. 2019లో తనపై తన రాజకీయ ప్రత్యర్థులు దాడి చేశారని పిటిషన్ లో ప్రస్తావించారు. హెూంశాఖ ముఖ్య కార్యదర్శి, సెక్యూరిటీ రివ్యూ కమిటీ అదనపు డిజి, నంద్యాల ఎస్పీ, ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్ఎ స్ఏహెచ్లను ప్రతివాదులుగా పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి ఎక్సలెన్స్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - విజయవాడ

ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రపంచ పర్యాటక దినోత్సవం-2024ను పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి ఎక్సలెన్స్ అవార్డులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ శాఖ ఎన్టిఆర్ జిల్లా అధికారి శ్రీశిల్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరానికిగాను 38 విభాగాలకు సంబంధించి 41 అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్తమ కార్యనిర్వహణ పద్ధతులు అవలంభించిన టూర్ ఆపరేటర్లు, ట్రావెల్స్, హోటల్ తదితర రంగాల్లో ఆసక్తి కలిగిన సంబంధిత సంస్థలు www.tourism.ap.gov.in వెబ్సైట్ నుండి దరఖాస్తులను డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 22వ తేదీలోపు కార్యాలయ పనివేళల్లో ముఖ్య కార్యనిర్వహణ అధికారి, ఎపి టూరిజం అథారిటీ, 5వ ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

జెత్వాని కేసులో ఎవరున్నా వదలం

- రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సినీనటి జెత్వాని కేసులో ప్రభుత్వం ఎవరినీ బలిచేయలేదని, బాధిత మహిళకు న్యాయం చేస్తోందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ఈ కేసులో ఎంత పెద్దవారు వున్నా ప్రభుత్వం వదలిపెట్టదని తెలిపారు. విజయవాడలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. జెత్వాని కేసులో దర్యాప్తు వేగంగా జరుగుతోందన్నారు. దర్యాప్తులో తేలిన ఆధారాలు పరిశీలించాకే ముగ్గురు ఐపిఎస్లపై చర్యలు తీసుకున్నామన్నారు. కాగా ప్రకాశం బ్యారేజ్పైకి కుట్రపూరితంగానే బోట్లను వదిలినట్లు కనిపిస్తోందన్నారు. దీనిద్వారా బ్యారేజీ ధ్వంసానికి కుట్ర చేశారని ఆరోపించారు. ఈ కేసును కూడా సమగ్రంగా విచారణ చేస్తున్నామని తెలిపారు.

పరిశుభ్రంగా ఆర్టిసి ప్రాంగణాలు : ఇడి చంద్రశేఖర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అన్ని ఆర్టిసి ప్రాంగణాలను, డిపోలను పరిశుభ్రంగా ఉంచాలని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 17 నుండి అక్టోబర్ 1 వరకు నిర్వహించనున్న ఆర్టిసి స్వచ్ఛతా సేవా ఉత్సవాలను మంగళవారం విజయవాడలోని ఆర్టిసి ప్రధాన కార్యాలయంలో ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ సిబ్బందితో స్వచ్ఛతే సేవా ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి రోజు రెండు గంటలు స్వచ్ఛత కోసం కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి ఉన్నతాధికారులు కుమారి సామ్రాజ్యం, రాఘవకుమార్, శోభా మంజరి, విజయగీత, స్వరూపనందరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువతకు ఏచూరి జీవితం ఆదర్శనీయం

- సంస్మరణ సభలో శాసనమండలి చైర్మన్ మోషేనురాజు

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)


ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని, రాజకీయాల్లోకి వచ్చే ప్రతిఒక్కరూ సీతారాం ఏచూరి జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సిపిఎం ఆధ్వర్యాన సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షతన మంగళవారం జరిగింది. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటానికి మోషేనురాజు పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మోషేనురాజు మాట్లాడుతూ పేదల పక్షాన పోరాడే యోధుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. రాజకీయ విలువలు పెంచిన వ్యక్తి ఏచూరి అని కొనియాడారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణకు ఎంతో కృషి చేశారన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం తీసుకురావడంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. మతోన్మాదం తగదని, మానవత్వమే ముఖ్యమని చెప్పిన వ్యక్తి ఏచూరి అని తెలిపారు. భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ నీతి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం ఏచూరి అని పేర్కొన్నారు. సమస్యను పట్టుకోవడమే కాకుండా ఆది పరిష్కారమయ్యే వరకూ పట్టు వదలకుండా పోరాడే తత్వం కలిగిన మహోన్నత వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఆయన మరణం సిపిఎంకే కాదని యావత్ దేశానికి నష్టదాయకమని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ చిన్న వయసులోనే ఉద్యమాల బాటపట్టి దేశంలోనే అగ్రనేతగా ఎదిగిన వ్యక్తి సీతారాం అని కొనియాడారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి లంకపల్లి కృష్ణమూర్తి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు హరికుమార్రాజు పాల్గొని మాట్లాడారు. సిపిఎం నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వైద్య విద్యను దూరం చేయొద్దు

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన



కోటిరెడ్డి సర్కిల్ వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

వైద్య విద్యను విద్యార్థులకు దూరం చేయొద్దని కోరుతూ, పులివెందుల వైద్యకళాశాలకు వసతులు కల్పించలేమని రాష్ట్ర ప్రభుత్వమే ఎన్ఎంసికి లేఖ రాయడాన్ని నిరసిస్తూ కడప కోటిరెడ్డి సర్కిల్ వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి, జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంతో సంప్రదించి ఐదు కళాశాలలకు అనుమతులు తీసుకురావాల్సిన ప్రభుత్వం... రాజకీయ కక్ష సాధింపుతో ఒక్క పాడేరుకే 50 సీట్లు వచ్చాయని, మిగిలిన నాలుగు కళాశాలలకు అనుమతులు లభించలేదన్నారు. మొత్తం 700 సీట్లు ప్రభుత్వ నిర్లక్ష్యపు చర్య వల్ల కోల్పోయామని తెలిపారు. వైద్య విద్య ప్రయివేటీకరణ జరిగితే ఎంతో మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారన్నారు. భవిష్యత్తులో ఉచిత వైద్య సేవలు కూడా పేద ప్రజలకు అందవని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన సెల్ఫ్ఫైనాన్స్ పద్ధతిని తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, వంద రోజులు గడిచినా ఆ హామీపైన నోరు మెదపడం లేదన్నారు. వెంటనే వైద్య విద్య ప్రయివేటీకరణ ఆలోచనలను వెనక్కి తీసుకోవాలని, ఎన్ఎంసికి రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలని, సెల్ఫ్ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు పరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర నాయకులు సాయి, తరుణ్, విజయ్ పాల్గొన్నారు.

దర్శిలో ఉద్రిక్తత

- 144 సెక్షన్ విధింపు
- వారి ఇంటి నుంచే జడ్పి చైర్పర్సన్, ఎమ్మెల్యే ఆందోళన

ప్రజాశక్తి-దర్శి (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గంలో రాజకీయ ఉద్రిక్తతలు తీవ్రమవుతున్నాయి. పోలీసులు వైసిపి కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారని, దీనిని ప్రశ్నించిన తనతో సిఐ అనుచితంగా మాట్లాడారని దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్రెడ్డి నిరసనకు దిగారు. దీంతో పోలీసులు సెక్షన్ 144 విధించడంతో బూచేపల్లి తన ఇంటి వద్దే నిరసన తెలిపారు. స్థానికుల వివరాల మేరకు.. దర్శి మండలం బొట్లపాలెంలో బూచేపల్లి కారుకు టిడిపి కార్యకర్త ఒకరు మోటారు సైకిల్ను అడ్డుపెట్టారు. చాలాసేపు తీయకపోవడంతో గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు బండిని పక్కకు లాగి, కార్యకర్తను పక్కను నెట్టేశారు. దీంతో బూచేపల్లి అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో వైసిపి నేతపై టిడిపి కార్యకర్త కేసు పెట్టారు. వైసిపి నేతను స్టేషన్కు తీసుకొచ్చి పోలీసులు తమదైన శైలిలో వ్యవహరించారు. ఈ వ్యవహారాన్ని బూచేపల్లి సీరియస్గా తీసుకున్నారు. వైసిపి కార్యకర్తలను కొట్టడం, కేసులు పెట్టడం, ప్రశ్నిస్తే అవమానకరంగా మాట్లాడుతుండడంతో పోలీసులపై బూచేపల్లి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా ఎమ్మెల్యే మంగళవారం ఆందోళనకు పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు దర్శిలో 144 సెక్షన్ విధించారు. మండలాల నుంచి వైసిపి కార్యకర్తలను దర్శికి రాకుండా కట్టుదిట్టం చేశారు. పోలీసులు భారీగా మోహరించి పట్టణానికి నాలుగు వైపులా ఉన్న రహదారులను దిగ్బంధనం చేశారు. గృహనిర్బంధం చేస్తున్నట్లు బూచేపల్లికి పోలీసులు ముందుగానే నోటీసులు జారీ చేశారు. బయటకు రావడానికి అనుమతి లేదని చెప్పారు. పోలీసులను తప్పించుకొని తన ఇంటికి చేరుకున్న కార్యకర్తలతో జడ్పి చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి అక్కడ నుంచే నిరసన కార్యక్రమం చేపట్టారు. సిఐ, ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఫ్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. పోలీసులపై విచారించి చర్యలు తీసుకోవాలని, ఇదే తీరున కార్యకర్తలపై దాడులు, కేసులు పెడితే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఆర్టిసి బస్సును ఢీకొట్టిన లారీ

- 30 మందికి గాయాలు

ప్రజాశక్తి-రామాపురం (అన్నమయ్య జిల్లా)

ఆర్టిసి బస్సును సిమెంట్ లారీ ఢీకొన్న ఘటన కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారి అన్నమయ్య జిల్లా రామాపురం మండలం నారాయణపురం పోలీస్ చెక్పోస్ట్ వద్ద సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో సుమారు 30 మందికి గాయాలయ్యాయి. ఎస్ఐ వెంకట సుధాకర్రెడ్డి కథనం మేరకు...వేలూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న సూపర్ లగ్జరీ బస్సును కడప నుంచి రాయచోటి వైపు వస్తున్న సిమెంట్ లారీ ఎదురుగా ఢీకొట్టింది. బస్సులో ప్రయాణిస్తున్న పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి రామాపురం ఎస్ఐ, తన సిబ్బంది చేరుకొని తీవ్రంగా గాయపడిన వారిని కడప రిమ్స్కు, స్వల్పంగా గాయపడిన వారిని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రోడ్డుకు అడ్డంగా బస్సు, లారీ పడిపోవడంతో కడప-రాయచోటి మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జెసిబిలతో వాటిని తొలగించారు. ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుని ప్రయాణికులు వారి నివాసాలకు వెళ్లారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ధర్నాలో పాల్గొన్న వి.కృష్ణయ్య

రైతులకు ఇన్పుట్ సబ్సిడీ అందించాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భారీ వర్షాలు, వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు వరికి ఎకరాకు రూ.25 వేలు, ఉద్యాన, వాణిజ్య పంటలకు రూ.50 వేలు ఇన్పుట్ సబ్సిడీ అందించాలని డిమాండ్ చేస్తూ ఏలూరు జిల్లాలోని జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖ కార్యాలయాల వద్ద ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు మంగళవారం ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. వరదల వల్ల వరి, పత్తి, మిర్చి, ఉద్యాన, వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. ఆక్వా చెరువుల గట్లు తెగిపోయి చేపలు, రొయ్యలు కొల్లేరు పాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఈ పరిస్థితుల్లో బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పంటల బీమా పరిహారం అందించాలని, పంట రుణాలు మాఫీ చేయాలని, కౌలు రైతులు, రైతులకు ఇన్పుట్స్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ అందించాలని కోరారు. వరద ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని, పంట భూముల్లో వేసిన ఇసుక మేటలు తొలగించాలని కోరారు. అనంతరం ఉద్యాన, వ్యవసాయ శాఖ జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుతో వైఎస్ వివేకా కుమార్తె సునీత భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్రెడ్డి మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో భేటీ అయ్యారు. సచివాలయంలోని ముఖ్యమంత్రి పేషీకి వెళ్లి వివేకానంద హత్య కేసుకు సంబంధించిన అంశాలను వారు చర్చించారు. వివేకానందరెడ్డి పిఎ కృష్ణారెడ్డి ఫిర్యాదుతో అప్పటి సిబిఐ ఎస్పి రాంసింగ్తో పాటు తమపై అక్రమ కేసు పెట్టారని ముఖ్యమంత్రికి వివరించారు. కృష్ణారెడ్డి చేసిన ఫిర్యాదులో నిజానిజాలపై విచారణ చేయించాలని కోరారు. సిఐడి విచారణ ద్వారా వాస్తవాలు బయటకు తేవాలని కోరారు. సునీత విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. తనకు అన్ని విషయాలు తెలుసునని విచారణ చేయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

పట్టు పరిశ్రమకు ప్రోత్సాహకం కరువు

- రాయితీ మందులకు మంగళం
- షెడ్ల నిర్మాణానికీ ఇవ్వని వాటా

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి


పట్టు గూళ్లను పరిశీలిస్తున్న పవన్ కల్యాణ్ (ఫైల్)

పట్టు పరిశ్రమకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. పట్టు రైతుల సమస్యలను ప్రభుత్వాలు గాలికి వదిలేస్తున్నాయి. గతంలో సబ్సిడీలు ఇచ్చేవారు. పట్టు గూళ్లను పండించిన వారికి ఇచ్చే ప్రోత్సాహకాలు సైతం నిలిచిపోయాయి. రాయితీ మందులకూ మంగళం పాడేశారు. ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన పవన్ కల్యాణ్... పట్టు రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పుడు టిడిపి కూటమి సర్కారులో ఆయన డిప్యూటీ సిఎంగా ఉన్నారు. ఎన్నికల హామీ మేరకు తమ సమస్యలను పరిష్కరించాలని పట్టు రైతులు కోరుతున్నారు. కాకినాడ జిల్లాలో గొల్లప్రోలు, తుని, కోటనందూరు, శంఖవరం, రౌతులపూడి, తొండంగి, రంగంపేట, పెద్దాపురం, పిఠాపురం, తూర్పుగోదావరి జిల్లాలో బిక్కవోలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో రాజవొమ్మంగి, వై.రామవరం, దేవీపట్నం మండలాల్లో మల్బరీ తోటలు సాగవుతున్నాయి. మొత్తం మూడు వేల ఎకరాల్లో సుమారు 1,300 మంది రైతులు వీటిని సాగు చేస్తున్నారు.

సబ్సిడీలు నిలిపివేత

ప్రభుత్వం రాయితీ ద్వారా అందించే మందుల ధరలు బయట మార్కెట్లో బాగా పెరిగాయి. కిలో విజేత పౌడర్ 25 కేజీలు రూ.750 నుంచి రూ.1000కి చేరింది. సున్నం 25 కేజీలు రూ.150 నుంచి రూ.220, బ్లీచింగ్ పౌడర్ కేజీ రూ.40 నుంచి రూ.80, అస్త్ర వంద గ్రాములు రూ.150 నుంచి రూ.180కు పెరిగింది. మల్బరీ తోటలు, పట్టుగూళ్ల తయారీకి అవసరమయ్యే దాదాపు పది రకాల రోగనిరోధక మందులను రాష్ట్ర ప్రభుత్వం 75 శాతం సబ్సిడీతో అందించేది. ఒక షెడ్డుగల రైతుకు ఏడాదికి రూ.5 వేల యూనిట్ అయితే, ఇందులో ప్రభుత్వం రూ.75 శాతం రాయితీ సొమ్ము అంటే రూ.3,750 అందజేసేది. మిగిలిన రూ.1,250 లబ్ధిదారులు భరిం,చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సబ్సిడీని నిలిపివేసింది. దీంతో, రెండు, మూడు ఎకరాల్లో మల్బరీ సాగు చేసే రైతులపై ఏడాదికి సుమారు రూ.50 వేలు అదనపు భారం పడుతోంది.

నిలిచిన రాష్ట్ర వాటా

షెడ్ల నిర్మాణానికి యూనిట్ ధర రూ.4 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో 50 శాతం కేంద్రం, 25 శాతం లబ్ధిదారుని వాటా కాగా, మిగిలిన 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలి. మూడున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటాను నిలిపివేసింది. 50 శాతం సబ్సిడీపై వర్మీ కంపోస్టు ఇచ్చేవారు. బివి (బై ఓల్టైన్) రకం పట్టు గూళ్లను పండించిన వారికి ప్రోత్సాహకంగా కిలోకు రూ.50, సివి (క్రాస్ బ్రీడ్) రకం పండించే వారికి కిలోకు రూ.20 ఇచ్చేవారు. కొన్నేళ్లుగా ఇవీ అందడం లేదని రైతులు చెబుతున్నారు.

ప్రోత్సాహకాలు పెండింగ్



2004 నుంచి ఇన్సెంటివ్ పెంచడం లేదు. పట్టు రైతులను గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. చేబ్రోలు గ్రామానికి చెందిన రైతులకు ఇప్పటి వరకూ రూ.1.70 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. స్థానికంగా మార్కెటింగ్ సౌకర్యం లేక ఇతర ప్రాంతాలకు వెళ్లి అమ్ముకోవాల్సి వస్తోంది. దళారుల వల్ల గిట్టుబాటు ధర దక్కడం లేదు.

- ఒరుగంటి శివ, పట్టు రైతు, చేబ్రోలు, గొల్లప్రోలు మండలం

రాయితీలు ఇవ్వకపోతే ఎలా?



పట్టు పరిశ్రమపై అనేకమంది జీవనోపాధి పొందుతున్నారు. గత నాలుగేళ్లగా ప్రభుత్వం రాయితీలు ఇవ్వడం లేదు. సబ్సిడీ పథకాలను ఎత్తివేయడంతో అదనపు భారం తప్పడం లేదు. పెట్టుబడి డబ్బులు రాకపోగా తీవ్ర నష్టాలకు గురై అప్పుల పాలవుతున్నాం. ఇదే పరిస్థితి కొనసాగితే చేనేత రంగం భవిష్యత్తులో కనుమరుగయ్యే ప్రమాదముంది.

- ఎన్.ఏసుబాబు, పట్టు రైతు, చేబ్రోలు, గొల్లప్రోలు మండలం

ఎగుమతుల నేల చూపులు

- పెరిగిన దిగుమతులు
- 10 నెలల గరిష్టానికి వాణిజ్య లోటు



న్యూఢిల్లీ : భారత్ స్వయం సమృద్ధి సాధిస్తోందన్న మోడీ ప్రభుత్వ వర్గాల ప్రకటనలకు.. ఆచరణకు తీవ్ర అంతరం ఉంది. దేశ ఎగుమతులు నేల చూపులు చూస్తోంటే.. మరోవైపు దిగుమతులు ఎగిసిపడటమే ఇందుకు నిదర్శనం. ప్రపంచ మార్కెట్లో భారత ఉత్పత్తులకు డిమాండ్ సన్నగిల్లడంతో ప్రస్తుత ఏడాది ఆగస్టులో ఎగుమతులు 9.32 శాతం పతనమై 34.71 బిలియన్ డాలర్లకు క్షీణించాయి. కాగా.. సరుకుల దిగుమతులు మాత్రం 3.3 శాతం పెరిగి 64.36 బిలియన్ డాలర్లకు ఎగిశాయి. మంగళవారం కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించిన గణంకాల ప్రకారం.. ఎగమతులు తగ్గడం.. దిగుమతుల పెరగడంతో ఆగస్టులో దేశ వాణిజ్య లోటు 29.65 బిలియన్ డాలర్లకు పెరిగి.. 10 మాసాల గరిష్ట స్థాయికి చేరింది. దీంతో వరుసగా రెండో మాసంలోనూ అత్యధిక వాణిజ్య లోటు చోటు చేసుకున్నట్లయ్యింది. ఇది అధిక విదేశీ చెల్లింపులకు దారి తీయనుంది.

పసిడి దిగుమతులు రెట్టింపు..

"గడిచిన ఆగస్టులో బంగారం దిగుమతులు రెట్టింపై 10.06 బిలియన్ డాలర్లకు ఎగిశాయి. 2023 ఇదే మాసంలో 4.9 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి. 2021 మార్చి తర్వాత తొలిసారి బంగారం దిగుమతులు అమాంతం పెరిగాయి. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థకు వాణిజ్య లోటు పెద్ద విషయం కాదు. అభివృద్ధి చెందుతున్న భారత్ లాంటి దేశాలను అగ్ర దేశాలతో పోల్చలేము. విదేశీ మారకం సమస్యలేమీ లేము. ఇది పెద్ద విషయమేమీ కాదు." అని వాణిజ్య శాఖ సెక్రటరీ సునీల్ భర్త్వాల్ పేర్కొన్నారు.

"ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి మేఘాలు నెలకొన్నప్పటికీ రత్నాలు, ఆభరణాలు, పెట్రోలియంయేతర భారత ఎగుమతులు మెరుగ్గానే ఉన్నాయి. ఇది కొంత ఉపశమనం కలిగిస్తోంది. పెట్రోలియం ధరలలో క్షీణత చమురు దిగుమతి బిల్లుకు మంచిది. ఇది ఆగస్టులో 11.01 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. అయితే.. ఇది పెట్రోలియం ఎగుమతుల విలువను దెబ్బతీస్తుంది" అని సునీల్ భర్త్వాల్ పేర్కొన్నారు.

ఇన్ఫోసిస్తో ఎల్ఐసి ఒప్పందం

- నూతన డిజిటల్ వేదిక ఏర్పాటు లక్ష్యం



ముంబయి : టెక్ కంపెనీ ఇన్ఫోసిస్తో ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) కీలక ఒప్పందం కుదుర్చుకుంది. కాలంతో పాటు టెక్నాలజీని అందిపుచ్చుకోవడాని.. మరింత మెరుగైన డిజిటల్ వేదికను అందుబాటులోకి తేవాలని నిర్దేశించుకుంది.

డిజిటల్ వినూత్నత, విలువ పరంగా డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ చొరవకు నాయకత్వం వహించడానికి ఎల్ఐసికి సహకారం అందించనున్నట్లు ఇన్ఫోసిస్ పేర్కొంది. త్వరలోనే తదుపరితరం డిజిటల్ ప్లాట్ఫామ్ను రూపొందించడాన్ని ప్రారంభిస్తుందని తెలిపింది. ఇది ఎల్ఐసి ఖాతాదారులు, ఏజెంట్లు, ఉద్యోగులకు ఓమ్నిచానెల్ ఎంగేజ్మెంట్, డేటా ఆధారిత హైపర్ పర్సనలైజ్డ్ అనుభవాలను అందించనుంది. భారీ స్థాయి డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ ప్రాజెక్టులను అమలు చేయడంలో దాని విస్తృత అనుభవం, బ్యాంకింగ్, ఫైనాన్షియల్.. ఇన్సూరెన్స్ రంగాలలో మరింత నైపుణ్యం పెంచుకోవాలని ఎల్ఐసి భావించింది. కృత్రిమ మేధా (ఎఐ) క్లౌడ్ నైపుణ్యాలను ఎల్ఐసిలో కూడా ప్రవేశపెట్టనున్నామని ఇన్ఫోసిస్ సిఇఒ, ఎండి సలీల్ పరేఖ్ తెలిపారు. ఇది ఎల్ఐసి అభివృద్ధికి ఎంతగానో దోహదం చేయనుందన్నారు. దీంతో పాలసీదారులు, ఏజెంట్లు, ఉద్యోగులు అధునిక టెక్నాలజీ అనుభవాలను పొందనున్నారని ఎల్ఐసి ఎండి, సిఇఒ సిద్ధార్థ మోహంతి పేర్కొన్నారు.

27 నుంచి అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్

న్యూఢిల్లీ : గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ను సెప్టెంబర్ 27న ప్రారంభిస్తున్నట్లు ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ ఇండియా తెలిపింది. ప్రతీ ఏడాది నిర్వహించే ఈ సేల్లో ఎప్పటిలాగే తమ ప్రైమ్ వినియోగదారులకు ఒక్క రోజు ముందు 26 నుంచే అందుబాటులో ఉంటుందని ఆ సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఎస్బిఐ డెబిట్, క్రెడిట్ కార్డుతో కొనుగోలు చేసిన వారికి అదనంగా 10 శాతం తగ్గింపును ఇవ్వనున్నట్లు అమెజాన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ సౌరభ్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ సేల్లో పలు కొత్త ఉత్పత్తులను అందుబాటులోకి తేనున్నామన్నారు. అమెజాన్ పే, ఐసిఐసిఐ బ్యాంక్ క్రెడిట్ కార్డుపై 5 శాతం వరకు క్యాష్బ్యాక్ అందిస్తున్నామన్నారు.

వంటనూనెలలో కల్తీ చేస్తే కఠిన చర్యలు

- విజిలెన్స్ డిజి హరీష్కుమార్ గుప్తా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వంటనూనెలలో కల్తీచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డిజి హరీష్కుమార్ గుప్తా తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కల్తీనూనెలను అరికట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ఇందుకోసం 26 జిల్లాలో 50 తనిఖీ బృందాలు పనిచేస్తున్నాయని చెప్పారు. వంటనూనెల ఉత్పత్తిదారులు, హోల్సేల్ డీలర్లు, స్టాకిస్టులు, వ్యాపారులు, షాపింగ్ మాల్స్లో ఎక్కడైనా సరే తప్పులు జరిగినట్లు తేలితే ట్రేడ్ లైసన్స్ను రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజారోగ్యం దెబ్బతినేలా ఎవరూ వ్యవహరించవద్దని తెలిపారు.

మారుతి సుజుకి ఫ్రాంక్స్ టర్బో క్యాంపెయిన్



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ ఇటీవల ఆవిష్కరించిన ఫ్రాంక్స్ టర్బో విక్రయాల కోసం ప్రత్యేక క్యాంపెయిన్ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. పవర్ఫుల్ ఇంజిన్, స్టన్నింగ్ డిజైన్ కలిగిన ఈ కారు థ్రిల్లింగ్ అనుభవాన్ని ఇవ్వనుందని ఆ కంపెనీ మార్కెటింగ్ అండ్ సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పర్థో బెనర్జీ పేర్కొన్నారు. 1.0 లీటర్ కె సిరీస్ పెట్రోల్ ఇంజిన్తో ఆవిష్కరించిన లీటర్కు 21.5 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందన్నారు.

ఆక్రమణల కోరల్లో బుడమేరు, కొల్లేరు, ఉప్పుటేరు

- ప్రక్షాళన చేయాలని సిపిఐ నేత నారాయణ డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్, మండవల్లి


కొల్లేరు ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న సిపిఐ నేతలు

కొల్లేరు సరస్సు పూర్తిగా ఫిష్ మాఫియా ఆక్రమణల కోరల్లో చిక్కుకుందని, దీనివల్ల ఎగువ ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. బుడమేరు, కొల్లేరు, ఉప్పుటేరుల్లో ఉన్న ఆక్రమణలు ప్రక్షాళన చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని స్పష్టం చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన ఏలూరు జిల్లా మండవల్లి మండలం పెదఎడ్లగాడి, చినఎడ్లగాడి నుంచి బుడమేరు వరకు కొల్లేరు వరద ప్రభావిత ప్రాంతాలను సిపిఐ, రైతుసంఘం నేతలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. ఆక్రమణల వల్లే కొల్లేరు గ్రామాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. ఆక్రమణలను తొలగించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని చెప్పారు. రామకృష్ణ మాట్లాడుతూ... కొల్లేరును ప్రక్షాళన చేయాలని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఇందుకోసం పోరాటం చేస్తామన్నారు. బుడమేరు ఆక్రమణల వల్ల విజయవాడ నష్టపోయిందని, కొల్లేరు ఆక్రమణల వల్ల వేలాది ఎకరాల్లో పంట, ఆక్వా సాగు దెబ్బతిందన్నారు. ప్రస్తుతం నెలకొన్న సమస్యలను ఢిల్లీ వెళ్లి కేంద్రానికి వివరిస్తామని, అలాగే, ఐక్యరాజ్య సమితికి కూడా ఆక్రమణలపై ఫిర్యాదు చేస్తామని, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కొల్లేరును 5వ కాంటూరు వరకు కాపాడాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, సిపిఐ నేతలు అక్కినేని వనజ, డేగా ప్రభాకర్, మన్నవ కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-శింగరాయకొండ (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా శింగరాయకొండలోని గురుకుల పాఠశాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పిల్లలకు అందించే ఆహారం, స్టాక్ రిజిస్టర్లు నిశితంగా పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

పేద విద్యార్థుల విద్యావ్యాప్తికి సమిష్టి కృషితో పనిచేయాలని, అధ్యాపక సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ కె రమాదేవి తమ పాఠశాల ఆవరణంలో విద్యుత్ అసౌకర్యంతో పాటుగా కోతుల బెడద ఎక్కువగా ఉందని, అవకాశం ఉన్న యెడల పంచాయతీ ద్వారా ఈ సమస్యను పరిష్కరించాలని కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో శింగరాయకొండ తహసీల్దార్ టి రవి, మండల విద్యాశాఖ అధికారి కత్తి శ్రీనివాసులు, సిడిపిఒ మల్లేశ్వరి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ వీరాంజనేయులు పాల్గొన్నారు.

సంపాదకీయం


మారని తీరు!

కిందపడ్డా నాదే పైచేయి అన్నట్టుగా ఉంది మోడీ ప్రభుత్వ తీరు. ఏకపక్ష, నిరంకుశ విధానాలు ఇక చెల్లవంటూ... 2019లో గెలిపించిన 303 స్థానాల నుంచి 63 స్థానాలకు కోత పెట్టి, 240 సీట్లకు పరిమితం చేసినా... అంగీకరించే నైతికత ఈషన్మాత్రమైనా కనిపించడం లేదు. భారీగా పెరిగిన ద్రవ్యోల్బణంతో ఆకాశాన్నంటిన నిత్యావసరాల ధరలు, భయపెడుతున్న నిరుద్యోగ రక్కసి, రోజురోజుకూ పెరిగిపోతున్న పేద - ధనిక అంతరాలు వంటి వాటికి ఎన్‌డిఎ సర్కారు అజెండాలో స్థానమే లేదు. మతం పేరుతో సమీకరణాలు జరుపుతూ, వైషమ్యాలు పెంచడమే అజెండాగా గతంలో ముందుకు తీసుకొచ్చిన 'ఒకే దేశం - ఒకే ఎన్నిక', లేటరల్ ఎంట్రీ విధానం, ప్రసార సేవల (నియంత్రణ) బిల్లు, వక్ఫ్ చట్ట సవరణ... ఇలా ప్రతి అంశంలోనూ ముందుకెళ్లేందుకు ప్రయత్నిస్తూనే వుంది. ఈ అజెండాతో వెళ్తే.. తమ కొంప కొల్లేరైపోతుందని సంకీర్ణ భాగస్వామ్య పక్షాలు సైతం భయపడుతున్నాయి. మరోవైపు చేతికి ఎముక లేదన్నట్టు ఆశ్రిత కార్పొరేట్లకు సర్వం కట్టబెడుతూ, వారి అరాచకాలకు అడ్డగోలుగా మద్దతిస్తోంది.

మూటగట్టుకున్న ప్రజావ్యతిరేకతను తగ్గించుకునే ప్రయత్నంలో.. చేసిన జిమ్మిక్కులు వికటించాయి. పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) స్థానంలో తీసుకొస్తున్నట్టు ఆర్భాటంగా ప్రకటించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యుపిఎస్)పై ఉద్యోగ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నిరుద్యోగ యువతకు భరోసా ఇచ్చే ప్రయత్నమేదీ గత వందరోజుల్లో లేదు. అగ్నివీర్‌ను సమీక్షిస్తామని చెప్పినా... ఆ పథకాన్ని రద్దు చేయాల్సిందేనన్న నినాదం మారుమోగుతోంది. అదానీ కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయిన సెబీ ఛైర్‌పర్సన్ మాధబి బచ్‌కు వత్తాసు పలుకుతూ, చర్యలకు మీనమేషాలు లెక్కిస్తోంది. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై నిషేధాన్ని ఎత్తివేసిన కొద్దిరోజులకే లేటరల్ ఎంట్రీ విధానం తీసుకురావడం యాదృచ్ఛికం కాదు. నిపుణుల పేరుతో కార్పొరేట్లను, సంఘపరివారాన్ని తీసుకొచ్చి, బ్యూరోక్రసీని నేరపూరితం, కార్పొరేటీకరించడమే లక్ష్యంగా సివిల్స్ అభ్యర్థుల కలలను కల్లలు చేసేందుకు యత్నించింది. పెద్దఎత్తున నిరసన, మిత్రపక్షాలైన జెడియు, ఎల్‌జెపి వ్యతిరేకతతో మూడో రోజే విరమించుకోవాల్సి వచ్చింది. ఆలయాల్లో అన్యమతస్తులు ఉండకూడదంటూ నిత్యం ఉద్రిక్తతలు రెచ్చగొడుతూనే... సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్ బోర్డులను ముస్లిమేతరులతో నింపేసి, ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెట్టే వక్ఫ్ సవరణ చట్టంపై సర్వత్రా వ్యతిరేకత ఎదురైంది. మిత్రపక్షాలుసైతం మద్దతివ్వలేమని సంకేతాలివ్వడంతో జెపిసికి నివేదించింది. తగినంత మెజారిటీ లేకపోయినా... ఒకే దేశం - ఒకే ఎన్నికలు అంటూ తాజాగా ఆర్భాటం చేస్తోంది.

లోక్‌సభ ఎన్నికల్లో మోడీ సర్కారు, గోడీ మీడియా బండారాన్ని బయటపెట్టిన కొన్ని యూట్యూబ్ న్యూస్ ఛానెళ్లు, కొందరు యూట్యూబర్లు లక్ష్యంగా తీసుకొచ్చిన బ్రాడ్ కాస్టింగ్ సర్వీసెస్ (నియంత్రణ) బిల్లుకు తీవ్ర వ్యతిరేకత రావడంతో అక్టోబర్ 15 వరకూ స్పందనలు సమర్పించవచ్చంటూ మంత్రితో ప్రకటన చేయించింది. కోవిడ్ సాకుతో జనగణనను వాయిదా వేసిన కేంద్రం.. కులగణనకు ప్రతిపక్షాలు గట్టిగా పట్టుబడుతుండటంతో... అందుకు సమాయత్తమవుతున్నట్టు సంకేతాలిస్తోంది. గ్రామీణులకు కొంతమేరకు భరోసా ఇస్తున్న ఉపాధి హామీ నిధుల్లో కోత పెడుతూ ఉసురుతీస్తోంది. పంటల బీమా పథకం, యూరియా సబ్సిడీ, పోషకాహార ఆధారిత సబ్సిడీలకూ కేటాయింపులు తగ్గించింది. కొల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యపై న్యాయం చేయడానికి బదులు రాజకీయ ప్రయోజనాల కోసం బిజెపి పాకులాడుతోంది. కథువా, హత్రాస్, ఉన్నావ్, మణిపూర్‌లో అత్యంత అనాగరిక ఘటనల గురించి ఎన్నడూ నోరుమెదపని మోడీ... ఇటీవల మహిళల భద్రత గురించి మాట్లాడటం విడ్డూరమే! హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, అస్సాం తదితర రాష్ట్రాల్లో ఆవు పేరుతో ఆటవికంగా హత్యలు చేసే ఘోరాలు సాగిపోతూనే ఉన్నాయి. నేరస్తులను రక్షిస్తూ, బాధితులను జైళ్లలో తోస్తున్న వారికి మద్దతుగానా అన్నట్టు... దూడను తన కుటుంబ సభ్యురాలిగా చేసుకుంటున్నానంటూ సోషల్ మీడియాలో ప్రధాని ప్రకటించారు. కార్పొరేట్ అనుకూల, మతోన్మాద అజెండానే ఈ వంద రోజుల్లోనూ ముందుకు సాగింది. ఈ దుర్విధానాలకు అడ్డుకట్ట వేయాల్సింది ప్రజా ఉద్యమాలే!

మహనీయుల మాట



మనిషే చరిత్రను నిర్మిస్తాడు. మనిషి సమకూర్చుకునే ఉత్పత్తి శక్తులే అన్ని రకాల సామాజిక సంబంధాలనూ నిర్ధారిస్తాయి.

- జి.వి. ప్లెఖనోవ్,
రష్యన్ విప్లవకారుడు, మార్క్సిస్టు సిద్ధాంతవేత్త.

విశ్లేషణ

వివాదాల్లో 'సెబి' అధిపతి

వి. రాంభూపాల్



'సమ్‌థింగ్ బిగ్ సూన్ ఇండియా' అంటూ భారత స్టాక్ మార్కెట్ వాటాదారుల్లో సంచలనం రేపిన హిండెన్‌బర్గ్ తాజాగా 'సెబి' ఛైర్‌పర్సన్, ఆమె భర్తపై తీవ్రమైన ఆరోపణలు చేసింది. అదానీ గ్రూప్ షేర్లకు లేని విలువ కల్పించేందుకు కారణమైన మారిషస్ ఆఫ్‌షోర్ ఫండ్స్‌లో మాధబి, ఆమె భర్త ధావల్ బచ్ లకు వాటాలు ఉన్నాయని హిండెన్‌బర్గ్ ఆధారాలతో బయటపెట్టింది. అదానీ సోదరుడు వినోద్ అదానీ 'అనిల్ అహుజా' కంపెనీని స్థాపించి, గ్లోబల్ డైనమిక్ ఆపర్చునిటీస్ ఫండ్‌లో పెట్టుబడులు పెట్టినట్లు, ఆ కంపెనీ మారిషస్ లోని డొల్ల (నకిలీ) కంపెనీ ఐపిఇ ప్లస్ ఫండ్-1 పెట్టుబడులు పెట్టినట్లు విమర్శ చేసింది. ఇందులో సెబి అధిపతి మాధబి బచ్ ప్రమేయం ఉండడమే కాక, ఆమె భర్త ధావల్ బచ్‌లు వాటాదారులుగా ఉన్నారని సాక్ష్యాలను వెల్లడించింది. చట్టబద్ధ సంస్థకు చీఫ్‌గా ఉంటూ పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందారని, అదానీ ఆర్థిక వ్యవహారాల్లో వీరు వాటాదారులు కాబట్టే గత సంవత్సరం తమ సంస్థ అదానీపై చేసిన ఆరోపణలను సరిగా విచారించకుండా క్లీన్ చిట్ ఇచ్చారని తీవ్రంగా విమర్శించింది.



సెబి ఛైర్‌పర్సన్ ఆ సంస్థ చరిత్రలో ఎన్నడూ లేనంతగా వరుస విమర్శలకు గురౌతున్నారు. షేర్ మార్కెట్‌లో అక్రమాలు జరగకుండా నియంత్రించాల్సిన సంస్థ అధిపతే అక్రమాల్లో మునిగిపోయారని రుజువులు బయటకురావడం కంచే చేను మేసినట్లుగా వుంది. శరవేగంగా కుబేరుల జాబితాలో చేరిన అదానీ అక్రమ వ్యాపారాల గురించి బయటపెట్టిన హిండెన్‌బర్గ్ సంస్థ...ఆ అక్రమాల్లో సెబి ఛైర్‌పర్సన్ మాధబి పురి బచ్ కూడా భాగస్వామి అని తాజాగా ఆధారాలను బయటపెట్టింది. ఈ వ్యవహారంపై అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు సెబి తేలు కుట్టిన దొంగల్లా వున్నంత మాత్రాన నేరం న్యాయమైపోదు. సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛ్సేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) ఛైర్మన్‌ను నియమించేది ప్రధానమంత్రి, ఆ ప్రధానమంత్రికి అత్యంత సన్నిహితుడు అదానీ, ఆ అదానీ అక్రమ వ్యాపారానికి తోడ్పడింది, అందులో భాగస్వామిగా వున్నది సెబి ఛైర్‌పర్సన్ అయినప్పుడు ఇది కేవలం ఒక వ్యక్తి లేదా సంస్థ చేసిన ఆర్థిక అక్రమ వ్యవహారం కాదు. దేశాధికారాన్ని అడ్డుపెట్టుకుని చెలరేగుతున్న కార్పొరేట్, మతతత్వ శక్తుల అపవిత్ర వికృత రూపంలో దీన్ని ఒక భాగంగానే చూడాలి. సరళీకరణ విధానాల ఆశ్రిత పెట్టుబడి అవినీతి చరిత్రలో ఇది మరో అధ్యాయంగా పరిశీలించాలి.

సెబి ఎందుకు ఏర్పడింది?

ప్రపంచీకరణ అంటేనే అవినీతీకరణ అని ప్రపంచబ్యాంకు మాజీ అధ్యక్షుడు స్టీఫెన్ స్టిగ్లిట్జ్ తన అనుభవం నుండి చెప్పారు. మన దేశంలో 1991 నుండి అమలైన ఆ ఆర్థిక విధానాల వల్ల షేర్ మార్కెట్‌లో అవినీతి, అక్రమాలు పెరుగుతాయని పెద్ద వ్యాపారులకు, పెట్టుబడిదారులకు తెలుసు. అందుకనే కేంద్ర ప్రభుత్వం ద్వారా తమ వ్యాపారాలకు, తమ డబ్బుకు రక్షణ కల్పించుకోవడానికి 1988 ఏప్రిల్‌లో సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛ్సేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా అనే చట్టబద్ధత లేని సంస్థను ఏర్పాటు చేసుకున్నారు (ప్రపంచీకరణ విధానాల దుష్ఫలితాల మీద పెట్టుబడిదారులకు ఎంత స్పష్టత వుందో చూడండి). వాస్తవానికి స్వాతంత్ర్యం వచ్చిన 1947 నుండే 'మార్కెట్ నియంత్రణ అధికారం, క్యాపిటల్ ఇష్యూస్ చట్టం' అమలులో వుంది. అయితే సరళీకరణ విధానాల వల్ల షేర్ మార్కెట్ వ్యాపారం, అందులో అక్రమ పద్ధతులు పెరుగుతున్నందున 1988 నాటి 'సెబీ'ని 1992 జనవరి నుండి చట్టబద్ధ సంస్థగా పార్లమెంట్‌లో ఆమోదం పొంది కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ కింద పని చేస్తుంది. చట్టంలో 'సెబీ' పని క్లుప్తంగా ఇలా పేర్కొన్నారు. "సెక్యూరిటీలలో పెట్టుబడిదారుల (వాటాదారుల) ప్రయోజనాలను రక్షించడం, ఇలాంటి వ్యాపార అభివృద్ధిని ప్రోత్సహించడం, సెక్యూరిటీల మార్కెట్‌ను నియంత్రించడం". షేర్ మార్కెట్ గొంగళి లాంటిదని అందులో అక్రమాల వెంట్రుకలు వుంటాయని అప్పటికే ప్రపంచ అనుభవం వుంది. 'సెబీ'ని ఏర్పాటు చేసిన కాల మహిమో ఏమో గానీ అదే సంవత్సరమే హర్షద్ మెహతా కుంభకోణం బయటపడి షేర్ మార్కెట్ అల్లకల్లోలం అయ్యింది. ఇలాంటి అక్రమాలను అరికట్టేందుకు పూర్తి అధికారాలు సెబీ కి లేవని ఆ సంస్థ మొదటి ఛైర్మన్ జి.వి. రామకృష్ణ అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ సలహాదారుడు మాంటెక్ అహ్లూవాలియాకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ సంస్థకు మరిన్ని అధికారాలు ఇచ్చారు. ఆ తర్వాత కొద్దికాలానికే కేతన్ పరేఖ్ కుంభకోణం, తదనంతరం కుంభకోణాల పరంపర కొనసాగుతూనే వుంది.

అతి తక్కువ కాలంలో ప్రపంచ కుబేరుడుగా అవతరించిన గౌతమ్ అదానీ షేర్ మార్కెట్ వ్యాపారం అక్రమాల పుట్ట అని, తన షేర్ల ధరను ఎక్కువగా చూపించి లాభపడ్డారని, దాని లెక్కల్లో కూడా అనేక అక్రమాలు వున్నాయని అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ అనే సంస్థ తీవ్రంగా విమర్శించింది. గత సంవత్సరం జనవరి నెలలో చేసిన ఈ విమర్శలు ఎలా సరైనవో 88 ప్రశ్నలతో అదానీకి సవాలు చేసింది. ఈ సవాలుపై కొద్ది రోజులు అదానీ, సెబి, కేంద్ర ప్రభుత్వమనే త్రిమూర్తులు మౌనం పాటించారు. అయితే అదానీ షేర్లు భారీగా పడిపోవడంతో, 88 ప్రశ్నల్లో 65 ప్రశ్నలకు మాత్రమే అదానీ సంస్థ అరకొర జవాబులు ఇచ్చి కీలకమైన వాటిని వదిలేశారు. అంతే కాకుండా అమెరికా సంస్థ తనపై చేసిన విమర్శలు దేశంపై దాడిగా అదానీ ప్రకటించుకున్నారు (సహవాస లక్షణాలు ఎక్కడికిపోతాయి?). ఈ అక్రమాలను సెబి ఛైర్‌పర్సన్ మాధబి పురి బచ్ ఉద్దేశ్యపూర్వకంగానే సక్రమంగా విచారణ చేయలేదని హిండెన్‌బర్గ్ విమర్శించింది. దీనిపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణ జరిపి అదానీ గ్రూపు అక్రమాలకు పాల్పడినట్లుగా ఆధారాలు లేవని, సెబి ఛైర్‌పర్సన్ తన విధులు సక్రమంగా నిర్వహించారని 2023 నవంబర్ 24న తీర్పు చెప్పింది. అయితే హిండెన్ బర్గ్ మాత్రం తన విమర్శలను కొనసాగిస్తూ, అదానీ గ్రూపును కాపాడడంతోపాటు, అదానీ సోదరుడు వినోద్ అదానీ పెట్టిన డొల్ల (నకిలీ) కంపెనీల్లో సెబి ఛైర్‌పర్సన్, ఆమె భర్త పెద్ద ఎత్తున లాభపడ్డారని మరోసారి తాజాగా ఆధారాలను బయటపెట్టింది.

హిండెన్‌బర్గ్ అంటే ఏమిటి ?

ఈ సంస్థను అమెరికా లోని న్యూయార్క్‌లో 2017లో నాథన్ ఆండర్సన్ అనే వ్యక్తి స్థాపించారు. ఇది షేర్ మార్కెట్‌లోని అవకతవకలను గుర్తించే ఫోరెన్సిక్ ఫైనాన్షియల్ రీసెర్చ్ సంస్థ. లెక్కల్లో జరిగే మోసాలు, చట్టవిరుద్ధమైన, అనైతిక వ్యాపార కార్యకలాపాలను సాక్ష్యాలతో బయట పెడుతుంది. దీనివల్ల ఏ కంపెనీల్లో షేర్లు పెట్టవచ్చో వాటాదారులకు విశ్వసనీయతను కల్పిస్తుంది. అయితే ఇదేదో ప్రజాసేవ చేసేందుకు ఏర్పడిందనుకుంటే పొరపాటు. ఇది కూడా పెట్టుబడి సంస్థే. పెట్టుబడి అంటేనే దాని పక్కన లాభం వుండాలి. తమ సేవలు వినియోగించుకున్నందుకు వాటాదార్ల నుండి, కంపెనీలకు విశ్వసనీయత కల్పిస్తున్నందుకు కంపెనీల నుండి లాభాలు పొందుతుంది. ఇది లాభాల కోసం నడిచే సంస్థ కాబట్టి దీన్ని ఎంతమేరకు విశ్వసించవచ్చనే అనుమానాలు వున్నాయి. అయితే ఇప్పటి వరకు ఈ సంస్థ తాను చేస్తున్న విమర్శలకు చూపుతున్న ఆధారాలు సక్రమమైనవే కావడంతో ప్రస్తుతానికి ప్రపంచ మార్కెట్ల విశ్వాసాన్ని పొందుతుంది.

సెబి ఛైర్‌పర్సన్‌పై ఆరోపణలు

'సమ్‌థింగ్ బిగ్ సూన్ ఇండియా' అంటూ భారత స్టాక్ మార్కెట్ వాటాదారుల్లో సంచలనం రేపిన హిండెన్‌బర్గ్ తాజాగా 'సెబి' ఛైర్‌పర్సన్, ఆమె భర్తపై తీవ్రమైన ఆరోపణలు చేసింది. అదానీ గ్రూప్ షేర్లకు లేని విలువ కల్పించేందుకు కారణమైన మారిషస్ ఆఫ్‌షోర్ ఫండ్స్‌లో మాధబి, ఆమె భర్త ధావల్ బచ్ లకు వాటాలు ఉన్నాయని హిండెన్‌బర్గ్ ఆధారాలతో బయటపెట్టింది. అదానీ సోదరుడు వినోద్ అదానీ 'అనిల్ అహుజా' కంపెనీని స్థాపించి, గ్లోబల్ డైనమిక్ ఆపర్చునిటీస్ ఫండ్‌లో పెట్టుబడులు పెట్టినట్లు, ఆ కంపెనీ మారిషస్ లోని డొల్ల (నకిలీ) కంపెనీ ఐపిఇ ప్లస్ ఫండ్-1 పెట్టుబడులు పెట్టినట్లు విమర్శ చేసింది. ఇందులో సెబి అధిపతి మాధబి బచ్ ప్రమేయం ఉండడమే కాక, ఆమె భర్త ధావల్ బచ్‌లు వాటాదారులుగా ఉన్నారని సాక్ష్యాలను వెల్లడించింది. చట్టబద్ధ సంస్థకు చీఫ్‌గా ఉంటూ పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందారని, అదానీ ఆర్థిక వ్యవహారాల్లో వీరు వాటాదారులు కాబట్టే గత సంవత్సరం తమ సంస్థ అదానీపై చేసిన ఆరోపణలను సరిగా విచారించకుండా క్లీన్ చిట్ ఇచ్చారని తీవ్రంగా విమర్శించింది. సెబి ఛైర్‌పర్సన్ కాకముందు 2009 నుండి 2011 వరకు ఆమె ఐ.సి.ఐ.సి.ఐ సెక్యూరిటీస్‌లో సిఈఓ గా పనిచేశారు. ఛైర్‌పర్సన్ అయిన తర్వాత కూడా ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంక్ నుండి వేతనం పొందారని, ఆమె విచారణ చేస్తున్న కంపెనీల నుండి ఆమె భర్త ధావల్ బచ్ ఆదాయాలు పొందారని విమర్శలు వున్నాయి. మహీంద్రా గ్రూప్ నుంచి బచ్ రూ.4.78 కోట్లు, డాక్టర్ రెడ్డీస్ నుండి రూ.6.58 కోట్లు, అలాగే పి.డి లైట్ నుండి ఇలాంటి ఆదాయాలు పొందారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

మాధబి పురి బచ్ 2017 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకు సెబి పూర్తికాల సభ్యురాలిగా పనిచేశారు. 2022 మార్చి 1న సెబి ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ బాధ్యతలు చేపట్టిన మొదటి మహిళ ఈమె. అంతేకాక ప్రైవేట్ రంగానికి చెందిన వ్యక్తి ఈ పదవిలోకి రావడం కూడా ఇదే మొదటిసారి. అంతకు ముందు ఆమె అనేక దేశీయ, విదేశీయ సంస్థల్లో పనిచేశారు. తన సర్వీసు మొత్తం ప్రైవేట్ కంపెనీలలో చేసి అనేక విమర్శలకు గురైన వ్యక్తిని ఛైర్‌పర్సన్ స్థానంలో నియమించడంలో అదానీ, మరికొన్ని కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలు వున్నాయనే విమర్శలు వున్నాయి. 'సెబి' ఛైర్మన్‌ను ప్రధాని నేతృత్వంలోని అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ క్యాబినెట్ నియమిస్తుంది. ఇందులో మోడీతో పాటు ఆయన సహచరుడు కేంద్ర హోంమంత్రి అమిత్ షా వుంటారు. వీరిరువురికి తమ స్వరాష్ట్రానికి చెందిన అదానీతో వున్న భవబంధాల గురించి చెప్పాల్సిన పనిలేదు. మోడీ అండ వుంటే తప్పులెన్ని చేస్తేనేం అన్నట్లు బచ్ దంపతులు రెచ్చిపోయారు.

ఇంతింతై వటుడింతై అన్నట్లుగా గత పది సంవత్సరాల క్రితం ఒక వ్యాపారిగా, సాధారణ పెట్టుబడిదారుడుగా వున్న గౌతమ్ అదానీ మోడీ పాలనా కాలంలో దేశంలోనే కాదు, ప్రపంచంలోనే అత్యంత సంపన్న పెట్టుబడిదారుల్లో ఒకరుగా అవతరించాడు. వడ్డించేవాడు మనవాడైతే ఎక్కడ కూర్చుంటే ఏమిటి అన్నట్లు గుజరాత్ నుండి దేశ పాలకుడిగా ఎదిగిన మోడీ, అదే రాష్ట్రానికి చెందిన తన హితుడైన గౌతమ్ అదానీని ప్రపంచ కుబేరుల సరసన కూర్చోబెట్టడమే కాదు. రానున్న కొద్ది సంవత్సరాల్లో ఆ జాబితాలో మొదటి లేదా రెండో స్థానానికి చేర్చాలని చూస్తున్నారు. దేశంలో పెరుగుతున్న అనేమంది శతకోటీశ్వరులు గతంలో పెట్టుబడిదారులుగా పరిశ్రమలు పెట్టి ఉత్పత్తి చేసి లాభపడుతున్నవారు కాదు. ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల వల్ల అందివచ్చిన అక్రమ, అవినీతీకరణ పద్ధతుల్లో కృత్రిమ సంపన్నులుగా మారడం, దొరకనంతవరకు స్వదేశీ దొరగా, దొరికిన తర్వాత విదేశాల్లో దొరగా బతకనేర్చిన పెట్టుబడిదారులు. వీరు చేసే అక్రమాలు బయటకు రాకుండా చూడడానికి అన్ని రాజ్యాంగబద్ధ సంస్థలు మోడీ పాలనలో పెద్దఎత్తున దుర్వినియోగం అవుతున్నాయి. ఆ జాబితాలో తాజాగా చేరింది సెబి.

ఉపాధి రహిత అభివృద్ధి వల్ల నిరుద్యోగం పెరిగి పోతున్నదని అనేక నివేదికలు ఆధారాలతో సహా బయట పెడుతున్నాయి. అయినప్పటికీ...కాదు, కాదు...దేశ ఆర్థిక వ్యవస్థ వెలిగిపోతున్నదని ఇలాంటి అక్రమ వ్యాపారులను, ఉన్నతోద్యోగుల ఆదాయాలను గొప్పగా చూపసాగారు కేంద్ర బిజెపి పాలకులు. కానీ వాస్తవాలను ఎక్కువ కాలం ఎవరూ దాచలేరు. అక్రమాలను, అవినీతిని ప్రజలు ప్రశ్నించక మానరు. అందుకు అవసరమైన చైతన్యవంతమైన ఉద్యమాలు రాకమానవు.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

సమస్య

ఆహార ధాన్యాల ఎగుమతి-పోషకాహార లోప మరణాలు

ఎ. కోటిరెడ్డి



దేశంలోని ప్రజలందరికీ తిండి పెట్టటానికి, బాలల్లో పోషకాహార లోపాన్ని నివారించటానికి, తద్వారా లక్షలాది బాలల మరణాలను నివారించటానికి అవసరమైన ఆహారధాన్యాలు దేశంలో ఉత్పత్తి అవుతున్నాయి. కాని బాలలు, ప్రజల ఆకలిని తీర్చటం, రక్తహీనతను, మరణాలను నివారించటం ప్రభుత్వ ప్రాధాన్యతలలో లేదు. అందువలనే దారిద్ర్యంలో ఉండి అవసరమైన ఆహారం కొనలేని వారిని బహిరంగ మార్కెట్‌కు వదిలేసి, ఎథనాల్ ఉత్పత్తికి కిలో 20 రూపాయలకు బియ్యాన్ని కేటాయించింది. కోట్ల టన్నుల ఆహారధాన్యాలను విదేశాలకు ఎగుమతి చేస్తున్నది.

నేటి బాలలే రేపటి పౌరులు. బాలల ఆహారం, ఆరోగ్యం, విద్య, మానసిక వికాసానికి తగిన చర్యలు తీసుకోకపోతే ఆ దేశం అభివృద్ధిలో అట్టడుగు స్థాయికి దిగజారుతుంది. ప్రస్తుతం మన దేశంలోని బాలలు అత్యంత దయనీయమైన స్థితిలో ఉన్నారు. దేశంలో 2021లో ఐదు సంవత్సరాల కన్నా తక్కువ వయసున్న 7 లక్షల మంది బాలలు చనిపోయారు. వీరిలో 5 లక్షల మంది (70 శాతంకు పైగా) పోషకాహార లోపంతో చనిపోయారని అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. తల్లి ఎదుర్కొంటున్న పోషకాహార లోపం పిల్లల మరణాలకు కూడా కారణమౌతున్నది. ఇదేకాలంలో ప్రపంచ వ్యాపితంగా 47 లక్షల మంది పిల్లలు మరణించారు. వీరిలో 24 లక్షల (50 శాతంకు పైగా) మంది మరణాలకు తల్లి, పిల్లలకు పోషకాహారం అందకపోవటమే కారణం. పోషకాహార లోపం వలన ప్రపంచంలోని ఇతర దేశాలలో మరణిస్తున్న బాలల కన్నా భారతదేశంలోని బాలలు 25 శాతం అదనంగా చనిపోతున్నారు. ధనిక దేశాలలో కన్నా పేద దేశాలలో బాలల మరణాలు 20 నుండి 50 రెట్లు ఎక్కువగా ఉంటున్నాయి.

తల్లి, పిల్లలకు ఎదురౌతున్న పోషకాహార లోపాన్ని నివారించటం అసాధ్యమేమీ కాదు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొంటే ఈ సమస్యను పూర్తిగా నిర్మూలించవచ్చు. మన దేశంలో ఉత్పత్తి అవుతున్న ఆహార ధాన్యాలతో దేశంలోని ప్రజలందరి ఆకలిని తీర్చవచ్చు. పోషకాహార లోపాన్ని కూడా నివారించవచ్చు. కాని ప్రభుత్వం ఆ దృక్పథంతో పనిచేయటం లేదు. మన దేశంలోని రైతులు పండించిన ఆహారధాన్యాలను విదేశాలకు ఎగుమతులు చేయటం, పెట్రోలులో ఎథనాల్‌ను కలపటం ద్వారా ఆయిల్ దిగుమతుల బిల్లును తగ్గించుకోవటం కోసం ఎథనాల్ ఉత్పత్తికి కేటాయిస్తున్నది. దేశంలోని పేదలు, అన్నార్తుల ఆకలిని, బాలలలో పోషకాహార లోపాన్ని నివారించటానికి మాత్రం వినియోగించటం లేదు.

ఎథనాల్ ఉత్పత్తికి ఆహారధాన్యాల కేటాయింపు

ఎథనాల్ ఉత్పత్తి కోసం 23 లక్షల టన్నుల ఆహారధాన్యాలను కేటాయిస్తూ ఆగస్టు 28వ తేదీన కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను జారి చేసింది. దీనితో ఎథనాల్ ఉత్పత్తికి ఆహారధాన్యాలను వినియోగించటంపై 2023 జులైలో విధించిన నిషేధాన్ని ప్రభుత్వం తొలగించింది. కేటాయించిన ఆహారధాన్యాలను ఆగస్టు-అక్టోబరు నెలల మధ్య వారం వారం జరిగే ఈ వేలంలో ఎథనాల్ ఉత్పత్తిదారులు కొనుగోలు చేయవచ్చు. 2023లో బాస్మతి యేతర బియ్యం ఎగుమతితో పాటు, ఆహారధాన్యాలతో ఎథనాల్ ఉత్పత్తిని కూడా ప్రభుత్వం నిషేధించింది.

ఈ మధ్య ప్రభుత్వం విడుదల చేసిన లెక్కల ప్రకారం ఎఫ్‌సిఐ దగ్గర 8.13 కోట్ల టన్నుల ఆహారధాన్యాల నిల్వలున్నాయి. వీటిలో బియ్యం 5.04 కోట్ల టన్నులు. గత సంవత్సరం జూన్‌లో 4.14 కోట్ల టన్నుల బియ్యం మాత్రమే ఉన్నాయి. అప్పటి కన్నా ఇపుడు 21.8 శాతం ఎక్కువ నిల్వ ఉన్నాయి. ఈ సంవత్సరం జూన్‌లో గోధుమ నిల్వలు 2,99 కోట్ల టన్నులు ఉన్నాయి. గత సంవత్సరం ఇదే సమయంలో 3.13 కోట్ల టన్నులు ఉన్నాయి. గత సంవత్సరం కన్నా ఇపుడు 4.7 శాతం తక్కువ నిల్వలు ఉన్నాయి. గోధుమ, బియ్యం, ఇతర ముతక ధాన్యాలు కలిపి ఈ సంవత్సరం జూన్ 1వ తేది నాటికి ఎఫ్‌సిఐ వద్ద 9 కోట్ల టన్నుల వరకు నిల్వ ఉన్నాయి. గత సంవత్సరం అదే కాలంలో ఉన్న నిల్వల కన్నా ఇపుడు 10 శాతంకు పైగా అధికంగా ఉన్నాయి.

ప్రస్తుత సంవత్సరం వేసిన పంట అక్టోబరు చివరి నుండి మార్కెట్‌లోకి రావటం ప్రారంభమౌతుంది. వచ్చే పంటకు గోడౌన్ల సదుపాయం కల్పించటానికి ప్రస్తుత నిల్వలు ఆటంకంగా ఉన్నాయి. అందువలన ఈ నిల్వలను ఖాళీ చేయటం కోసం ఇథనాల్ ఉత్పత్తికి తిరిగి కేటాయింపులు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నది.

ఎథనాల్ ఉత్పత్తికి కేటాయిస్తున్న బియ్యానికి క్వింటాలుకు 2,000 రూపాయల ధరను ప్రభుత్వం నిర్ణయించింది. బహిరంగ మార్కెట్‌లో బియ్యం అమ్మకం పథకానికి (ఓ.ఎం.ఎస్.ఎస్) నిర్ణయించిన ధర క్వింటాలుకు 3,100 రూపాయల కన్నా తక్కువ ధరకు ఎథనాల్ ఉత్పత్తికి బియ్యాన్ని ఇస్తున్నది.

2023లో పెట్రోలులో 11 శాతం ఎథనాల్‌ను కలిపామని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు చెబుతున్నాయి. మొక్కజొన్న, బియ్యం, పాడైపోయిన ఆహారధాన్యాలను ఎథనాల్ ఉత్పత్తికి కేటాయించాలని అవి ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. సాధారణంగా అయితే పంచదార ఉత్పత్తిలో ఉప ఉత్పత్తిగా వచ్చే మొలాసిస్ నుండి ఎథనాల్‌ను ఉత్పత్తి చేస్తారు. కాని 2025 నాటికి పెట్రోలులో 20 శాతం ఎథనాల్ కలపాలన్న లక్ష్యం చేరటానికి మొలాసిస్ నుండి వచ్చే ఎథనాల్ మాత్రమే సరిపోదు.

2022-23 సంవత్సరంలో 1.77 కోట్ల టన్నుల బాస్మతియేతర రకాల బియ్యాన్ని ఎగుమతి చేశారు. గత దశాబ్దంలో ప్రపంచంలో బియ్యం ఎగుమతిలో భారతదేశం అగ్ర స్థానంలో ఉన్నది. ప్రపంచ బియ్యం ఎగుమతుల్లో భారతదేశం వాటా 40 శాతంగా ఉన్నది. వీటిలో బాస్మతి యేతర బియ్యం 80 శాతంగా ఉన్నాయి. మన బియ్యం ఎగుమతులకు బంగ్లాదేశ్, చైనా, నేపాల్, ఇరాన్, కొన్ని ఆఫ్రికా దేశాలు ప్రధాన మార్కెట్‌గా ఉన్నాయి.

దారిద్ర్యంపై ప్రభుత్వ అబద్ధాలు

దేశంలో 2024లో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు 4.5-5 శాతంగా ఉన్నారని ప్రభుత్వం చెబుతున్నది. కాని ప్రభుత్వం చెబుతున్న లెక్కలను ఎవరూ విశ్వసించటం లేదు. తలకు రోజుకు 2.15 డాలర్ల (180 రూపాయలు) కన్నా తక్కువ ఆదాయం వచ్చేవారు దారిద్ర్యరేఖకు దిగువనున్న వారని 2022లో ప్రపంచ బ్యాంకు ప్రకటించింది. ఆ లెక్క ప్రకారం ఒక వ్యక్తికి రోజుకు 180 రూపాయలంటే నెలకు 5400 రూపాయల ఆదాయం రావాలి. నలుగురు సభ్యులున్న కుటుంబానికి నెలకు 21,600 రూపాయలు రావాలి. మరి 80 శాతం మంది 10,000 రూపాయలు, అంతకన్నా తక్కువ ఆదాయం మాత్రమే పొందుతుంటే, దారిద్ర్యం 5 శాతానికి తగ్గిందని చెప్పి బిజెపి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నది. ప్రపంచబ్యాంకు లెక్కల ప్రకారం దేశ ప్రజానీకంలో 80 శాతం తమకు అవసరమైన మేరకు ఆహార ధాన్యాలను కొనగలిగిన స్థితిలో లేరని ఈ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. కాబట్టే బాలల నుండి వృద్ధుల వరకు నివారించదగిన అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.

ప్రపంచ ఆకలి సూచీ ప్రకారం మన దేశంలో ఎత్తుకు తగిన బరువు లేని బాలలు 18.7 శాతం ఉన్నారు. ఇది ప్రపంచంలోని ఏ దేశంలో కన్నా అత్యధికం. వయసుకు తగిన ఎత్తులేని బాలలు 35.5 శాతం ఉన్నారు. ఇందులో మన దేశం ప్రపంచంలో 15వ స్థానంలో ఉన్నది. అవసరమైనంత ఆహారం తీసుకోలేని వారు 16.6 శాతం ఉన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న మహిళల శాతం 2015-16లో 54.2 శాతం ఉండగా, 2019-2021 నాటికి 58.9 శాతానికి పెరిగింది. పురుషులలో 25 శాతం, యుక్త వయసుకు వస్తున్న బాలబాలికలలో 39 శాతం రక్తహీనత ఉన్నది. ఆందోళనకరమైన ఈ వివరాలను పరిశీలిస్తే పోషకాహార లోపంతో బాలలు చనిపోవటం, వయసుకు తగిన ఎత్తు, ఎత్తుకు తగిన బరువు లేకపోవటం, యువతీ యువకులు, మహిళలు, పురుషులలో రక్తహీనత, ఇతర అనారోగ్యాలకు ప్రభుత్వ విధానాలే కారణమని స్పష్టమౌతున్నది. దేశంలోని ప్రజలందరికీ తిండి పెట్టటానికి, బాలల్లో పోషకాహార లోపాన్ని నివారించటానికి, తద్వారా లక్షలాది బాలల మరణాలను నివారించటానికి అవసరమైన ఆహారధాన్యాలు దేశంలో ఉత్పత్తి అవుతున్నాయి. కాని బాలలు, ప్రజల ఆకలిని తీర్చటం, రక్తహీనతను, మరణాలను నివారించటం ప్రభుత్వ ప్రాధాన్యతలలో లేదు. అందువలననే దారిద్ర్యంలో ఉండి అవసరమైన ఆహారం కొనలేని వారిని బహిరంగ మార్కెట్‌కు వదిలేసి, ఎథనాల్ ఉత్పత్తికి కిలో 20 రూపాయలకు బియ్యాన్ని కేటాయించింది. కోట్ల టన్నుల ఆహారధాన్యాలను విదేశాలకు ఎగుమతి చేస్తున్నది.

పోషకాహారం అందని బాలలు, రక్తహీనతతో ఉన్న మహిళలు, వయసుకు తగిన ఎత్తు, ఎత్తుకు తగిన బరువు లేని వారిని గుర్తించటం ఏ మాత్రం కష్టం కాదు. ప్రభుత్వం పూనుకుంటే దేశంలో మూలమూలల ఉన్నవారి సమాచారాన్ని వారం రోజులలో సేకరించగలదు. ఆ సమాచారంతో అవసరమైన వారందరికీ ఆహారాన్ని అందించవచ్చు. లక్షల కోట్ల రూపాయలను అప్పనంగా కార్పొరేట్లకు కట్టబెడుతున్న ప్రభుత్వానికి ఇది పెద్ద ఆర్థికభారం కూడా కాదు. ఆ విధంగా చేస్తే బాలల మరణాలను నివారించవచ్చు. మహిళలు, పురుషులు, యుక్త వయస్కులలో రక్తహీనతను, ఎత్తుకు తగిన బరువు, వయసుకు తగిన ఎత్తు లేకపోవటాన్ని నివారించవచ్చు. కాని ప్రజల మరణాలను, అనారోగ్యాన్ని నివారించటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటే పెట్టుబడి దారులకు లాభాలు రావు. ఆహార ధాన్యాలను ఎగుమతి చేయటం, ఎథనాల్ ఉత్పత్తికి వినియోగించడం వల్ల పెట్టుబడిదారులకు లాభాలు వస్తాయి. ప్రభుత్వానికి విదేశీ మారక ద్రవ్యం వస్తుంది. సరళీకరణ విధానాలతో పెట్టుబడిదారులకు లాభాలను కట్టబెట్టటమే లక్ష్యంగా పనిచేస్తున్న మోడీ ప్రభుత్వం బాలల మరణాలకు బాధ్యత వహించాలి. ★

జనవాక్యం

తెలివైన ఎత్తుగడ

ఆప్ అధినేత కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రిగా రాజీనామా చేసి, సహచర మంత్రి ఆతిషి ని ఆ పీఠంపై తాత్కాలికంగా కూర్చోబెట్టడం ఉన్నంతలో తెలివైన ఎత్తుగడ. మద్యం పాలసీ వ్యవహారంలో ఈడీ, సీబీఐ కేసుల నేపథ్యంలో ఆరు మాసాలు జైల్లో ఉన్నారు. సుప్రీం కోర్టు బెయిల్‌పై బయటకు వచ్చారు. కేసు నమోదు అయినప్పుడు గానీ, జైలులో ఉన్నప్పుడుగానీ ముఖ్యమంత్రి పీఠం వదులుకొని, ప్రజాభిమానం పొందేవరకు ఇటు చూడనని అనలేదు. బెయిల్ వచ్చాక మాత్రమే ఆ అగ్నిపరీక్షకు సిద్ధమయ్యారు. ఇప్పుడు ఆయన ముందున్న ఆప్షన్లలో ఇదే మెరుగు. ఎందుకంటే ముఖ్యమంత్రిగా కొనసాగినా సుప్రీం ఆదేశాలు ఆయన అధికారాలకు కత్తెర వేశాయి. ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లరాదని, ఫైళ్లు కదపరాదని సవాలక్ష ఆంక్షలు. ఒకవైపు లెఫ్టినెంట్ గవర్నర్, రెండో వైపు ఆంక్షల పరిధుల్లో ఆయన చేయగలిగేది తక్కువ. వచ్చే ఎన్నికల్లో చెప్పుకోగలిగేది తక్కువ. పోనీ అసెంబ్లీ రద్దు చేసి ఎన్నికలకు వెళ్దామంటే అది ఆయన చేతుల్లో లేదు. రద్దు మాత్రం చెయ్యగలడు గానీ ఎన్నికలకు అనుకున్న టైమ్‌లో వెళ్లగలగడం లెఫ్టినెంట్ గవర్నర్ ఇష్టం మీద ఉంటుంది. ఆపై ఎన్నికల కమిషన్ ఇష్టంలో ఉంటుంది. కాబట్టి రాజీనామా చేసి తన భవిష్యత్తును ప్రజల చేతిలో పెట్టారు. కాబట్టి ఆయన్ని అన్యాయంగా బలిపశువు చేశారన్న ఉద్వేగం, ఆయన పదవీ త్యాగం ఎన్నికల వరకూ కొనసాగే వీలుంటుంది. ఈ లోగా ఢిల్లీ ప్రభుత్వ వైఫల్యాలు ఆయన ఖాతాలో పడవు. అదో లాభం. పాచిక పారుతుందో లేదో అప్పుడే చెప్పలేం. మళ్ళీ ఎన్నికల వేళకి ఆప్ కి మెజారిటీ వచ్చి, అంతవరకూ ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తికి పార్టీ విధేయత తప్ప, స్వంత ఎజెండాలు తయారవక పోతే కేజ్రీవాల్ వ్యూహం నెరవేరినట్టే. లేకపోతే ఒక మంచి ఎత్తుగడతో విఫలయత్నం చేసినట్టే.

- డా.డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ, విజయనగరం.

26 నుంచి దసరా సాంస్కృతికోత్సవాలు

- మూడు రోజుల పాటు నిర్వహణ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ (విజయవాడ అర్బన్)

సమాజంలో నెలకొన్న సామాజిక సమస్యల గురించి ఎలుగెత్తుతూ, వాటిని రూపుమాపేలా 'చెడును దునుమాడుదాం - మంచిని పెంచుదాం' అనే నినాదంతో ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు దసరా సాంస్కృతికోత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వహణా కమిటీ సభ్యులు కె స్వరూపారాణి, జి జ్యోత్స్న, టి విజయలక్ష్మి తెలిపారు. నగరంలోని బాలోత్సవ్ భవన్‌లో దసరా ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ని మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎంబివికె, సేఫ్, తరుణీ తరంగాలు, సుహాప్తి ఆర్గనైజేషన్, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జన శిక్షణ సంస్థాన్ తదితర సంస్థలు సంయుక్తంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో 26, 27 తేదీల్లో శాస్త్రీయ జానపద నృత్యాలు, అభ్యుదయ దేశభక్తి గీతాలు, లఘు నాటికలు, స్పాట్ స్కిట్స్, వక్తృత్వ పోటీలు, వీధి నాటకాలు, వాద ప్రతివాదాలు, 28న మొగల్‌రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో కోలాటాలు, ఫ్లాష్‌మాబ్ ఉంటాయన్నారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న వరకట్నం, అత్యాచారాలు, అక్రమ రవాణా, అవినీతి వంటి వాటికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచేందుకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. అలాగే కళారూపాలు ప్రదర్శి ంచబడతాయన్నారు. ఇందులో స్కూలు, కళాశాల విద్యార్థులు, యువతీ యువకులు, స్త్రీ పురుషులు వయసుతో నిమిత్తం లేకుండా పాల్గొనవచ్చని, పోటీలు ఇంగ్లీషు, తెలుగు రెండింటిలోను ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో నిర్వహణా కమిటీ సభ్యులు పి.వాణి, కె.సత్యవతి, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వహణా కమిటీ సభ్యులు కె స్వరూపారాణి, జి జ్యోత్స్న, టి విజయలక్ష్మి

దువ్వాడ పిటిషన్ విచారణ వాయిదా

ప్రజాశక్తి, అమరావతి

తన భార్య వాణి, పెద్ద కుమార్తె హైందవిపై తాను చేసిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదంటూ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వేసిన పిటిషన్ పై విచారణ రెండు వారాలకు వాయిదా పడింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బివిఎల్ చక్రవర్తి ఉత్తర్వులు జారీ చేశారు. టెక్కలి సీఐ, ఎస్ఐలపై విచారణ జరిపి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకునేలా ఎస్పీని ఆదేశించాలని శ్రీనివాస్ న్యాయవాది కోర్టును కోరారు. తాము కౌంటర్ పిటీషన్ ఈరోజే దాఖలు చేసినందున విచారణను వాయిదా వేయాలని పోలీసుల తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరారు. దీంతో విచారణ రెండు వారాలకు వాయిదా పడింది.

వికలాంగులకు చెత్తబండిలో భోజనాలు

ప్రజాశక్తి-హోళగుంద

కర్నూలు జిల్లా హోళగుంద ఎంపిడిఒ కార్యాలయం వద్ద నీతి ఆయోగ్ ఎఐడిపి స్కీమ్‌లో భాగంగా ట్రైసైకిళ్లు వినికిడి పరికరాలతో పాటు వీల్‌ఛైర్ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం అధికారులు చేపట్టారు. మండలంలోని అన్ని గ్రామాల నుండి 105 మంది వికలాంగులు, వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వికలాంగుల కోసం ప్రత్యేకంగా భోజన సదుపాయం కల్పించాల్సిన అధికారులు వారిపై చిన్న చూపు చూశారు. చెత్త తరలించే వాహనంలో వికలాంగుల కోసం ఏర్పాటు చేసిన భోజనాల ప్యాకెట్లు తీసుకువచ్చారు. చెత్త బండి నుండి కంపు కొడుతుండడంతో వికలాంగులు విధిలేని పరిస్థితిలో ముక్కు మూసుకొని భోజనాల ప్యాకెట్లు తీసుకున్నారు. వికలాంగుల పట్ల అధికారులు వ్యవహరించిన తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎంపిడిఒ సువాసినమ్మను వివరణ కోరగా చెత్త బండిలో తెచ్చినట్లు ఇప్పుడే తెలిసిందని, మరోసారి ఇలాంటి తప్పు జరగకుండా చూస్తానని తెలిపారు.

శ్రీవారి యాత్రికులకు నాణ్యమైన భోజనం : ఇఒ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే యాత్రికుల ఆరోగ్య భద్రతకు టిటిడి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని, అందుకే తిరుమలలోని హోటళ్ల వ్యాపారులకు ఆహార భద్రత విభాగంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఇఒ జె శ్యామలరావు తెలిపారు. ఆస్థాన మండపంలో టిటిడి ఆరోగ్య, ఎస్టేట్స్ విభాగాలు ఆహార భద్రత విభాగంతో కలసి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఇఒ మాట్లాడారు. తినుబండారాల దుకాణాలు, ముఖ్యంగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఆహార భద్రతా చట్టాలను పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. బుధవారం పౌర్ణమి గరుడసేవ జరగనుంది. రాత్రి 7 నుండి రాత్రి 9 గంటల నడుమ గరుడిపై తిరుమాఢ వీధులలో శ్రీవారిని ఊరేగించనున్నారు.

ఇసుక ఇక్కట్లు తీరేనా..?

- అస్తవ్యస్తంగా నిర్మాణ రంగం
- పస్తులతో నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గత ప్రభుత్వం చేసిన తప్పులను మేము చేయబోమని ఇసుక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఉచిత ఇసుకను అందిస్తామని కూటమి సర్కారు ప్రకటించింది. గోదావరి వరదల నేపథ్యంలో రీచ్‌లలో నిల్వ ఉన్న స్టాకులను ఈ ఏడాది జులై 8 నుంచి ఇసుకను ఉచితంగా సరఫరా చేశామని చెప్పుకొచ్చింది. అయితే స్టాక్ పాయింట్లలో ఇసుక కొద్ది రోజులకే నిండుకుంది. అధికార పార్టీకి చెందిన కొందరు రాజకీయ నాయకులు ఇసుక నిల్వలను అక్రమంగా తరలించుకుపోవడంతో ఆదిలోనే కొరత ఏర్పడింది. దీంతో గత నెల రోజులుగా ఇసుక సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో ఉచిత ఇసుక విధానంలో భాగంగా వినియోగదారులు నేరుగా బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని కలెక్టర్ ప్రకటించారు. ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయాన్ని ఈ నెల 19 నుంచి అందుబాటులోకి తెచ్చేందుకు గనులశాఖ, రవాణా శాఖ సంయుక్తంగా ఏర్పాట్లు చేస్తున్నాయని ప్రకటించారు. అయితే గోదావరి వరదలు తగ్గుముఖం పట్టని నేపథ్యంలో ఇసుక ఎప్పుడు అందుబాటులోకి వస్తుందనేది అధికారులకు సైతం నేటికీ స్పష్టత లేదు. దీంతో ఇసుక మరికొన్ని రోజుల వరకూ దొరికే అవకాశం కనిపించడం లేదు.

53 రకాల నిర్మాణ కార్మికులు ఎదురు చూపులు

కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో సుమారు 5 లక్షల మంది కార్మికులు నిర్మాణ రంగంపై ఆధారపడి ఉన్నారు. ఇందులో తాపీ మేస్త్రీలు, నిర్మాణ కూలీలు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబింగ్ వర్కర్లు, పెయింటర్లు, ఇసుక ఎగుమతి, దిగుమతి కూలీలు, ఇటుక బట్టీల యజమానులు, అందులో పని చేసే కూలీలు, సిమెంట్ పరిశ్రమలు, దానిపై ఆధారపడిన వర్కర్లు, ఐరెన్ పనులు చేసే కూలీలు, భవన నిర్మాణ కాంట్రాక్టర్లు, టైల్స్ మేస్త్రీలు, కార్పెంటర్లు వీళ్లకు సహాయకులు వేల మంది ఉన్నారు. ఇలా 53 విభాగాలకు చెందిన కార్మికులు నిర్మాణ రంగంపై ఆధారపడి ఉపాధిని పొందుతున్నారు. అయితే కొంతకాలంగా వీరంతా పూర్తిగా పస్తులతో కాలం వెళ్ళదీస్తున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇసుక విధానంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దీంతో నిర్మాణ రంగ కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. గత వైసిపి పాలనలో ఇసుక నూతన పాలసీ వలన ఏడాదిపాటు తీవ్ర అవస్థలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆ తర్వాత కరోనా మహమ్మారి ప్రపంచమంతా విస్తరించడంతో అన్ని వ్యవస్థలు స్తంభించాయి. దీనిలో భాగంగా నిర్మాణరంగం సైతం కుదేలైంది. ఈ నేపథ్యంలో గత వైసిపి పాలనలో దాదాపు మూడేళ్లపాటు ఇసుక కొరత తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ఆ తర్వాత అందుబాటులోకి వచ్చినప్పటికీ మధ్య దళారీ వ్యవస్థ వలన అరకొర ఇసుక మాత్రమే దొరికేది. మరోవైపు జోరుగా అక్రమ వ్యాపారం సాగేది. ఇసుక ఒక మాఫియా చేతుల్లోకి పోవడంతో అధిక ధరలకు విక్రయాలు జరిగేవి. ఇటు వినియోగదారులు అటు నిర్మాణరంగంపై ఆధారపడిన కార్మికులకు సమస్యలు తప్పలేదు. అయితే ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. దీంతో నిర్మాణ రంగ కార్మికులంతా ఆనందం వ్యక్తం చేశారు. కొరత లేకుండా ఇసుక అందుబాటులో ఉంటుందని భావించారు. అయితే కొద్ది రోజులు మాత్రమే ఇసుక అందుబాటులో ఉంది. నూతన విధానం ఇంకా అమలు కాకపోవడం, మరోవైపు వరదలు కారణంగా ఉచిత ఇసుక ఇంకా అందుబాటులోకి రాలేదు. ప్రస్తుతం వరదలు కొనసాగుతున్న తరుణంలో ఇసుక ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తుందనేది యంత్రాంగానికి సైతం ఇంకా పూర్తిస్థాయి స్పష్టత లేదు. ఈ పరిస్థితి మరో నెల రోజులు ఉండే అవకాశం కనిపిస్తోంది.

ఆన్‌లైన్ బుకింగ్‌కు ఏర్పాట్లు

ఇసుక దారి మళ్లకుండా, ఇతరులు అధిక ధరలకు విక్రయించకుండా నిఘా ఉంచి పటిష్టమైన చర్యలను ప్రభుత్వం చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నెల 19 నుంచి వినియోగదారులే నేరుగా బుక్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఇందుకోసం ఎపి శాండ్ మేనేజ్‌మెంట్ పోర్టల్ యాప్‌ను అధికారులు సిద్ధం చేశారు.

ఎసిబి వలలో కూడేరు ఎంఇఒ

ప్రజాశక్తి-అనంతపురం

ప్రయివేటు పాఠశాలకు సంబంధించిన అనుమతి కోసం లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు కూడేరు ఎంఇఒ పట్టుబడ్డారు. ఎసిబి అధికారుల వివరాల మేరకు... అనంతపురం జిల్లా కూడేరుకు చెందిన వెరీడైన్ఎకాల్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన ఓ అనుమతి కోసం ఎంఇఒ చంద్రశేఖర్‌ను పాఠశాల యాజమాన్యం కలిసింది. ఇందుకు గాను ఎంఇఒ రూ. రెండు లక్షల లంచం డిమాండ్ చేశారు. దీంతో పాఠశాల యాజమాన్యం ఎసిబి అధికారులను సంప్రదించింది. మంగళవారం పాఠశాలకు చెందిన సాగర్ అనే వ్యక్తికి రూ.రెండు లక్షల నగదు ఇచ్చి పంపారు. అతని నుంచి ఎంఇఒ డబ్బులు తీసుకుంటుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. ఎంఇఒను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎసిబి అధికారులు తెలిపారు.

యువకుడిని నగ్నంగా పరిగెత్తించి...
బెంగళూరులో రౌడీషీటర్ దారుణం

బెంగళూరు : బెంగళూరు నగరంలో దారుణం చోటుచేసుకుంది. ఓ యువకుడిని రౌడీ షీటర్ రోడ్డు మధ్యలో నిలబెట్టి బట్టలు ఊడదీయించాడు. అంతటితో ఆగక అతనిని నగ్నంగా వీధులలో పరిగెత్తించాడు. నెల రోజుల క్రితం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోమవారం వైరల్ అయింది. నిందితుడిని 28 సంవత్సరాల రౌడీ షీటర్ పవన్‌గా గుర్తించారు. రాజగోపాల్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండే పవన్‌పై వివిధ పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే అనేక కేసులు ఉన్నాయి. పవన్, అతని సన్నిహితుల మధ్య విభేదాలు రావడంతో వారిలో ఒకడు ఈ వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేశాడని పోలీసులు తెలిపారు. రౌడీ షీటర్ ఘాతుకంపై బాధితుడు పోలీసులను ఆశ్రయించలేదు. అయితే పోలీసులు తమంతతాముగా ఈ ఘటనపై విచారణ జరుపుతున్నారు. పవన్ కోసం, బాధితుడి కోసం గాలిస్తున్నారు. ఇదిలావుండగా పవన్ ఆదివారం రాత్రి విశ్వాస్ అనే వ్యక్తిపై దాడి చేశాడు. కామాక్షిపాల్య పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాసపురలో ఈ ఘటన జరిగింది. విశ్వాస్, అతని స్నేహితుడు తన గురించి పోలీసులకు సమాచారం ఇచ్చారన్న అనుమానంతో పవన్ ఈ దాడికి పాల్పడ్డాడని పోలీస్ డిప్యూటీ కమిషనర్ (వెస్ట్) గిరీష్ తెలిపారు. పవన్ ఓ ఆయుధంతో దాడి చేయగా విశ్వాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ దాడికి సంబంధించి విశ్వాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ కొనసాగుతోంది.

ఆస్తులు ప్రకటించారు... కానీ డిక్లరేషన్లు లేవు

- 'స్వచ్ఛందం' అనే వెసులుబాటే కారణం
- 33 మంది జడ్జిలలో సమాచారం ఇచ్చింది 27 మందే

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టులో ప్రస్తుతం 33 మంది న్యాయమూర్తులు ఉండగా వారిలో 27 మంది తమ ఆస్తులు, అప్పుల వివరాలను ప్రధాన న్యాయమూర్తికి అందజేశారు. ఆస్తుల వివరాలు వెల్లడించిన న్యాయమూర్తుల పేర్లను సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైటులో విడుదల చేశారు. అయితే వారి డిక్లరేషన్లు మాత్రం అందులో లేవు. సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టులలో పనిచేస్తున్న న్యాయమూర్తులు తమ ఆస్తులు, అప్పులను విధిగా వెల్లడించేలా ఓ చట్టం తీసుకురావాలని సంవత్సరం క్రితం సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, న్యాయం-చట్టంపై ఏర్పడిన పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేసింది.

సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైటును గత నెలలో అప్‌డేట్ చేశారు. అందులో ఆస్తులను వెల్లడించిన న్యాయమూర్తుల సమాచారం ఉంది. కొన్ని నెలల క్రితం వరకూ సుప్రీంకోర్టుకు చెందిన 55 మంది మాజీ న్యాయమూర్తుల డిక్లరేషన్లు పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్నాయి. అయితే సిట్టింగ్ న్యాయమూర్తులవి మాత్రం కన్పించలేదు. దీనిపై 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక సుప్రీంకోర్టు అధికారిని సంప్రదించగా వెబ్‌సైటులో ఆగస్ట్ 7న మార్పులు చేశారని తెలిపారు. 'పదవి నుండి వైదొలిగిన వారి పేర్లను తొలగించడం జరిగింది. ఎవరైనా న్యాయమూర్తి బాధ్యతలు స్వీకరిస్తే ఆస్తుల డిక్లరేషన్ తీసుకొని దానికి సంబంధించిన రికార్డును సుప్రీంకోర్టు కార్యాలయం నిర్వహిస్తుంది. అయితే వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచడం అనేది పూర్తిగా స్వచ్ఛందంగా జరిగే పని' అని వివరించారు.

ఆస్తులు ప్రకటించింది వీరే

సుప్రీంకోర్టు వెబ్‌సైట్ ప్రకారం ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, బిఆర్ గవాయ్, సూర్యకాంత్, హృషీకేశ్ రాయ్, అభయ్ ఎస్ ఓకా, విక్రమ్ నాథ్, జేకే మహేశ్వరి, బీవీ నాగరత్న, ఎంఎం సుంద్రేష్, బేలా ఎం త్రివేది, పీఎస్ నరసింహ, సుధాన్షు ధూలియా, జేబీ పార్దీవాలా, దీపాంకర్ దత్తా, పంకజ్ మిట్టల్, సంజయ్ కరోల్, సంజయ్ కుమార్, అహ్సానుద్దీన్ అమానుల్లా, మనోజ్ మిశ్రా, అరవింద్ కుమార్, కేవీ విశ్వనాథన్, ఉజ్జల్ భూయాన్, ఎస్.వెంకటనారాయణ భట్టి, అగస్టీన్ జార్జ్ మసీ, సందీప్ మెహతా, ప్రసన్న బలచంద్ర వరాలే తమ ఆస్తులు ప్రకటించారు.

స్వచ్ఛందమే...

2022-24 కాలానికి ఆస్తులు ప్రకటించని న్యాయమూర్తుల వివరాలు అందజేయాలంటూ గత సంవత్సరం ఆగస్ట్ 28న 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక ఆర్‌టీఐ ద్వారా దరఖాస్తు చేసింది. అయితే ఈ సమాచారానికి చట్టం కింద మినహాయింపు ఉన్నదని సమాధానం వచ్చింది. దీనిపై ఫస్ట్ అప్పిలెట్ అథారిటీలో అప్పీలు చేయగా సమాధానం సరిగానే ఉన్నదని రూలింగ్ ఇచ్చింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు స్వచ్ఛందంగా తమ ఆస్తుల వివరాలను కోర్టు వెబ్‌సైటులో ప్రకటించవచ్చునని 2009 సెప్టెంబర్ 9న ఫుల్ బెంచ్ రూలింగ్ ఇచ్చింది. దాని ప్రకారం కొందరు న్యాయమూర్తులు స్వచ్ఛందంగా తమ ఆస్తుల వివరాలను వెబ్‌సైటులో ఉంచారు. అయితే 2018 మార్చి 31 తర్వాత ఈ సంప్రదాయానికి స్వస్తి చెప్పారు.

సుప్రీంకోర్టు ఏం చెప్పింది?

ఎంపిలు, ఎమ్మెల్యేలు, అఖిలభారత సర్వీసు అధికారులు, సుప్రీంకోర్టు-హైకోర్టుల న్యాయమూర్తులు తమ ఆస్తులను విధిగా బహిర్గతం చేయాలని గత సంవత్సరం డిసెంబర్ 11న బిజెపి ఎంపి, అప్పటి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ సుశీల్ కుమార్ మోడీ చెప్పారు. 2019 నవంబర్ 13న సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఇక్కడ ప్రస్తావించాల్సి ఉంది. జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఆ బెంచ్‌లో ఎన్‌వి రమణ, డివై చంద్రచూడ్, దీపక్ గుప్తా, సంజయ్ ఖన్నా సభ్యులు. 'ఆర్‌టీఐ చట్టం ప్రకారం భారత ప్రధాన న్యాయమూర్తి కార్యాలయం పబ్లిక్ అథారిటీ. న్యాయ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయడానికి ఆ కార్యాలయాన్ని ఓ సాధనంగా ఉపయోగించుకోవడాన్ని అనుమతించకూడదు' అని సుప్రీంకోర్టు బెంచ్ స్పష్టం చేసింది.



తాగునీటికోసం మహిళల ఆందోళన

ప్రజాశక్తి - బత్తలపల్లి

తాగునీటి సమస్యలపై సత్యసాయి జిల్లా బత్తలపల్లి ఎస్‌సి కాలనీ, యల్లమ్మ కాలనీకి చెందిన మహిళలు బత్తలపల్లి కూడలిలో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఎఎస్‌ఐ సోమశేఖరమూర్తి, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు వారితో మాట్లాడారు. అనంతరం రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కమతం కాటమయ్య ఆధ్వర్యంలో కాలనీలోని మహిళలు ఎంపిడిఒ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఇఒఆర్‌డి దివాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ వరలక్ష్మి మహిళలతో మాట్లాడారు. మహిళలు తమ సమస్యలను అధికారులకు ఏకరువు పెట్టారు. పంచాయతీ మోటార్లు మరమ్మతులకు గురవ్వడంతో నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. నెల రోజులుగా నీటి సరఫరా ఆగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, చేతి పంపులు పనిచేయక, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లితే వారు కూడా నీటిని పట్టుకోనివ్వడం లేదన్నారు. అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఫలించిన పోరాటం

- అధికారులతో తాగునీటి సరఫరా కార్మికుల చర్చలు సఫలం
- బకాయి వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించేలా కలెక్టర్ హామీ
- 13 రోజులుగా సిఐటియు ఆధ్వర్యంలో కొనసాగిన సమ్మె



కలెక్టర్‌తో చర్చిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

తాగునీటి సరఫరా కార్మికుల పోరాటం ఫలించింది. పెండింగ్ వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ ఇతర సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు గత 13 రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెపై అధికారులు స్పందించారు. మంగళవారం ఉదయం కలెక్టర్, శ్రీ సత్యసాయి బోర్డు కమిటీ ఛైర్మన్ వి.వినోద్ కుమార్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, శ్రీ సత్యసాయి, శ్రీరామ్ రెడ్డి కార్మికుల యూనియన్ నాయకులతో కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఆర్‌డబ్ల్యుఎస్ ఓఅండ్‌ఎం కలిసి చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులు కార్మికుల సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. 13 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఆ సందర్భంగా కలెక్టర్ బకాయి వేతనాలను రెండు, మూడు విడతలుగా చెల్లించే ఏర్పాటు చేస్తామన్నారు. సత్యసాయి తాగునీటి పథకం కార్మికులకు సోమవారం నుంచి వేతనాల చెల్లింపులు జరుగుతున్నాయని చెప్పారు. శ్రీరామ్‌రెడ్డి తాగునీటి కార్మికులకు మంగళవారం రాత్రికి వారి ఖాతాల్లో వేతనాలు జమవుతాయని తెలిపారు. పిఎఫ్ చెల్లింపులు తప్పకుండా జరిపేలా కాంట్రాక్టర్లను ఆదేశిస్తామని చెప్పారు. ఇఎస్ఐ చెల్లింపులనూ చేపడతామని హామీ ఇచ్చారు. క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అసెస్‌మెంట్ నిర్ణయం ప్రభుత్వ స్థాయిలో ఉందని, ఆ సమస్యను కూడా కార్మికులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు. సత్యసాయి బోర్డు కమిటీ సమావేశం రెండు నెలలకు ఒకసారి జరుగుతున్న నేపథ్యంలో ఆ సమావేశంలో కార్మిక సంఘాలుగా వచ్చి సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చర్చల సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ.. తాగునీటి కార్మికులందరూ ఒకే పని చేస్తున్నా వేతనాల్లో వ్యత్యాసం ఉందన్నారు. అలా కాకుండా సమాన పనికి సమాన వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యల్నింటినీ పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

నిరవధిక సమ్మె విరమణ.. విజయోత్సవ ర్యాలీ

సమస్యల పరిష్కారంపై చర్చల సందర్భంగా అధికారులు హామీ ఇవ్వడంతో 13 రోజులుగా జరుగుతున్న నిరవధిక సమ్మెను నిలిపేస్తున్నట్లు సిఐటియు, తాగునీటి సరఫరా కార్మికులు తెలియజేశారు. మంగళవారం సాయంత్రం నుంచే విధుల్లోకి వెళ్లి మోటార్లను ఆన్ చేశారు. చర్చలు ఫలించడంతో కార్మికులు నగరంలో విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించారు.

తిరుమల దర్శనానికి వెళ్లి వస్తూ..

లారీని కారు ఢీకొని ఇద్దరు దుర్మరణం



ప్రజాశక్తి-డెంకాడ (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా డెంకాడమండలంలోని మోదవలస వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. తిరుపతి దర్శనం కోసం వెళ్లి కారులో వస్తుండగా ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరంలోని ఐపిఎల్‌బిడిల్ చెందిన ఏసీఫ్ మనోజ్ కుమార్ (30) కారు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన స్నేహితుడు విశాఖపట్నం జిల్లా భీమిలి మండలం రాజుల తాళ్లవలసకు చెందిన అలమండ శ్యామ్ కుమార్ (31), మరో ఇద్దరు స్నేహితులతో కలిసి తన కారులో మూడు రోజుల క్రితం తిరుపతి వెళ్లారు. దర్శనం ముగించుకొని తిరిగి స్వగ్రామాలకు బయలుదేరారు. స్నేహితుల్లో ఒకరు ఏలూరులోనూ, ఇంకొకరు మధురవాడలోనూ దిగిపోయారు. మనోజ్ కుమార్, శ్యామ్‌కుమార్ కలిసి మంగళవారం తెల్లవారు జామున వస్తుండగా మోదవలస వద్ద ఆగివున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొన్నారు. దీంతో కారు లారీ కిందకు దూసుకుపోయింది. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి కారును బయటకు తీశారు. మనోజ్ కుమార్‌కు ఏడాదిన్నర క్రితం వివాహమైంది. భార్య శ్యామ్ కుమార్‌కు భార్య నిఖిల, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్ఐ ఎ.సన్యాసి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వారి కళ్లు సజీవం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుల నేత్రాలు ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన విషయం తెలుసుకున్న రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు కెఆర్‌డి ప్రసాద్ స్పందించి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి నేత్రదానానికి ఒప్పించారు. రోడ్డు ప్రమాదంలో ఎస్.మనోజ్‌కుమార్, ఎ.శ్యామ్‌కుమార్ మరణించగా, వారి నుంచి మంగళవారం నాలుగు కార్నియాలను తీసి, విశాఖపట్నంలోని ఎల్‌వి ప్రసాద్ ఐ బ్యాంకుకు పంపించారు. ఈ సందర్భంగా నేత్రదానం మహాదానమని, ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసి మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కెఆర్‌డి ప్రసాద్ కోరారు. మృతుల కుటుంబాలను ఆయన అభినందించారు.

చెత్త రహితంగా తీర్చిదిద్దాలి

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ



రోడ్డు ఊడుస్తున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

చెత్త రహిత భారతదేశ నిర్మాణమే లక్ష్యంగా అందరూ భాగస్వామ్యులు కావాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో అంబేద్కర్ సర్కిల్‌లో మంగళవారం నిర్వహించిన 'స్వచ్ఛ హి సేవా' ప్రారంభ కార్యక్రమానికి సహాయ మంత్రి శ్రీనివాసవర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మీ, భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు పాల్గొన్నారు. తొలుత వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో ఏర్పాటు చేసిన మానవహారంలో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ వద్ద రైల్వే అండర్ పాస్ పక్క రోడ్డులో చీపుర్లు చేతబట్టి చెత్తను ఊడ్చి, డస్ట్ బిన్స్‌లో వేశారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు పెద్దఎత్తున కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తోడ్పడాలన్నారు. జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ సమాజం పరిశుభ్రంగా ఉంటేనే అభివృద్ధి, ఆరోగ్యం సాధ్యమన్నారు. భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ పరిశుభ్రతపై యజ్ఞం చేయాలన్నారు. అపరిశుభ్రత కారణంగా భవిష్యత్ తరాలకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మరుగుదొడ్ల కార్యక్రమం తలమానికంగా నిలిచిందన్నారు.

కొండ నీళ్లే దిక్కు

- చెంచు గూడెంల్లో కనీస వసతులు కరువు
- విద్యుత్, తాగునీరు శూన్యం..
- ఆధార్, రేషన్ కార్డులు కూడా లేవు
- విద్యకు దూరమవుతున్న చెంచు గిరిజన పిల్లలు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం అటవీ పరిధిలోని చెంచు గూడెంల్లో చెంచు గిరిజనులు కనీస వసతులు లేక దుర్భర జీవితాలను గడుపుతున్నారు. విద్యుత్ సౌకర్యం లేక చిమ్మ చీకట్లో మగ్గిపోతున్నారు. గూడెంలో ఉండే చేతి పంపులు చెడిపోవడంతో కొండ వాగుల జాలువారే నీళ్లను తాగుతూ కాలం గడుపుతున్నారు. ఐటిడిఎ ఆధ్వర్యంలో కట్టించిన ఇళ్లు పూర్తిగా శిథిలం కావడంతో పూరి గుడిసెల్లో జీవిస్తున్నారు. చెంచు గిరిజనులకు ఆధార్, రేషన్ కార్డులు లేకపోవడంతో వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నంద్యాల జిల్లా శ్రీశైలం మండలంలోని మాణికేశ్వరమ్మ సెల గూడెంలో దాదాపు 13 కుటుంబాలు, పాలకేశ్వర చెంచుగూడెంలో ఎనిమిది, శివరం గూడెంలో పది, సున్నిపెంటలోని రాజీవ్ గాంధీ చెంచు గూడెంలో 15, ప్రకాశం జిల్లా దోర్నాల మండలంలోని నందిగూడెంలో 20, ఎర్ర గురవ గూడెంలో 30 కుటుంబాల వారు జీవిస్తున్నారు. ఎర్ర గురవ గూడెంలో చెంచు గిరిజనుల పరిస్థితి దయనీయం. గత 60 ఏళ్లుగా పూరి గుడిసెల్లో నివసిస్తున్నారు. నందిగూడెంకు రెండు కిలోమీటర్ల దూరంలో దట్టమైన అడవి ప్రాంతంలో పూరి గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. కనీసం కరెంటు, తాగునీటి సౌకర్యాలు కూడా లేవు. గతంలో చెంచుగిరిజన సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ఒక చేతి బోరును దాతల సహకారంతో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అది కూడా చెడిపోయి కొండ ఊట నీళ్లు తాగి బతుకుతున్నారు. నంది గూడెంలో దాదాపు 30 సంవత్సరాలుగా గిరిజన కుటుంబాలు శిథిలమైన ఇండ్లల్లో ఉంటూ ప్రాణాలు చేతులు పట్టుకొని నివసం ఉంటున్నారు. ఐటిడిఎ ఆధ్వర్యంలో కట్టించిన ఇళ్ల గోడలు నెరెళ్లిచ్చి వర్షపు నీరంతా ఇళ్లల్లోకి వస్తుండడంతో గిరిజన మహిళలు కష్టిలి పర్యంతమవుతున్నారు. ఇళ్లల్లోకి పాములు, తేళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మందికి మాత్రమే ఐటిడిఎ వారు ఇళ్లు కట్టించారు. కొంతమంది మందికి ఇళ్లు లేవు. కొంత మంది వృద్ధులు పింఛన్ల కొత్తగా దరఖాస్తు చేయగా రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు లేవని అధికారులు తిరస్కరిస్తున్నారు. గ్రామీణ ఉపాధి హామీ పనుల మూడు నెలలు లేక పూట గడవడం కష్టంగా మారింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వమైనా తమ పట్ల దయ ఉంచి ఇళ్ల స్థలాలు కేటాయించి, గృహాలు నిర్మించి ఇవ్వాలని, విద్యుత్, తాగునీటితో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించాలని చెంచు గిరిజనులు కోరుతున్నారు.

నివేదికలో అంశాలు దిగ్భ్రాంతికరం

- వాస్తవాలను వెలికితీయడమే సిబిఐ దర్యాప్తు లక్ష్యం
- అభయ కేసులో సుప్రీం కోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిబిఐ నివేదికలో తీవ్ర దిగ్భ్రాంతి కలిగించే విషయాలే ఉన్నాయని, ఆ వివరాలను బయటపెట్టడంతో దర్యాప్తుపై ప్రభావం పడొచ్చని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకున్న కొల్‌కతా ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ జూనియర్ డాక్టర్ అభయపై అత్యాచారం, హత్య కేసును మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. సిబిఐ నిద్ర పోవటం లేదని, నిజాన్ని వెలికితీసేందుకు వారికి కొంత సమయం ఇవ్వాలని ధర్మాసనం పేర్కొంది. బాధితురాలి ఫొటో, పేరును వికీపీడియా నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించారు. కేసుకు సంబంధించిన స్టేటస్ రిపోర్టును ధర్మాసనానికి సిబిఐ సమర్పించింది. వాస్తవాలను వెలికితీయడం దర్యాప్తు లక్ష్యమని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రిన్సిపల్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఒ)ను అరెస్టు చేశారని, దర్యాప్తు పూర్తి అయ్యే వరకు వేచి చూద్దామని తెలిపింది. ఘటన జరిగిన ఐదు రోజుల తరువాత సిబిఐకి కేసు అప్పగించడం వల్ల పలు సవాళ్లు ఎదురవుతున్నాయని, కేసులో పురోగతి పరిమితంగా ఉందని సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ అన్నారు.

హాస్పిటల్ ఆర్థిక అవకతవకలపై దర్యాప్తునకు సంబంధించి నివేదికను సమర్పించాలని సిబిఐకి చెప్పింది.



జూనియర్ డాక్టర్‌కి నివాళులర్పిస్తున్న వైద్య విద్యార్థులు

కేసు విచారణ ప్రత్యక్ష ప్రసారాన్ని నిలిపివేయాలని బెంగాల్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కోరారు. ఇలాంటి కేసులను ప్రత్యక్ష ప్రసారం చేసినప్పుడు అది ప్రభావాన్ని చూపుతుందన్నారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. ఇది ఓపెన్ కోర్టు అని, ఇది ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశమని తెలిపింది. కపిల్ సిబల్ స్పందిస్తూ ఇది తమ ప్రతిష్టకు సంబంధించిందని అన్నారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఛాంబర్‌లోని మహిళా న్యాయవాదులకు యాసిడ్ దాడి, అత్యాచారం చేస్తామని సోషల్ మీడియాలో బెదిరింపులు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశం కాబట్టి విచారణ ప్రత్యక్ష ప్రసారాన్ని ఆపబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. లాయర్లు, ఇతరులకు ఏదైనా ముప్పు వాటిల్లితే చర్యలు తీసుకుంటామని సిబల్‌కు కోర్టు భరోసా ఇచ్చింది.

నైట్ షిఫ్ట్‌లో పని చేసే మహిళలను అడ్డుకోలేం

నైట్ షిఫ్ట్‌లో పనిచేసే మహిళలను అడ్డుకోలేమని, రాత్రిపూట పనిచేయకూడదని వారికి చెప్పలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. అభయ ఘటన తరువాత ప్రభుత్వ ఆసుపత్రుల్లో మహిళల భద్రత దృష్ట్యా మహిళా డాక్టర్లు నైట్ షిఫ్ట్ లేకుండా చూసుకోవాలంటూ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ నోటిఫికేషన్‌ను వెంటనే సవరించాలని ఆదేశించింది. "రాత్రిపూట పనిచేయవద్దు అని మహిళలకు ఎలా చెబుతాం. వాళ్లకు మినహాయింపులు కాదు, సమాన అవకాశాలు కావాలి. అన్ని పరిస్థితుల్లోనూ పనిచేసేందుకు మహిళా డాక్టర్లు ఆసక్తిగా ఉన్నారు. వాళ్లు కచ్చితంగా అన్ని పరిస్థితుల్లో పనిచేయాలి. బెంగాల్ సర్కారు తమ నిర్ణయాన్ని సరి చేసుకోవాలి. 12 గంటల షిఫ్ట్‌ను దాటేసి మహిళలు పనిచేయరాదని చెప్పలేం. సైనిక దళాల్లో రాత్రి పూట పనిచేసే మహిళలు ఉన్నారు" అని ధర్మాసనం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం మహిళా డాక్టర్లకు రక్షణ ఇచ్చేందుకు వెనుకాడితే, కేంద్ర ప్రభుత్వం వాళ్లకు రక్షణ ఇస్తుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. నైట్ షిఫ్ట్ విషయంలో సవరణ చేస్తూ కొత్త నోటిఫికేషన్ జారీ చేస్తామని బెంగాల్ సర్కారు తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తెలిపారు.

బెంగాల్ హెల్త్ సర్వీసెస్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ల తొలగింపు పోలీసు కమిషనర్ బదిలీ

పశ్చిమ బెంగాల్ ఆరోగ్య సర్వీసుల డైరెక్టర్ (డిహెచ్‌ఎస్) దేవశిష్ హల్దార్‌ను, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డిఎంఇ) కౌస్తవ్ నాయక్‌ను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తొలగించింది. వారి స్థానంలో కొత్త ఇన్‌ఛార్జిలుగా వరుసగా డాక్టర్ స్వప్న సోరెన్, డాక్టర్ సుపర్ణ దత్తాలను నియమించింది. సోమవారం రాత్రి ఆందోళన చేస్తున్న డాక్టర్లతో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చర్చలు జరిపిన నేపథ్యంలో వారిని తొలగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. కొల్‌కతా కొత్త పోలీసు కమిషనర్‌గా మనోజ్ కుమార్ వర్మను నియమించారు. ప్రస్తుతమున్న వినీత్ గోయల్ స్థానంలో వర్మ కొత్తగా బాధ్యతలు స్వీకరిస్తారు. కొల్‌కతా పోలీసు కమిషనర్‌ను తొలగించాలన్నది విద్యార్థుల ఐదు డిమాండ్లలో ఒకటిగా వుంది. ఆందోళన చేస్తున్న డాక్టర్లు తిరిగి విధుల్లో చేరితే వారిపై ఎలాంటి ప్రతీకార చర్యలు వుండబోవని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఇప్పటికే హామీ ఇచ్చింది.

యుపి బాణాసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు

- ఐదుగురు మృతి, 11 మందికి తీవ్రగాయాలు

ఫిరోజాబాద్ : ఉత్తరప్రదేశ్‌లో బాణాసంచా తయారీ ఫ్యాక్టరీ నిల్వ కేంద్రంలో అగ్ని ప్రమాదం సంభవించి ఇద్దరు చిన్నారులుసహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఫిరోజాబాద్ జిల్లా శికోహబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న నౌషరా ప్రాంతంలోని ఫ్యాక్టరీలో మంగళవారం సంభవించిన ఈ ప్రమాదంతో 12 ఇళ్లు ధ్వంసమయ్యాయని స్థానికులు తెలిపారు. ఫ్యాక్టరీలో ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో, మీరాదేవి (45), అమన్ కుష్వాహ (17), గౌతమ్ కుష్వాహ (16), కుమారి ఇచ్ఛా (4), అభినయే (2) మరణించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. స్థానికులు ఆందోళన చేయడంతో, శికోహబాద్ ఎమ్మెల్యే ముఖేష్ వర్మ ఈ ప్రమాదం గురించి ముఖ్యమంత్రి కార్యాలయంతో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం, ఇళ్లు ధ్వంసమైన వారికి 100 గజాల స్థలం సిఎంఒ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే చెప్పారు. దీంతో, అంత్యక్రియలు చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు.


100 రోజుల్లో ఎన్నో విజయాలు : ప్రధాని మోడీ

భువనేశ్వర్ : ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వ 100 రోజుల పాలనలో ఎన్నో విజయాలు సాధించామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఒడిషా ప్రభుత్వం మహిళల కోసం రూపొందించిన సుభద్ర యోజన పథకాన్ని మోడీ మంగళవారం ప్రారంభించారు. ఈ పథకం లబ్ధిదారులతో భువనేశ్వర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లోనే రైతులు, యువత, మహిళలకు సాధికారత కల్పించేందుకు అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. కొత్తగా మూడు కోట్ల కాంక్రీట్ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని, యువత కోసం రూ 2 లక్షల కోట్ల ప్యాకేజి ఇవ్వాలని నిర్ణయించామన్నారు. 60,000 గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి అవే యోజన-గ్రామీణ్ కింద 14 రాష్ట్రాలకు చెందిన దాదాపు 10 లక్షల మంది లబ్ధిదారులకు మొదటి విడత సహాయాన్ని ప్రధాన మంత్రి మోడీ విడుదల చేశారు.

హర్యానా ఎన్నికల్లో 1,031 మంది పోటీ

- భివానీ నుంచి సిపిఎం అభ్యర్థిగా ఓం ప్రకాష్

చండీగఢ్ : అక్టోబర్ 5న జరిగే హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో 1,031 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. మొత్తం 1,559 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలన తరువాత వీటిలో 1,221 మంది నామినేషన్లు మాత్రమే చెల్లు బాటవుతాయని అధికారులు గుర్తించారు. సోమవారం ఉపసంహరణ గడువు పూర్తయ్యే నాటికి, వీరిలో 190 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. హరాన్యాలో ఈ నెల 5 నుంచి 12 వరకూ నామినేషన్లు దాఖలు చేయడానికి గడువు ఉండగా, 13వ తేదీన నామినేషన్లు పరిశీలించారు. ఉపసంహరణకు సోమవారం వరకూ గడువు ఇచ్చారు. ఉపసంహరణ గడువు పూర్తయిన తరువాత పోటీలో వున్న అభ్యర్థుల వివరాలను అధికారులు మంగళవారం వెల్లడించారు.


సిపిఎం అభ్యర్థి ఓం ప్రకాష్

భివానీ నియోజకవర్గం నుంచి సిపిఎం అభ్యర్థిగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, భివానీ జిల్లా కార్యదర్శి ఓం ప్రకాష్ పోటీ చేస్తున్నారు. ఓం ప్రకాశ్‌కు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. హర్యానాలోని మొత్తం 90 స్థానాలకు అక్టోబర్ 5న ఒకే దశలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 8న ఫలితాలను ప్రకటించనున్నారు.

జమ్ముకాశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా : ఖర్గే

న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా కోసం తమ పార్టీ భరోసా ఇస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మంగళవారం పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ వాగ్దానం చేసిన ఏడు హామీల స్క్రీన్‌షాట్‌లను ట్యాగ్ చేస్తూ.. లక్ష ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ కల్పించడం ద్వారా యువతకు కొత్త శక్తిని ఇస్తుందని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జమ్ము కాశ్మీర్ హక్కులకు కాంగ్రెస్ హామీ ఇస్తుందని, జెకె పూర్తిస్థాయి రాష్ట్ర హోదాను తిరిగి కల్పిస్తామని పోస్ట్‌లో పేర్కొన్నారు.

10 రోజుల తరువాత మణిపూర్‌లో విద్యాసంస్థలు ప్రారంభం

ఇంఫాల్ : దాదాపు 10 రోజుల విరామం తరువాత మణిపూర్‌లో విద్యాసంస్థలు మంగళవారం పున:ప్రారంభమయ్యాయి. ఈ నెల 7న రాకెట్ దాడుల్లో ఒకరు మరణించగా, అనేక మంది గాయపడిన తరువాత నుంచి మూడు జిల్లాల్లో కర్ఫ్యూ విధించడంలోపాటు విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఈ నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలల పున:ప్రారంభానికి సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర డైరెక్టరేట్ ఆఫ్ ఎడ్యుకేషన్ (పాఠశాలలు), ఉన్నత-సాంకేతిక విద్యా శాఖ సోమవారం రాత్రి జారీ చేసింది. ఇంఫాల్ తూర్పు, ఇంఫాల్ పశ్చిమ, తౌబాల్ జిల్లాల్లో మంగళవారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ కర్ఫ్యూ సడలిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

త్వరలో జనగణన

- అమిత్‌షా

న్యూఢిల్లీ : త్వరలో జనగణన చేపడతామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెప్పారు. ఎన్‌డిఎ నేతృత్వంలోని మోడీ 3.0 ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మొదటిసారి భారత్ విదేశాంగ విధానంలో మెరుగ్గా ఉంది. అంతర్గతంగానూ, బాహ్యంగానూ భారత్ దృఢమైన యంత్రాంగాన్ని కలిగి ఉందని అన్నారు. 3.0 మోడీ గవర్నమెంట్ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు లక్షల కోట్ల మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ఆమోదించిందన్నారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా రక్షణ పథకంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందని అమిత్‌షా తెలిపారు.

ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలోనే ఒక దేశం, ఒకే ఎన్నికలు

ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వ కాలంలోనే 'ఒక దేశం, ఒకే ఎన్నికలు' అమలవుతుందని అమిత్‌షా ప్రకటించారు. జమిలీ ఎన్నికలను ఇండియా బ్లాక్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.



ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవాలి

- అమెరికాను కోరిన చైనా

బీజింగ్ : గాజాలో మిలటరీ దాడులను ఇక నిలిపివేసేలా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తీసుకురావాల్సిందిగా అమెరికాను చైనా కోరింది. ఇక ఎలాంటి జాప్యం లేకుండా గాజాలో సైన్యం దాడులను ఆపేసేలా స్పష్టమైన చర్యలు తీసుకోవాలని, ఆ మేరకు ఇజ్రాయిల్‌ను ఒప్పించాలని ఐక్యరాజ్య సమితిలో చైనా డిప్యూటీ శాశ్వత ప్రతినిధి గెంగ్ షుయాంగ్ అమెరికాకు విజ్ఞప్తి చేశారు. "బాధ్యతాయుతమైన వైఖరిని ప్రదర్శించాలి. అవతలి పక్షంపై తనకు గల పట్టును ఉపయోగించుకోవాలి. భద్రతా మండలి తీర్మానాలకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలి. దీర్ఘకాలంగా ఇబ్బందులు పడుతున్న పాలస్తీనియన్లకు జీవించే హక్కు ఇవ్వాలి." అని గెంగ్ కోరారు. మధ్య ప్రాచ్యంలో పరిస్థితులను భద్రతా మండలికి వివరిస్తూ ఆయన సోమవారం మాట్లాడారు. దాదాపు ఏడాది కాలంగా గాజాలో దారుణమైన, ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇజ్రాయిల్‌ను సమర్థిస్తూ అమెరికా అడ్డుగా నిలబడకపోతే భద్రతా మండలి ఇప్పటికే అనేక తీర్మానాలను ఆమోది వుండేదని, అవి తిరస్కరణకు గురి కాకుండా కూడా వుండేవని అన్నారు. యుద్ధ జ్వాలలను ఆర్పేందుకు, శాంతిని నెలకొల్పేందుకు సాధ్యమైనంత త్వరగా మండలి చర్యలు తీసుకోవాలని, మండలి తీసుకునే చర్యలకు చైనా మద్దతునిస్తుందని చెప్పారు.

ప్రజా తీర్పే ఫైనల్

- బిజెపి దాడిని తిప్పికొట్టడం... నిజాయితీ నిరూపించుకోవడం
- ఇదే కేజ్రీవాల్ ద్విముఖ వ్యూహం
- దశాబ్ద కాలంలో రెండోసారి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా



న్యూఢిల్లీ : చెప్పినట్లుగానే ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఇకపై ప్రజాక్షేత్రంలో అడుగు పెట్టబోతున్నారు. గతంలో మాదిరిగానే మరోసారి వారి ఆశీస్సులు తనకు లభిస్తాయని ప్రగాఢంగా విశ్వసిస్తున్నారు. తన ప్రతిష్ఠను దెబ్బతీస్తున్న బిజెపి దుష్ట పన్నాగాలను ఎండగట్టి రాబోయే శాసనసభ ఎన్నికలలో ఆ పార్టీని చిత్తు చేయాలని కృతనిశ్చయంతో ఉన్నారు. తాను నిజాయితీపరుడినని నమ్మితేనే ఓటు వేసి ముఖ్యమంత్రి కుర్చీపై కూర్చోబెట్టాలని ప్రజలను కోరబోతున్నారు. అయితే ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడం ఇది రెండోసారి. పది సంవత్సరాల క్రితం...2014 ఫిబ్రవరిలో కూడా ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. అప్పుడు ఆప్ ప్రభుత్వం కేవలం 49 రోజులు మాత్రమే అధికారంలో ఉంది. మద్యం పాలసీ కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన కొద్ది రోజులకే కేజ్రీవాల్ ఇప్పుడు మరోసారి పదవిని త్యజించారు. ఢిల్లీ శాసనసభకు వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఆప్ చేతిలో ఇప్పటికే రెండుసార్లు భంగపడిన బీజేపీ, ఈసారి ఎలాగైనా అధికారాన్ని కైవసం చేసుకోవాలని ఎత్తుగడలు పన్నుతోంది. అందులో భాగంగానే కేజ్రీవాల్‌పై పలు అవినీతి ఆరోపణలు చేసింది. కేజ్రీని అవినీతి పరుడిగా చిత్రీకరించి ఆయన ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూస్తోంది.

'కేజ్రీవాల్‌కు ఈడీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దర్యాప్తు సంస్థ పక్షపాత పూరితంగా వ్యవహరిస్తోందని అక్షింతలు వేసింది. సుప్రీంకోర్టు కూడా ఆయనకు బెయిల్ ఇస్తూ పంజరంలో చిలుకలా వ్యవహరించవద్దని సీబీఐకి చురక వేసింది. కేజ్రీవాల్ డబ్బు సంపాదించడానికి రాజకీయాలలోకి రాలేదు. ఆయన గౌరవం పొందారు' అని ఆప్ ప్రధాన జాతీయ సలహాదారు ప్రియాంక కక్కర్ వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ ఇమేజ్‌ను బీజేపీ దెబ్బతీస్తోందని, అందుకే తిరిగి ఢిల్లీ ప్రజల వద్దకు వెళ్లి తాను నిజాయితీపరుడిని అయితేనే తిరిగి ఎన్నుకోండని కోరతారని తెలిపారు.

ఇక ప్రజాక్షేత్రంలో...

జైలులో ఉన్నప్పుడు కేజ్రీవాల్ రాజీనామా చేయాలని బిజెపి పదే పదే డిమాండ్ చేసింది. అయినప్పటికీ ఆయన పదవిలో కొనసాగారు. జైలులో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తే ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళతాయని ఆప్ అభిప్రాయపడింది. జైలులో ఉన్నప్పుడేమో రాజీనామా చేయాలని డిమాండ్ చేశారని, ఇప్పుడు ఆ పని చేస్తే అదో స్టంట్ అంటున్నారని కక్కర్ మండిపడ్డారు. మద్యం పాలసీ కేసులో అరెస్టయిన మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా ఇదివరకే బెయిల్ పొందారు. రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్‌కు కూడా బెయిల్ వచ్చింది. ఇప్పుడు కేజ్రీవాల్ కూడా బయటకు రావడంతో ఆప్ నేతలంతా ప్రజల వద్దకు వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు.

ఒకే దెబ్బకు రెండు పిట్టలు

అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపిన తనకు, ఆప్‌కు కళంకాన్ని ఆపాదించి పార్టీ నేతలను జైలుకు పంపారని కేజ్రీవాల్ ప్రజలకు వివరించబోతున్నారు. రాబోయే శాసనసభ ఎన్నికలను ఆయన రిఫరెండంగా భావిస్తున్నారు. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడం వెనుక కేజ్రీవాల్ ద్విముఖ వ్యూహాన్ని అమలు చేస్తున్నారని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఒక వైపు బీజేపీ దాడిని తిప్పికొట్టడంతో పాటు మరోవైపు ఆ పార్టీ ఆరోపణలతో దెబ్బతిన్న తన ఇమేజ్‌ను పునరుద్ధరించుకోవడమే లక్ష్యంగా కేజ్రీవాల్ అడుగులు వేస్తున్నారు.

పేలిన పేజర్లు

- లెబనాన్‌లో 8మంది మృతి, 2750మందికి పైగా గాయాలు
- గాయపడిన ఇరాన్ రాయబారి
- 200మంది పరిస్థితి విషమం
- ఇజ్రాయిల్ పనే : హిజ్బుల్లా

టెహరాన్ : రాజధాని బీరుట్‌తోసహా లెబనాన్ వ్యాప్తంగా, సిరియాలో కొన్నిచోట్ల మంగళవారం చోటుచేసుకున్న పేజర్ పేలుళ్లలో 8మంది మరణించగా, దాదాపు 2750మంది గాయపడ్డారు. వీరిలో ఇరాన్ రాయబారి, హిజ్బుల్లా ఎంపి కుమారుడు, ఒక బాలిక కూడా వున్నారు. తండ్రి పక్కనే వుండడంతో పేజర్ పేలుడులో ఆ బాలిక మరణించిందని బంధువులు తెలిపారు. గాయపడిన వారిలో 200మంది పరిస్థితి విషమంగా వుంది. ఈ పేలుళ్లకు ఇజ్రాయిల్ కారణమని, ఇందుకు బాధ్యులైనవారు శిక్ష అనుభవించక తప్పదని హిజ్బుల్లా హెచ్చరించింది. ఈ పేలుళ్లలో తమ సభ్యులు ఇద్దరు మరణించారని అంతకుముందు హిజ్బుల్లా ధ్రువీకరించింది. పేలుళ్ళకు కారకులైన వారిని నిర్ధారించేందుకు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపింది. ఇటీవలి మాసాల్లో హిజ్బుల్లా అత్యంత ఆధునాతనమైన మోడల్ పేజర్లని తీసుకువచ్చిందని భద్రతా వర్గాలు తెలిపాయి. సమాచారాన్ని పంపుకునేందుకు వీటిని వాడతారు. లెబనాన్‌వ్యాప్తంగా ఆ పేజర్లు పలుచోట్ల పేలిపోయాయి. హిజ్బుల్లా సభ్యుల వద్ద వున్న పేజర్లను పేల్చివేసినట్లు తెలుస్తోందని పేరు వెల్లడించని భద్రతా అధికారులు తెలిపారు. ఇది ఇజ్రాయిల్ దాడే అని మరో అధికారి అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ పేలుళ్లలో లెబనాన్‌లో ఇరాన్ రాయబారి అమాని కూడా గాయపడ్డారని, ప్రస్తుతం ఆయనను ఆస్పత్రిలో అబ్జర్వేషన్‌లో వుంచినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. పేవ్‌మెంట్‌లపై ఎక్కడికక్కడ వ్యక్తులు పడిపోయి వుండడం కనిపిస్తోంది. చేతులకు, పొట్టలకు, పేజర్లు పెట్టుకున్న ప్యాంట్ జేబుల వద్ద ఎక్కువగా గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సెల్‌ఫోన్లు వెంట తీసుకువెళ్ళవద్దని అంతకుముందు హిజ్బుల్లా నేత హసన్ నస్రుల్లా సభ్యులను హెచ్చరించారు. ఈ ఫోన్లు వెంట వుంటే కదలికలను ట్రాక్ చేస్తారని, దాడులు చేస్తారని హెచ్చరించారు. దాంతో పేజర్లను వాడాలని సభ్యులకు సూచించారు.


క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలిస్తున్న సహాయక బృందం

ఇజ్రాయిల్‌తో ఉద్రిక్తతలు పెచ్చరిల్లిన వేళ హిజ్బుల్లా పాత కాలపు పద్ధతులను ఉపయోగిస్తోంది. శత్రువు ఆధునిక నిఘా పద్ధతులకు దొరక్కుండా వుండేలా కోడ్ సందేశాలు, ల్యాండ్‌లైన్ ఫోన్లు వాడుతోంది. అందులో భాగమే ఈ పేజర్లు కూడా.

పేజర్ అంటే ఏమిటి?

ఇది ఓ చిన్న పోర్టబుల్ ఎలక్ట్రానిక్ పరికరం. సందేశాలు పంపుకోడానికి, స్వీకరించడానికి దీనిని ఉపయోగిస్తారు. రేడియో ఫ్రీక్వెన్సీస్ ద్వారా సంక్షిప్తంగా సమాచారాన్ని కమ్యూనికేట్ చేసుకోడానికి వినియోగిస్తారు.

ఆప్ ప్రభుత్వంలో అతిషి కీలక పాత్ర

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



కేజ్రీవాల్ జైలులో ఉన్న సమయంలో పార్టీ కీలక బాధ్యతలు నిర్వహించిన అతిషి మార్లేనా అన్నీ తానై పార్టీ వ్యవహారాలు, ప్రభుత్వ బాధ్యతలను చక్కదిద్దారు. ప్రభుత్వంలోని మొత్తం 14 విభాగాలకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న ఆమె, కేబినెట్ మంత్రుల్లో అత్యధిక విభాగాలను చూస్తున్నారు. విద్య, ఆర్థికం, ప్రణాళిక, పిడబ్ల్యుడి, వాటర్, పవర్, పౌర సంబంధాలు వంటి కీలక శాఖలను అతిషి నిర్వహిస్తున్నారు. ఎడ్యుకేషన్‌పై వేసిన స్టాండింగ్ కమిటీకి ఆమె చైర్ పర్సన్‌గా పనిచేశారు. ఢిల్లీలో పాఠశాలల్లో విద్యా వ్యవస్థను మెరుగుపరచడానికి ఆప్ ప్రభుత్వం చేసిన కృషిలో ఆమె కీలకంగా వ్యవహరించారు. కల్కాజీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆమె ప్రస్తుతం కొనసాగుతున్నారు. ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పిఎసి) సభ్యురాలిగా ఉన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీష్ సిసోడియా అరెస్ట్ అయ్యాక ఆమె మంత్రి అయ్యారు. సిఎం కేజ్రీవాల్, మనీష్ సిసోడియా జైలులో ఉన్నప్పుడు ఆమె పార్టీని నడిపించారు. ఆగస్టు 15న ఢిల్లీ ప్రభుత్వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసేందుకు అతిషిని కేజ్రీవాల్ ఎంచుకున్నారు. విద్యా శాఖ మంత్రిగా దేశ రాజధాని ఢిల్లీలోని ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చడంలో ఆమె కీలకంగా వ్యవహరించారు. ఢిల్లీలో మంచి నీటి ఇబ్బందులు ఏర్పడినప్పుడు నీటి శాఖ మంత్రిగా అతిషి, నీటి విడుదల కోసం కేంద్రంలోని బిజెపితోనే కాదు, పక్కనున్న హర్యానాలోని బిజెపి ప్రభుత్వంతో పెద్ద యుద్ధమే చేశారు.

ఢిల్లీలో మూడో మహిళా ముఖ్యమంత్రి

అతిషి ఢిల్లీ ఎనిమిదో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. 43 ఏళ్ల అతిషి అతి పిన్న వయస్కురాలైన ముఖ్యమంత్రిగా రికార్డు కెక్కారు. కాంగ్రెస్‌కు చెందిన షీలా దీక్షిత్, బిజెపికి చెందిన సుష్మా స్వరాజ్‌ల తరువాత ఢిల్లీకి మూడో మహిళా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. దేశంలో ప్రస్తుతం మహిళా ముఖ్యమంత్రిగా పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ ఒక్కరే ఉన్నారు.

మార్క్స్, లెనిన్ పేర్లతో అతిషి పూర్తి పేరు

అతిషి పూర్తి పేరు.. అతిషి మార్లెనా సింగ్. 1981 జూన్ 8న న్యూఢిల్లీలో జన్మించారు. ఆమె తల్లిదండ్రులు విజయ్ సింగ్, తృప్త వాహీ. వీరిద్దరు ఢిల్లీ యూనివర్శిటీ ప్రొఫెసర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె తల్లిదండ్రులు ఆమెకు మార్క్స్, లెనిన్ పేర్ల కలయికతో 'మార్లేనా' అనే పేరు పెట్టారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు, 2018లో ఆమె "అతిషి"ని తన పేరు ముందు చేర్చుకున్నారు. అప్పటి నుంచి ఆమె అతిషి మార్లేనాగా ఉన్నారు. న్యూఢిల్లీ పూసా రోడ్డులోని స్ప్రింగ్ డేల్ హైస్కూల్‌లో అతిషి చదువుకున్నారు. 2001లో ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కళాశాల నుంచి చరిత్రలో ఆమె బ్యాచిలర్ డిగ్రీని అందుకున్నారు. అనంతరం ఇంగ్లాండ్ వెళ్లి ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో చేరి, చెవెనింగ్ స్కాలర్‌షిప్ అందుకున్నారు. 2003లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ నుంచి హిస్టరీలో మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేశారు. ఆ తరువాత 2005లో రోడ్స్ స్కాలర్‌తో ఆక్స్‌ఫర్డ్‌లోని మాగ్డలెన్ కాలేజీకి అతిషి హాజరయ్యారు.

ఢిల్లీ ప్రయోజనాలు పరిరక్షిస్తా : అతిషి

తనకు సిఎంగా అవకాశం కల్పించినందుకు కేజ్రీవాల్‌కు అతిషి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎల్‌జిని కలిసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తాను ఢిల్లీ ప్రజల ప్రయోజనాలను పరిరక్షిస్తానని అన్నారు. 'నేను వేరే పార్టీలో ఉండి ఉంటే.. బహుశా నాకు ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్ కూడా దక్కేది కాదు. కేజ్రీవాల్ నాపై ఎంతో నమ్మకంతో నన్ను ఎమ్మెల్యేను, మంత్రిని చేశారు. ఈరోజు ముఖ్యమంత్రి బాధ్యతలు ఇచ్చారు. ఇలాంటిది ఆమ్ ఆద్మీ పార్టీలో మాత్రమే సాధ్యమవుతుంది. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన నాకు ఇంతటి అవకాశం కల్పించిన కేజ్రీవాల్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయను' అని అతిషి పేర్కొన్నారు. ఢిల్లీకి ఒకే ఒక్క ముఖ్యమంత్రి ఉన్నారని, అది అరవింద్ కేజ్రీవాలే అని ఆమె పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆప్ అధినేతను తిరిగి ఎన్నుకోవడమే తమ లక్ష్యమని అతిషి స్పష్టం చేశారు. ఢిల్లీ ప్రజలు, ఆప్ ఎమ్మెల్యేలు, తాను ఆ లక్ష్యంతో పని చేస్తామని పేర్కొన్నారు. కేజ్రీవాల్‌పై తప్పుడు కేసులు బనాయించి ఆరు నెలల పాటు కటకటాల పాల్జేశారని, కేంద్రప్రభుత్వ దర్యాప్తు సంస్థలు ఆయనను లక్ష్యంగా చేసుకున్నాయని చెప్పారు. ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ మాట్లాడుతూ "మా నిర్ణయం గురించి ఎల్‌జికి తెలియజేశాం. ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించాలని కోరుతూ అతిషి మంగళవారం ఒక లేఖ సమర్పించారు. ప్రమాణ స్వీకారానికి తేదీని నిర్ణయించాలని మేము ఎల్‌జిని అభ్యర్థించాం" అని పేర్కొన్నారు.

ఇజ్రాయిల్ నరమేధంతో 11 నెలల్లో 11వేల మంది విద్యార్థులు మృతి

గాజా : గత 11మాసాలకు పైగా గాజాలో, ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న ఊచకోతలో 11వేల మందికి పైగా విద్యార్థులు మరణించారని పాలస్తీనా విద్యా మంత్రిత్వశాఖ పేర్కొంది. ఉత్తర గాజాలో అనేక స్కూళ్లు నేలమట్టమయ్యాయి. వీటిలో ఐక్యరాజ్య సమితి నిర్వహిస్తున్న పాఠశాలలు అనేకం వున్నాయి. ఆ ప్రాంతంలో 9 స్కూళ్లు పూర్తిగా ధ్వంసం కాగా, మరో మూడు స్కూళ్ళు పాక్షికంగా ధ్వంసమైనట్లు ఉపగ్రహ చిత్రాల ద్వారా వెల్లడైంది. దాదాపు 600కి పైగా నిర్వాసిత కుటుంబాలు ఈ స్కూళ్లలో జీవిస్తున్నాయి. సెంట్రల్ గాజాలోని బురెజి శరణార్ధ శిబిరంపై ఇజ్రాయిల్ బలగాలు బాంబు దాడి జరపడంతో ఏడుగురు మరణించగా, అనేకమంది శిధిలాల్లో చిక్కుకుపోయారని సహాయక కార్యకర్తలు తెలిపారు. వెస్ట్ బ్యాంక్‌లో 30మంది పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఈజిప్ట్‌లో మూడు రోజుల పాటు పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో ఆయన గాజా కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు జరుగుతున్న కృషిని చర్చించనున్నారు. ఇప్పటివరకు గాజాలో 41,252మంది మరణించగా, 95,497మంది గాయపడ్డారు. గాజాలో కొనసాగుతున్న మారణహోమాన్ని అంతర్జాతీయ మీడియా దృష్టికి రానివ్వకుండా పూర్తిగా బహిష్కరించడంపై జర్మనీ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఇటీవలి చరిత్రలో ఇలాంటి ఉదంతాలు అనూహ్యమైనవని పేర్కొంది. గాజా నుండి రిపోర్టింగ్ చేయడానికి జర్మన్ మీడియాను అనుమతించాల్సిందిగా కోరింది. ఈ మేరకు పలు వార్తా పత్రికలు, సంస్థలు, బ్రాడ్‌కాస్టర్లు బహిరంగ లేఖ రాశాయి. రాఫా సరిహద్దు గుండా గాజాలోకి వెళ్లడానికి అనుమతించాల్సిందిగా ఈజిప్ట్‌ను కూడా వారు కోరారు.

బహుళ ధృవ ప్రపంచంలో బ్రిక్స్ మీడియా గురుతర బాధ్యత

- సదస్సులో నేతల ప్రతిన

మాస్కో : బహుళ ధృవ ప్రపంచంలో మరింత గురుతరమైన బాధ్యత పోషించాలని బ్రిక్స్ మీడియా నేతలు ప్రతిన చేశారు. శనివారం మాస్కోలో ప్రారంభమైన బ్రిక్స్ మీడియా సదస్సులో 40కి పైగా దేశాలకు చెందిన 60కి పైగా బ్రిక్స్ మీడియా నేతలు పాల్గొన్నారు. శతాబ్ద కాలంలో ఎన్నడూ చూడని మార్పులు ఈనాడు ప్రపంచంలో చోటు చేసుకుంటున్నాయని, అంతర్జాతీయ బహుళ పక్ష పాలనా వ్యవస్థ తీవ్రమైన సవాళ్ళను ఎదుర్కొంటోందని బ్రిక్స్ మీడియా ఫోరమ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, జిన్హువా వార్తా సంస్థ అధ్యక్షుడు ఫు హువా పేర్కొన్నారు. ఉమ్మడి అభివృద్ధిని, శ్రేయస్సును బ్రిక్స్ దేశాలు చురుకుగా పెంచి పోషిస్తున్నాయని అన్నారు. అనిశ్చితితో కూడిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఒక స్థిరత్వాన్ని తీసుకురావడానికి కృషి చేస్తున్నాయన్నారు. ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి భద్రతలు సమర్ధవంతంగా కాపాడేందుకు, నిత్యం మార్పులకు లోనవుతున్న ప్రపంచంలో సుస్థిరతను చొప్పిస్తున్నాయని పేర్కొన్నారు. రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్ వీడియో సందేశం పంపారు. బ్రిక్స్‌కు విశిష్టమైన బహుముఖ సహకార యంత్రాంగం వుందని, అన్ని పక్షాలు కూడా అనేక సంవత్సరాల పాటు సమర్ధవంతమైన సహకారాన్ని అందించుకుంటున్నా యని పేర్కొన్నారు. ప్రస్తుతం బ్రిక్స్ మీడియా సహకారం పెరుగుతూ వస్తోందన్నారు. దేశాల మధ్య సంబంధాలన అభివృద్ధిపరచడంలో, ప్రజల మధ్య మిత్రత్వాన్ని మరింత బలోపేతం చేయడంలో, పరస్పర విశ్వాసం, అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. వివిధ దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక సహకారాన్ని బలోపేతం చేయడమే కాకుండా దేశాల ప్రజల మధ్య స్నేహ బంధాన్ని నిర్మించడంలో కూడా క్రియాశీలంగా పాల్గొనాలని టాస్ డైరెక్టర్ జనరల్ ఆండ్రీ కొండ్రషొవ్ అన్నారు.




మీకోసం

ములక్కాయలు ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే వాటిని ఒకవైపు నీటిలో ముంచి వుంచాలి.

జీవన సౌరభం

నిన్నటి గురించి బాధపడకుండా, రేపటి గురించి ఆలోచించ గలిగిన వ్యక్తికి విజయం అందినట్లే.

చెట్టు మనది



వనపురమున కుక్కయుండె
ఆకలితో తిరుగుచుండె
అది పిల్లి కోసమనుచూ
వీధి వీధి వెదకుచుండె

పిల్లి కూన కానిపించె
కుక్క దాని వెంబడించె
అది పరుగున వెళ్లి
చెట్టునెక్కి కోతి చూచె

నా చెట్టని కోతి యనెను
పిల్లి కూన నాది యనెను
రెండింటికి తగవు జరగ
కుక్క అక్కడికి వచ్చెను

కుక్క చెట్టు నాదనెను
వాటిని దిగి పొమ్మనెను
అవి రెండూ ఒక్కటయ్యి
కుక్కను వెళ్లి పొమ్మనెను

కోతి కుక్కతో పలికెను
చెట్టు నీది అయినపుడు
ఎందుకు నీవెక్కలేవు
ఎక్కి చెంత చేరమనెను.

కుక్క యెంత శ్రమపడినను
చెట్టు ఎక్కరాదయ్యెను
పిల్లి కోతి నవ్వుకొనుచు
చెట్టు మాది యని పలికెను

కుక్క ఆ పిల్లి కొరకును
చూసి చూసి అది విసిగెను
కోతి చెట్టుకున్న కాయ
దాని మీద పడవేసెను

కుక్కయు భౌ భౌ మనుచును
అటనుండి పారిపోయెను
పిల్లి ఆ కోతి మెచ్చుచు
కృతజ్ఞతలనుచు పలికెను


కోతి మామ చెట్టు మనది
మననే ఎక్కనిచ్చినది
పోట్లాడక కలిసి యుంటె
నేనూ మీ దాన్నన్నది

పిల్లలూ! కడు సాయపడిన
మరవదు ఏ ప్రాణియైన
మీ కీర్తీ చిరకాలము
ప్రకాశించు ఉర్విలోన

- సంగనభట్ల చిన్న రామకిష్టయ్య, ధర్మపురి.
99085 54535.

సరైన పదాలు రాయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మలను ఆంగ్లంలో ఏమంటారో వాటి పక్కనే ఉన్న గళ్లల్లో రాయండి. (క్లూ ఉంది చూడండి)



నేను గీసిన బొమ్మ





వై.హాశ్రీ,
5వ తరగతి,
నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్,
విజయనగరం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆ ఇల్లే ఒక గ్రంథాలయం

పుస్తకాలు చదవడం ఇష్టం లేక, చదువుపై అంతగా శ్రద్ధ పెట్టక, పదో తరగతి ఫెయిల్ అయ్యాడు తిరుమలాయ్‌కుమార్. తమిళనాడు టెన్‌కాసీకి చెందిన తిరుమలాయ్ ఇక చదువుకు స్వస్తి చెప్పి తాతముత్తాతల నుండి వస్తున్న నేతపనిలో ఉండిపోదామనుకుని నిర్ణయించుకున్నాడు. అప్పుడే అతనికి ఓ కనువిప్పు కలిగింది. అది తన జీవితాన్ని ఎంతగానో మార్చివేసింది. ఎంతోమంది విద్యార్థులకు, నిరుద్యోగులకు మార్గనిర్దేశకంగా ఉండేలా ఇప్పుడు ఈ పదోతరగతి తప్పిన తిరుమలాయ్ సొంతంగా 1500 పుస్తకాలతో తన ఇంట్లోనే ఓ గ్రంథాలయం నడుపుతున్నాడు.





'పరీక్ష ఫెయిల్ కావడంతో పుస్తకాలను పక్కనబెట్టేశాను. అప్పుడే టీవీలో ఐఎఎస్ అధికారి వి. ఇరాయ్ అంబు చదువు విలువ గురించి, పుస్తక పఠనం గురించి చెప్పిన సందేశాలు విన్నాను. అవి నాలో చాలా స్ఫూర్తిని కలిగించాయి. పరీక్షలు రాసి పాసయ్యాను. అయితే అక్కడితో నాకు తృప్తి కలగలేదు. నా చుట్టూ నాలాంటి వారు ఎంతోమంది ఉన్నారు. వారందరికీ పుస్తకాల విలువ చెప్పాలనుకున్నాను. అప్పుడే గ్రంథాలయం ఆలోచన వచ్చింది' అని తన జీవితాన్ని మార్చివేసిన సందర్భాలను తిరుమలాయ్ గుర్తుచేసుకున్నాడు.

ఆలోచన రావడంతోనే ఇంటి టెర్రస్‌పై ఓ పూరిపాకలో 'అరిగ్నర్ అన్నా అరివుకూదమ్' పేరుతో గ్రంథాలయం స్థాపించాడు. 'పరీక్ష ఎలాగో పోయింది కాబట్టి, ఇక బట్టలు నేయడంలో అమ్మానాన్నకు సాయంగా ఉందామనుకున్నాను. అప్పుడే పుస్తకాలపై మక్కువ కూడా ఏర్పడేసరికి రెండింటినీ వదులుకోలేకపోయాను. లైబ్రరీలను సందర్శించడం, సొంతంగా పుస్తకాలు సేకరించడం చేస్తూనే, చీరలు నేసే వాడిని. పుస్తకాలు కొనడం కోసం అదనంగా పనిచేసేవాడిని. అలా అలా మా ఇల్లంతా పుస్తకాలతో నిండిపోయింది. అప్పుడే గ్రంథాలయ ఆలోచన వచ్చింది. ఫ్రెండ్ సాయంతో 2013లో గ్రంథాలయం స్థాపించాను. క్రమంగా నా గ్రంథాలయానికి బాగా ప్రాచుర్యం వచ్చింది. స్కూలు పిల్లలు, నిరుద్యోగులు క్రమం తప్పకుండా వచ్చారు. వారి ఉత్సాహం చూసి మరిన్ని పుస్తకాలు కొనాలని రాత్రుళ్లు కూడా పనిచేశాను. కొన్నాళ్లకు పూరిగుడిసెలో మొదలుపెట్టిన గ్రంథాలయం నెమ్మదిగా దెబ్బతింటూ వచ్చింది. ఇప్పుడు నాకు మరో సవాలు ఎదురైంది. పుస్తకాలు కొనడానికే నానా ఇబ్బందులు పడుతున్న నేను గ్రంథాలయం కోసం మరో సురక్షిత ప్రాంతాన్ని ఏర్పాటుచేసుకోవాలి. అప్పుడే ఓ లక్ష రూపాయలు అప్పు చేసి కాంక్రీటుతో గది ఏర్పాటుచేశాను. ఇక్కడ ఆర్ట్స్, సైన్స్, ఆధ్యాత్మికత, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలతో పాటు అన్ని విభాగాల్లోని ప్రభుత్వ ఉద్యోగాల కోసం అవసరమయ్యే పుస్తకాలను ఉంచుతాను. ఈ పుస్తకాలు కొనడం కోసం, కుటుంబానికి సాయంగా ఉండడం కోసం పగలు, రాత్రుళ్లు కూడా పనిచేస్తున్నాను. అయితే ఆ ఆదాయం సరిపోవడం లేదు. దీంతో ఓ మోటారు షోరూమ్‌లో కూడా పని వెతుక్కున్నాను' అంటున్న తిరుమలాయ్ పుస్తకాలని ఎంతలా ప్రేమిస్తున్నాడో కదూ..

ఇంత తీరిక లేకుండా గడుపుతున్నా తన లైబ్రేరీకి వచ్చే పిల్లలకు బోధించేందుకు కొంత సమయం కేటాయిస్తున్నాడు తిరుమలాయ్. 'ఇక్కడికి వచ్చే వారి దగ్గర నుండి ఒక్క పైసా కూడా వసూలు చేయను. ఆసక్తి గల పాఠకులకు వీలైనన్ని పుస్తకాలు అందేలా చేయడంలోనే నాకు అమితమైన ఆనందం ఉంది' అంటున్న ఈ పుస్తక ప్రేమికుడు తన గ్రంథాలయం కోసం దాతలెవరైనా పుస్తకాలు దానం చేయమని అభ్యర్థిస్తున్నాడు. సమాజ హితం కోసం తమ వంతు సాయంగా ఎంతోమంది ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. వారందరిలో భవిష్యత్తు తరాల కోసం జ్ఞానసముపార్జన చేయిస్తున్న తిరుమలాయ్ లాంటి గ్రంథాలయ నిర్వాహకుల కృషి వెలకట్టలేనిది.

'ఐరన్' వీటన్నింటిలోనూ..

ప్రపంచవ్యాప్త జనాభాలో సుమారు 15 శాతం మంది ఐరన్ లోపంతో బాధపడుతున్నారు. బలహీనత, పాలిపోవడం, అలసట, ఊపిరి ఆడకపోవడం, జుట్టు రాలడం, వేలుగోళ్లు పెళుసుగా మారడం, చర్మం పొడిగా మారడం వంటివి ఐరన్ లోపం లక్షణాలు. అయితే ఈ ఐరన్ లోపానికి చెక్ పెట్టాలంటే చాలామంది పాలకూర ఒక్కటే సరైన ఆహారం అనుకుంటారు. కానీ ఇతర పదార్థాలతో కూడా ఐరన్ లోపాన్ని నివారించుకోవచ్చు.

మెంతులు



ఫోలిక్ యాసిడ్, రైబోఫ్లావిన్, మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్లు పొటాషియం, కాపర్, క్యాల్షియం, ఐరన్, మాంగనీస్, విటమిన్ ఎ, బి6, సి, కె వంటి అనేక పోషకాలు ఉండే మెంతులు వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇవి డయాబెటిస్, అధిక బరువు, పీరియడ్ క్రాంప్స్ వంటి ప్రాబ్లమ్స్‌తో పాటు ఐరన్ లోపాన్ని నివారిస్తాయి.

ఖర్జూరం



ఐరన్ కంటెంట్ పెరగడానికి ఖర్జూర మంచి మెడిసిన్‌లా పనిచేస్తుంది. ఖర్జూరాను ప్రతిరోజూ రాత్రి నానబెట్టి తింటే రక్తహీనత మెరుగుపడుతుంది. వీటిలో మెగ్నీషియం, ఫాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉటాయి. ఖర్జూరాలో ఉండే ఫైబర్ కంటెంట్ హెల్తీగా ఉండేలా చేస్తుంది.

వేరుశెనగ



వేరుశెనగలో ఫైబర్, ప్రొటీన్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి తీసుకున్నట్లైతే ఎముకలు బలంగా మారుతాయి. వేయించిన వేరుశెనగలు తింటే గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. వెయిట్ లాస్ కూడా అవ్వొచ్చు. వీటిని రోజూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఐరన్ లోపానికి చెక్ పెట్టొచ్చు.

దుంపలు



ఐరన్ కంటెంట్ అధికంగా ఉండే బీట్‌రూట్, చిలకడదుంపలు, బంగళాదుంపలు డైట్‌లో చేర్చుకుంటే ఐరన్ లోపాన్ని తరిమికొట్టొచ్చు. దుంపల్లో ఐరన్ కంటెంట్ మాత్రమే కాకుండా రాగి, మెగ్నీషియం, భాస్వరం, విటమిన్ బి1, బి2, బి6, బి12, విటమిన్ సి వంటి పోషకాలు ఉంటాయి.

టాలీవుడ్‌లో కలకలం.. పరిష్కారం దిశగా ప్యానెల్



టాలీవుడ్‌లో లైంగిక వేధింపుల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదైన సంగతి తెలిసిందే. జానీ మాస్టర్ వివాదంపై తాజాగా టాలీవుడ్ లైంగిక వేధింపుల పరిష్కార ప్యానెల్ ప్రెస్ మీట్ పెట్టింది. తమ్మారెడ్డి భరద్వాజ్, ఝాన్సీతో పాటు ప్యానెల్ సభ్యులు ఇందులో పాల్గొన్నారు. 'బాధితురాలు మొదట మీడియాను ఆశ్రయించింది. మీడియా ఈ ఘటనను మా దృష్టికి తీసుకొచ్చింది. దీనిపై లీగల్‌గా విచారణ జరుగుతోంది. వేధింపులు ఎదుర్కొన్న సమయంలో ఆ అమ్మాయి మైనర్. ఆమెకు న్యాయ సహాయం అవసరం. ఇద్దరి తరపున వాదనలు విన్నాం. అమ్మాయిలు ఎవరైనా కంప్లైంట్ చేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. 'సంగీత, ప్రేమ, ప్రగతి తదితరలు 'వాయిస్ ఆఫ్ విమెన్'లో భాగం. ఇటీవల సమంత దీని గురించే పోస్ట్ పెట్టారు. 'వాయిస్ ఆఫ్ విమెన్' ఇండస్ట్రీకి సంబంధించిందే తప్ప సెపరేట్ కాదు. ఎప్పుడైతే పెద్దవాళ్లు మాట్లాడతారో అప్పుడే దాని గురించి చర్చ జరుగుతుంటుంది. మా వద్దకు వచ్చిన ఫిర్యాదుల సంఖ్య సింగిల్ డిజిట్‌లోనే ఉంది. కొన్నింటికి తక్షణమే పరిష్కారం చూపాం. కమిటీలకు సివిల్ కోర్టుకు ఉండే పవర్స్ ఉంటాయి. జానీ మాస్టర్‌పై ఫిర్యాదు చేసిన అమ్మాయి విషయాకొస్తే.. పని ప్రదేశంలో లైంగిక వేధింపులు ఎదుర్కోవడమే కాదు వేరే ఎన్నో విషయాలు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. లీగల్‌గా, మెడికల్‌గా, పోలీసుల సాయం తీసుకోవడానికి ఒకవేళ ఆ అమ్మాయికి తగిన ధైర్యం/బలం లేకపోతే కమిటీ హెల్ప్ చేయగలగాలి' అని ఝాన్సీ పేర్కొన్నారు. 'ఇలాంటి కేసుల కోసమే 2013లో ఆసరా అని పెట్టాం. 2018లో ప్యానల్ పెట్టాం. ఇలాంటివి ఎన్ని తీసుకొచ్చినా మహిళలకు ధైర్యం ఇవ్వలేకపోతున్నాం. ఇండస్ట్రీలో మహిళలు సేఫ్‌గా ఉంటారని తెలియజేయడానికే ఈరోజు ప్రెస్ మీట్ పెట్టాం. 90 రోజుల్లో దీనికి పరిష్కారం ఆలోచిస్తాం. మీడియా సహకారంతోనే ఏదైనా సాధ్యమవుతుంది. అని తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు.

ఫిర్యాదు చేయండిలా : టీఎఫ్‌సీసీ

లైంగిక వేధింపులు ఎదుర్కొన్న వారు ఫిర్యాదు చేయాలని టీఎఫ్‌సీసీ ఓ ప్రకటనలో కోరింది. హైదరాబాద్‌లోని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫీస్ వద్ద ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కంప్లైట్ బాక్స్ అందుబాటులో ఉంటుందని పేర్కొంది. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, డి. రామానాయుడు బిల్డింగ్ కాంప్లెక్స్, ఫిల్మ్‌నగర్, జూబ్లీహిల్స్ హైదరాబాద్- 500 096 చిరునామాకు పోస్ట్ ద్వారా అయినా ఫిర్యాదు చేయొచ్చని తెలిపింది. ఫోన్ నంబరు: 98499 72280, మెయిల్ ఐడీ: complaints@telugufilmchamber.in ద్వారా కంప్లైట్స్ ఇవ్వొచ్చని విజ్ఞప్తి చేసింది.

ఆసియా ఛాంప్ భారత్

- ఫైనల్లో చైనాపై 1-0తో గెలుపు
- ఐదోసారి ట్రోఫీ చేజిక్కించుకొని టీమిండియా నయా చరిత్ర



హులన్‌బెయిర్(చైనా): ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ మరోసారి చేజిక్కించుకుంది. మంగళవారం జరిగిన ఫైనల్లో భారత్ 1-0తో ఆతిథ్య చైనాపై విజయం సాధించింది. ఫైనల్లో జుగ్‌రాజ్ సింగ్ నాల్గో క్వార్టర్‌లో గోల్‌ను చేయడంతో టీమిండియా ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ప్రత్యర్థికి ఛాన్స్ ఇవ్వకుండా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ నేతృత్వంలోని బృందం కప్‌ని సొంతం చేసుకుంది. ఆసియా ఛాంపియన్స్ హాకీ టైటిల్‌ని భారత్ ఇప్పటి వరకు ఐదుసార్లు నెగ్గింది. ఆ తర్వాత పాక్ మూడుసార్లు ట్రోఫీని కైవసం చేసుకుంది. 2021లో దక్షిణకొరియా టైటిల్‌ని నెగ్గింది. చైనా ఫైనల్‌కు చేరుకోవడం ఇదే తొలిసారి. టోర్నీ చరిత్రలోనే తొలిసారిగా అత్యుత్తమంగా ఫైనల్‌కు చేరింది. భారత్ గ్రూప్ దశలో జపాన్‌ను 5-1 తేడాతో ఓడించింది. చైనాను 3-0, మలేషియాపై 8-1, దక్షిణ కొరియాను 3-1తోపాటు పాకిస్థాన్‌పై ఉత్కంఠ పోరులో 2-1 తేడాతో విజయం సాధించింది. ఇక సెమీఫైనల్లో దక్షిణ కొరియాపై 4-1 తేడాతో విజయం సాధించింది. హర్మన్‌ప్రీత్ సింగ్ నేతృత్వంలోని భారతజట్టు చరిత్రలో తొలిసారిగా వరుసగా రెండుసార్లు టైటిల్స్‌ను నిలబెట్టుకుంది. గతేడాది చెన్నైలో జరిగిన ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్ 4-3 గోల్స్‌తో మలేషియాను ఓడించింది. గతంలో 2021, 2016లో భారత్ ట్రోఫీని నెగ్గింది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ ఏడు గోల్స్‌తో పోటీలో అత్యధిక గోల్స్ చేసిన రెండో ఆటగాడిగా నిలువగా.. దక్షిణ కొరియాకు చెందిన యాంగ్ జి-హున్ అగ్రస్థానంలో నిలిచాడు.

ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ అవార్డు గ్రహీతలు..,

అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడు	యంగ్ జిహున్(9గోల్స్) కొరియా
ప్రామిసింగ్ గోల్‌కీపర్ ఆఫ్ ది టోర్నమెంట్	కిమ్ జిహన్(కొరియా)
అత్యుత్తమ గోల్ కీపర్ ఆఫ్ ది టోర్నమెంట్	వాంగ్ కియు(చైనా)
రైజింగ్ స్టార్ ఆఫ్ ది టోర్నమెంట్	హనన్ షాహిద్(పాకిస్తాన్)
ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్	హర్మన్‌ప్రీత్ సింగ్(ఇండియా)

డాన్ పిక్చర్స్‌లో 'డి 52'



వరుస సినిమాలతో బిజీగా ఉన్న ధనుష్ కెరీర్‌లో 52వ సినిమా రానుంది. ఈ చిత్రానికి తానే దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాను ఆకాష్ బాస్కరన్, డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఈ మేరకు ఒక పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. 'డాన్ పిక్చర్స్ బ్యానర్ లో రానున్న మొదటి ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్రకటించడానికి సంతోషిస్తున్నాము, ఇది మా ప్రొడక్షన్ హౌస్‌కి ఒక ముఖ్యమైన మైలురాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేక్షకులను అలరించడానికి, ధనుష్ ఫ్యాన్స్‌కు వినూత్నమైన కంటెంట్‌ను రూపొందించడానికి సిద్ధంగా ఉన్నాము. ఈ అద్భుతమైన అవకాశం ఇచ్చినందుకు మేము ధనుష్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాము' అని నిర్మాత ఆకాష్ భాస్కరన్ తెలిపారు.

కాంచన-4లో పూజాహెగ్డే



రాఘవ లారెన్స్ కథానాయకుడిగా వచ్చిన 'కాంచన' సిరీస్‌లో భాగంగా నాలుగో భాగం తెరకెక్కుతుంది. ఇందులో హీరోయిన్‌గా పూజాహెగ్డే నటించే అవకాశాలున్నాయి. ఈ మేరకు సంప్రదింపులుజరుపుతున్నామని చిత్ర యూనిట్ ప్రకటించింది. 'కాంచన-4 స్క్రిప్ట్ ఇప్పటికే సిద్ధమైంది. గోల్డ్‌మైన్స్ సంస్థ నిర్మాణానికి ముందుకువచ్చింది. ముందుగా మృణాల్‌ఠాకూర్, మాళవిక మోహనన్ పేర్లు వినిపించినప్పటికీ తాజాగా పూజాహెగ్డే వైపే మొగ్గుచూపుతున్నట్లుగా సమాచారం. లారెన్స్ 'హంటర్' చిత్రాన్ని కూడా ఇదే సంస్థ నిర్మిస్తోంది.



అక్టోబరు 31న సత్యదేవ్ 'జీబ్రా'

సత్యదేవ్, డాలీ ధనంజయ హీరోలుగా ఈశ్వర్ కార్తీక్ తెరకెక్కిస్తున్న చిత్రం 'జీబ్రా'. లక్ ఫేవర్స్ ది బ్రేవ్.. అన్నది ఉపశీర్షిక. క్రైమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రానుంది. అక్టోబర్ 31న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తాజాగా చిత్రబృందం ఓ వీడియో ద్వారా తెలియజేసింది. ప్రియా భవానీ శంకర్, జెన్నిఫర్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో సునీల్ కీలకపాత్రలో కనిపించనున్నారు.

పురుషులతో సమానంగా మహిళా క్రికెటర్లకూ ప్రైజ్ మనీ

- టి20 ప్రపంచకప్ నుంచి అమలు: ఐసిసి

దుబాయ్: టి20 మహిళల ప్రపంచకప్ ప్రైజ్ మనీ విషయంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే నెలలో యుఎఇ వేదికగా జరగనున్న మహిళల టి20 ప్రపంచకప్‌లో పురుష క్రికెటర్లతో సమానంగా ప్రైజ్‌మనీ అందజేయనున్నట్లు ప్రకటించింది. దీంతో టి20 టైటిల్‌ని నెగ్గిన జట్టు 23.40లక్షల అమెరికన్ డాలర్లు ప్రైజ్‌మనీ దక్కనున్నది. అంటే భారతీయ కరెన్సీలో దాదాపు 19.60కోట్లు. గతేడాది దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన మహిళల టి20 ప్రపంచకప్ నెగ్గిన జట్టుకు రూ.8.37కోట్ల ప్రైజ్‌మనీ దక్కింది. ఈ ఏడాది అమెరికా, వెస్టిండిస్ వేదికగా జరిగిన టీ20 వరల్డ్ కప్ గెలిచిన టీమిండియా పురుషుల జట్టుకు రూ.23.40లక్షల అమెరిన్ డాలర్ల ప్రైజ్‌మనీ లభించిన విషయం తెలిసిందే. తాజాగా జరిగే మహిళల టి20 విజేతకు సైతం అంతే మొత్తంలో ప్రైజ్‌మనీ దక్కబోతుంది. గతేడాదితో పోలిస్తే ప్రైజ్‌మని 134శాతం పెరిగింది. ఐసిసి జూలై 2023లో జరిగిన ఐసిసి వార్షిక సమావేశంలో ప్రైజ్‌మనీపై నిర్ణయం తీసుకుంది. ఐసిసి తాజా నిర్ణయంతో క్రికెట్ వరల్డ్ కప్‌లో మెన్స్, వుమెన్స్ జట్టుకు సమానంగా ప్రైజ్‌మని ఇచ్చే తొలి క్రీడగా క్రికెట్ నిలిచింది. త్వరలో జరగనున్న మహిళల టి20 ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన జట్టుకు ఇప్పుడు 1.7 మిలియన్ అమెరికన్ డాలర్లు అంటే రూ.14.24కోట్లు దక్కనుంది. గతంలో రన్నరప్‌కు రూ.4.18కోట్లు దక్కేది. రన్నరప్ ప్రైజ్ మనీ సైతం 134 శాతం పెరగడం విశేషం. సెమీఫైనల్స్‌లో ఓడిన జట్లకు, గ్రూప్ దశలో నిష్క్రమించిన జట్లకు సైతం ప్రైజ్‌మనీని ఐసిసి పెంచింది. ఇక షార్జా వేదికగా అక్టోబర్ 3నుంచి మహిళల టి20 ప్రపంచకప్ జరగనుంది.

హాకీ అత్యుత్తమ ఆటగాళ్ల జాబితాలో హర్మన్‌ప్రీత్, శ్రీజేశ్

- ఎఫ్‌ఐహెచ్ అవార్డులకు నామినేట్



లాసన్నె: భారత హాకీజట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, మాజీ గోల్‌కీపర్ పిఆర్ శ్రీజేశ్ అత్యుత్తమ ఆటగాళ్ల జాబితాలో చోటు దక్కించు కున్నారు. అంతర్జాతీయ హాకీ సమాఖ్య(ఎఫ్‌ఐహెచ్) 2024 ఏడాదికి పురుషుల 'ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు'కు ఎంపిక చేసిన ఆటగాళ్ల జాబితాను ప్రకటించింది. ఆ జాబితాలో హర్మన్‌ప్రీత్ సింగ్ అత్యుత్తమ ఆటగాళ్ల కోటాలో చోటు దక్కించుకోగా.. గోల్‌కీపర్ల కోటాలో పిఆర్ శ్రీజేశ్‌కు చోటు దక్కింది. వీరితోపాటు థర్రీ బ్రింక్‌మన్(నెదర్లాండ్స్), జో డీ మోల్(నెదర్లాండ్స్, హానర్స్ ముల్లర్(జర్మనీ), జచ్ వల్లెస్(ఇంగ్లండ్) కూడా ఉన్నారు. గోల్‌కీపర్ల కోటాలో పిఆర్ శ్రీజేశ్‌తోపాటు పిర్మిన్ బ్లాక్(నెదర్లాండ్స్), లూయిస్ కాల్జాడో(స్పెయిన్), జీన్ పాల్ డాన్బెర్గ్(జర్మనీ), టోమస్ శాంటియాగో(అర్జెంటీనా)లనుంచి అత్యుత్తమ ఆటగాళ్ల అవార్డు జాబితాలో ఉన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతక పోటీలో భారత్ 2-1గోల్స్ తేడాతో స్పెయిన్‌ను చిత్తుచేయడంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్, పిఆర్ శ్రీజేశ్ ముఖ్యపాత్ర పోషించారు. అలాగే 10గోల్స్ కొట్టి హర్మన్‌ప్రీత్ అత్యుత్తమ ఆటగానిగా ఎంపికయ్యాడు. ఇక గోల్‌కీపర్ శ్రీజేశ్ గ్రేట్ బ్రిటన్‌తో మ్యాచ్ సందర్భంగా అమిత్ రోహిదాస్ రెడ్‌కార్డుకు గురై 10మందితో ఆటగాళ్లతో ఆడాల్సి వచ్చినా.. భారత గోల్‌పోస్ట్‌ముందు అడ్డుగోడగా నిలిచి టీమిండియా గెలుపులో కీలకపాత్ర పోషించాడు. 2024లో హాకీ టెస్ట్ మ్యాచ్‌లు, ఎఫ్‌ఐహెచ్ ప్రొ లీగ్, హాకీ నేషన్స్, ఒలింపిక్ క్వాలిఫయర్స్, ఒలింపిక్స్ గేమ్స్ సహా అన్ని అంతర్జాతీయ మ్యాచ్‌ల డేటానుంచి అత్యుత్తమ ఆటగాళ్లను ఎంపిక చేయడం జరుగుతుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68